ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 19.05.2025 | సంపుటి : 11 సంచిక : 300 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# గుల్జార్‌హౌస్‌లో ఘోర అగ్నిప్రమాదం



చార్మినార్‌కు అత్యంత సమీపంలోని గుల్జార్‌హౌస్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో మొదటి అంతస్తులో చెలరేగుతున్న అగ్నికీలలు

## చార్మినార్‌కు అత్యంత సమీపంలో జరిగిన దుర్ఘటనలో 17 మంది మృతి





అగ్నిప్రమాదంలో స్పృహ తప్పిపోయిన బాలుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తున్న ఫైర్ సిబ్బంది

గుల్జార్‌హౌస్‌లో సంభవించిన అగ్నిప్రమాదంలో భవనంలో చెలరేగిన భారీ అగ్నికిలలను అర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

### మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులు

- క్షతగాత్రులకు పలు ఆస్పత్రుల్లో చికిత్స
- షాట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం
- ఘటన అత్యంత దురదృష్టకరం
- ప్రభుత్వం అండగా ఉంటుంది
- మృతులకు రూ.5లక్షల చొప్పున పరిహారం
- ఘటన అత్యంత బాధాకరం: రాహుల్
- సీఎం రేవంత్ రెడ్డికి మల్లికార్జున ఖర్గే ఫోన్
- కేసీఆర్, కేటీఆర్,హరీశ్‌ల దిగ్భ్రాంతి
- బాధితులకు అండగా ఉంటామని వెల్లడి

**హైదరాబాద్(జనంసాక్షి):**

నగరంలోని చార్మినార్ పరిధిలో ఘోర విషాదం చోటుచేసుకుంది. చార్మినార్‌కు సమీపంలోని గుల్జార్ హౌస్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. భవనం మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 17 మంది మృతిచెందారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు, నలుగురు మహిళలు ఉన్నారు. ప్రమాదంతో భవనంలో ఉన్న పలువురు ఊపిరి ఆడక స్పృహ కోల్పోయారు. దీంతో వారిని ఉస్మానియా, యశోద (మలక్‌పేట), డీఆర్డీవో అపోలో ఆస్పత్రులకు తరలించారు. కొందరు ఘటనాస్థలంలో.. మరికొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మృతి చెందారు.వారిని ప్రహ్లాద్ (70),మున్నీ (70),రాజేందర్ మోదీ (65),సుమిత్ర (60),హమేయ్(7),అభిషేక్ (31),శీతల్ (35),ప్రియాంశ్ (4),ఇరాజ్ (2), మిగతా 2లో..

### అగ్ని ప్రమాద ఘటన కలచివేసింది

- ముఖ్యమంత్రి రేవంత్ దిగ్భ్రాంతి
- ఘటనపై విచారణకు ఆదేశం



అగ్ని ప్రమాద ఘటనపై సీఎం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 17 మంది మృతి చెందడం బాధాకరమని, బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని,క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. బాధిత కుటుంబసభ్యులతో మిగతా 2లో..

### మోదీ దిగ్భ్రాంతి



మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు.. క్షతగాత్రులకు రూ.50 వేల పరిహారం

చార్మినార్ పరిధి గుల్జార్‌హౌస్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదంలో పలువురి మృతి కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు మిగతా 2లో..

## సచివాలయంలో సుందరాంగుల సందడి



ప్రపంచ సుందరీమణులంతా హైదరాబాద్ ఆతిథ్యానికి ఫిదా అవుతున్నారు. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలన్నింటినీ చుట్టేస్తున్న ఈ అందగత్తెలు.. తాజాగా తెలంగాణ సచివాలయ సందర్శనకు వెళ్లారు. అక్కడి తెలంగాణ తల్లి విగ్రహానికి నమస్కరించి.. ఫొటోలకు పోజులిచ్చారు. సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. సచివాలయ పరిసరాల్లో కలియతిరిగారు. తెలంగాణ ప్రత్యేక వంటకాలతో రాష్ట్ర ప్రభుత్వం వారికి తేనీటి విందు ఏర్పాటు చేసింది.

### న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థల కంటే
## రాజ్యాంగమే సర్వోన్నతమైనది
### ఇవన్నీ కలిసి మూలస్తంభాలుగా పని చేయాలి: సీజేఐ జస్టిస్ గవాయ్



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థల కంటే భారత రాజ్యాం గమే సర్వోన్నతమైనదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఉద్ఘాటించారు. మూలస్తం భాలుగా ఉన్న ఈ వ్యవస్థలన్నీ కలిసి పని చేయాలని అన్నారు. 52వ సీజేఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. మహారాష్ట్ర, గోవా బార్‌కౌన్సిల్ ఏర్పాటు చేసిన సత్కార కార్యక్రమంలో మాట్లాడారు. భారత్ పురోగతి సాధించడమే కాకుండా ఆర్థిక, సామాజిక రంగాల్లోనూ అభివృద్ధి మిగతా 2లో..

### మహారాష్ట్రలో ఘోర విషాదం

టెక్స్‌టైల్ మిల్లులో జగిరిన అగ్నిప్రమాదంలో యజమాని సహా ఎనిమిది మంది మృతి



### విజయనగరంలో విషాదం..

కారులో ఊపిరి ఆడక నలుగురు చిన్నారుల మృతి



పై వార్తల వివరాలు 12లో

## భారత్‌తో పెట్టుకుంటే మీకే నష్టం..




### పాక్‌కు ఐఎంఎఫ్ హితవు

**న్యూయార్క్(జనంసాక్షి):** పాకిస్థాన్‌కు 1 బిలియన్ డాలర్ల నిధులు మంజూరుకు అంతర్జాతీయ ద్రవ్య నిధి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. అయితే ఈ విషయంలో పాక్ ఐఎంఎఫ్ పలు సూచనలు చేసింది. భారత్‌తో సమస్యల్ని చర్చలతో పరిష్కరించుకోవాలని సూచించింది.ఈ నిధులను మంజూరు చేయడానికి ఐఎంఎఫ్ పలు షరతులు విధించింది. అంతే కాకుండా భారత్‌తో ఉద్రిక్తతలు మిగతా 2లో..

### పక్కా ప్రణాళిక, ఖచ్చితత్వం,సమన్వయంతో
## దాడులు చేశాం



ఆపరేషన్ సిందూర్‌పై ఆర్మీ మరో వీడియో విడుదల

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరుతో దాడులు చేసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి ఇప్పటికే పలు వీడియోలు షేర్ చేసిన భారత సైన్యం.. తాజాగా మరో వీడియోను సోషల్ మీడియాలో పంచుకుంది. వీడియోలో పాక్‌లోని ఉగ్రస్థావరాలపై కచ్చితత్వంతో దాడులు చేయడానికి మిగతా 2లో..

### ఆగస్టుకల్లా 'బెట్టేతండా' ఎత్తిపోతల
## పూర్తి చేస్తాం



- పథకం పూర్తైతే 2వేలకు ఎకరాలకుపైగా సస్యశ్యామలం
- ఈ ఎత్తిపోతల వల్ల లబ్దిపొందేది పెద్ద సంఖ్యలో గిరిజన రైతులే
- బెట్టే తండా,జాన్ పహాడ్ ఎత్తిపోతలను పరిశీలించిన మంత్రి ఉత్తమ్

**హుజూర్‌నగర్ (జనంసాక్షి):** ఆగస్ట్ మాసంతానికి హుజుర్నగర్ నియోజకవర్గం పాలకీడు మండలంలోని బెట్టే తండా ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన పాలకీడు మండలంలోని బెట్టే తండా వద్ద నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకంతో పాటు అదే మండలంలోని జాన్ పహాడ్ ఎత్తిపోతల పథక నిర్మాణాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇది పూర్తి అయితే బెట్టే తండా,పాడే తండా,సజ్జాపురం తదితర గ్రామాలకు చెందిన 2,041ఎకరాలు సస్యశ్యామలంగా మారుతాయని, నీటి లభ్యత ఉన్న ప్రతీ చోట ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి కొత్త ఆయకట్టును సాగిలోకి తేవాలి అన్నది ప్రభుత్వ సంకల్పంగా పెట్టుకుని ముందుకు పోతున్నామన్నారు.అందులో భాగంగానే మూసి నీటితో బెట్టే తండా వద్ద ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తున్నామన్నారు.2,176 మంది రైతాంగానికి లబ్ది చేకూర్చనున్న ఈ ఎత్తిపోతల పథకం మీద ప్రభుత్వం 33.83 కోట్లు ఖర్చు పెడుతుందన్నారు.అంటే ఒక్కో ఎకరాకు లక్షా 66 వేలు ఖర్చు పెట్టి కొత్త ఆయకట్టును సేద్యంలోకి తెస్తున్నట్లు ఆయన వివరించారు.పైగా ఈ ఎత్తిపోతల మిగతా 2లో..

### నేడు నాగర్ కర్నూల్ జిల్లాలో
## సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

ఇందిర సౌర గిరి జల వికాసం పథకాన్ని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి 2లో

### భారత్ చర్యల నేపథ్యంలో..
## పాక్ సైతం విదేశాలకు.



భుట్టో నేతృత్వంలో విదేశాలకు దాయాది నేతలు!

**ఇస్లామాబాద్(జనంసాక్షి):**ఉగ్రవాదంతో అంటకాగుతూ మన దేశంపై విషం చిమ్ముతున్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు ఏడు అఖిలపక్ష బృందాలను విదేశాలకు పంపనున్నట్లు భారత ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో పాక్ సైతం ఇదే రకమైన చర్యలు తీసుకోనున్నట్లు అక్కడి ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. భారత్ తమపై చేసిన దాడుల గురించి మిగతా 2లో..

## అమెరికాకు థరూర్.. యూకేకు రవిశంకర్

విదేశాల్లో పాక్ కుయుక్తుల్ని ఎండగట్టనున్న భారత బృందం


వార్త 2లో

# మళ్లీ భీకర దాడులు

### గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో 103 మంది మృతి

**గాజాస్ట్రిప్(జనంసాక్షి):**ఇజ్రాయెల్– హమాస్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో టెల్ అవీవ్ గాజాపై భీకర దాడులను కొనసాగిస్తోంది. శనివారం అర్ధరాత్రి నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్న పలు నివాసాలు, శిబిరాలపై వైమానిక దాడులు జరపడంతో ఖాన్‌యూనిస్‌లో 29 మంది, ఉత్తర గాజాలో 48 మంది, జబాలియాలోని శరణార్థి శిబిరంలో 26మంది మరణించారని రోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది.మొత్తం 103 మంది మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 9మంది ప్రాణాలు కోల్పోగా.. ఏడుగురు చిన్నారులు మృత్యువాత పడినట్లు అధికారులు పేర్కొన్నారు. పదుల సంఖ్యలో క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. తాజా దాడులపై ఇజ్రాయెల్ సైన్యం ఎటువంటి ప్రకటనా చేయలేదు. కాగా శనివారం ఒక్కరోజే 150 మంది ప్రాణాలు కోల్పోయారని, 450 మందికి గాయాలయ్యాయని గాజా మిగతా 2లో..





### మరో సౌరవ్యవస్థలో
## గడ్డ కట్టిన నీరు

తొలిసారిగా గుర్తించిన జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్

**వాషింగ్టన్(జనంసాక్షి):**జీవుల మనుగడకు ప్రాణాధారమైన నీరు అంతరిక్షంలో మరెక్కడుందోననే ప్రశ్నకు సమాధానం వెతికినట్లు ప్రఖ్యాత జేమ్స్ వెబ్ అంతరిక్ష టెలిస్కోప్ తాజాగా ప్రకటించింది. మన సౌరమండలం తరహాలోనే ఇతర నక్షత్ర వ్యవస్థల్లో గడ్డ కట్టిన స్థితిలో నీరు ఉంటుందనే వాదనకు బలం చేకూరుస్తూ నాసా వారి జేమ్స్ వెబ్ టెలిస్కోప్ మిగతా 2లో..

# విరుచుకుపడ్డ రష్యా



- ఉక్రెయిన్‌పై ఒక్కరాత్రిలోనే ఏకంగా వందల డ్రోన్ల ప్రయోగం
- మాస్కో జరిపిన అతిపెద్ద డ్రోన్ దాడుల్లో ఇది ఒకటి
- వెల్లడించి కీవ్ వర్గాలు
- శాంతి చర్చలు జరిగిన రోజుల వ్యవధిలోనే భారీ దాడులు

**కీవ్(జనంసాక్షి):**ఉక్రెయిన్‌పై రష్యా మరో సారి విరుచుకుపడింది. రాత్రికి రాత్రే ఏకంగా వందలాది డ్రోన్లను ప్రయోగించింది. 2022 ఫిబ్రవరిలో యుద్ధం మొదలు మాస్కో జరిపిన అతిపెద్ద డ్రోన్ దాడుల్లో ఇది ఒకటని ఉక్రెయిన్ వర్గాల సమాచారం. యుద్ధం ముగింపు విషయంలో ఇస్తాంబుల్ వేదికగా ఇరుదేశాల ప్రతినిధుల మధ్య ముఖాముఖి శాంతి చర్చలు జరిగిన రోజుల వ్యవధిలోనే ఈ భారీ దాడులు చోటు చేసుకోవడం గమనార్హం. "కీవ్, నిప్రోపెట్రోవ్స్క, దొనెట్స్క తదితర ప్రాంతాలే లక్ష్యంగా రష్యా దాడులకు తెగబడింది. మిగతా 2లో..



### కాల్పుల విరమణకు ముగింపు తేది ఉండదు

రక్షణ శాఖ వర్గాల వెల్లడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతల అనంతరం కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరుదేశాలు అంగీకరించిన విషయం తెలిసిందే. ఆదివారం భారత్–పాక్ మధ్య కాల్పుల విరమణ ముగుస్తున్నట్లు వస్తున్న వార్తలను రక్షణ శాఖ వర్గాలు ఖండించాయి. కాల్పుల విరమణ అవగాహనకు ముగింపు తేదీ లేదని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ నెల 10న ప్రకటించిన కాల్పుల విరమణ అవగాహనే కొనసాగుతోందని స్పష్టం చేశాయి. ఆరోజు జరిగిన డీజీఎంవో చర్చల్లో నిర్ణయాలే మిగతా 9లో..

# గుల్జార్‌హౌస్‌లో ఘోర అగ్ని ప్రమాదం




ఆరుషి (3),రిషభ్ (4) ప్రథమ్ (ఏడాదిన్నర),అనుయాన్ (3),వర్ష (35),పంకజ్ (36),రజినీ (32),ఇద్దు (4)లుగా గుర్తించారు.షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలానికి అగ్నిమాపక, డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ, పోలీసు సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. భవనంలో ఉన్న మరికొందరిని బయటకు తీసుకొచ్చారు. 10 అగ్నిమాపక యంత్రాలతో సహాయక చర్యలు చేపట్టారు. గుల్జార్ హౌస్ పరిసరాల్లో దట్టంగా పొగ కమ్ముకోవడంతో శ్వాస తీసుకునేందుకు స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

### ఇంట్లోకి చేరే మార్గంలేక.. తలుపులు పగులగొట్టి..

హైదరాబాద్: చార్మినార్ సమీపంలోని గుల్జార్ హౌస్ భవనంలో జరిగిన ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. ఇప్పటి వరకు 17 మంది మృతిచెందినట్లు అధికారులు ప్రకటించారు. ఈ భవనం మొదటి అంతస్తులో వ్యాపారి కుటుంబం నివాసముంటోంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో నగల దుకాణం నిర్వహిస్తున్నారు. వేసవి సెలవుల సందర్భంగా వ్యాపారి వద్దకు బంధువులు వచ్చారు. మంటలు చెలరేగడంతో ఇంట్లో పొగ కమ్ముకుంది. దీంతో ఊపిరాడక పలువురు స్పృహ తప్పి పడిపోయారు. ఘటనాస్థలికి చేరుకున్న సహాయక బృందాలు మంటలు ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించాయి. ఇంట్లోకి పొగ చేరడం.. ఒకే మెట్ల మార్గం ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. నిచ్చెనలతో మొదటి అంతస్తులోకి అగ్నిమాపక సిబ్బంది వెళ్లారు. ఇంట్లోకి చేరే మార్గం లేక తలుపులు పగులగొట్టి స్పృహ తప్పి ఉన్న పలువురిని బయటకు తీసుకొచ్చారు. అనంతరం వారిని అంబులెన్స్‌లలో వివిధ ఆస్పత్రులకు తరలించారు. వారిలో కొందరు మార్గమధ్యలోనే మృతిచెందారు.

### పరిహారం ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

చార్మినార్ గుల్జార్‌హౌస్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగి 17 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించింది.మృతులకు ఒక్కొక్కరికి రూ. 5లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహాతో కలిసి ఆయన ఘటనాస్థలిని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు. "ఈ ఘటనపై అన్ని శాఖల అధికారులతో చర్చిస్తూ, ఎప్పటికప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ ద్వారా ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు చెబుతున్నారు. ఉదయం 6.16 గంటలకు అగ్నిమాపక సిబ్బందికి ప్రమాదం గురించి సమాచారం అందింది. వెంటనే 6.17కి మొగల్‌పుర ఫైర్ ఇంజిన్ సిబ్బంది బయలుదేరి 6.20గంటలకు ప్రమాదస్థలికి చేరుకొని సహాయకచర్యలు చేపట్టారు. ఈక్రమంలో మొత్తం 11 ఫైర్ ఇంజిన్లతోపాటు ఒక రోబోను ఉపయోగించారు. 70 మంది ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు. దీంతో ప్రమాద తీవ్రత మరింత పెరగకుండా నియంత్రించగలిగారు. ఈ ఘటన జరగడం అత్యంత దురదృష్టకరం. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది" అని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు.

### ఘటన అత్యంత బాధాకరం: రాహుల్ గాంధీ

చార్మినార్ పరిధిలోని గుల్జార్‌హౌస్‌లో అగ్నిప్రమాద ఘటనపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదంలో పలువురు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఫోన్ చేశారు. గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాద ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును సీఎం ఆయనకు వివరించారు. ఎప్పటికప్పుడు సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఘటనాస్థలికి మంత్రులు వెళ్లినట్లు చెప్పారు. గుల్జార్‌హౌస్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 17 మంది మృతి చెందారు. మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులున్నారు. ఆదివారం ఉదయం భవనం మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. మంటల్లో చిక్కుకున్న కొందరిని అగ్నిమాపక సిబ్బంది రక్షించి ఉస్మానియా, యశోద (మలక్‌పేట), డీఆర్డీవో అపోలో ఆసుపత్రులకు తరలించారు. విద్యుదాఘాతం వల్లే భవనంలో మంటలు చెలరేగినట్లు అధికారులు తెలిపారు.

గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాద ఘటనపై కేసీఆర్ దిగ్భ్రాంతి

చార్మినార్ సమీపంలోని గుల్జార్‌హౌస్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 17 మంది మృతి చెందడం పట్ల మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందించి కాపాడాలన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు తగిన ఆర్థికసాయం అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గుల్జార్ హౌస్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటన చాలా బాధాకరమని, ఇది తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ప్రమాద బాధితులకు తమ పార్టీ అన్నిరకాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఘటనాస్థలి వద్ద భారాస బృందం అందుబాటులో ఉండి సహాయ కార్యక్రమాలు చేస్తోందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన కేటీఆర్.. గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అగ్నిప్రమాద ఘటన చాలా బాధాకరమని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. మంటల్లో చిక్కుకున్న కుటుంబాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని, క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో, హైదరాబాద్ నగరంలో వరుస అగ్ని ప్రమాద ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో దారుణంగా విఫలమవుతోందన్నారు. వేసవి కాలంలో అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు వ్యూహం అనుసరించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమేనని ఆరోపించారు. అగ్నిప్రమాద మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

చెక్కతో చేసిన ప్యానెళ్ల వల్లే మంటలు వ్యాపించాయి: అగ్నిమాపక డీజీ నాగిరెడ్డి

హైదరాబాద్: విద్యుదాఘాతం వల్లే గుల్జార్‌హౌస్‌లో అగ్నిప్రమాదం జరిగిందని అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి తెలిపారు. ఇంటిలో చెక్కతో చేసిన ప్యానెళ్ల వల్లే మంటలు వ్యాపించాయన్నారు. విద్యుదాఘాతంతో చెక్క మొత్తం కాలి మంటలు వచ్చాయని చెప్పారు."మొదటి అంతస్తులో ఉన్న 17 మందిని ఆసుపత్రికి తరలించాం. నిచ్చెన ద్వారా నలుగురు పైనుంచి కిందికి వచ్చారు. భవనంలో విద్యుత్ సరఫరాకు సంబంధించిన మెయిన్ వద్ద నిత్యం విద్యుదాఘాతం జరుగుతోందని కార్మికులు చెబుతున్నారు. అగ్నిప్రమాద నివారణకు సంబంధించి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోలేదు" అని నాగిరెడ్డి తెలిపారు.



### ప్రమాద ఘటన కలచివేసింది

రేవంత్ ఫోన్‌లో మాట్లాడి ఓదార్చారు. మరోవైపు ఘటనా స్థలాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, అగ్నిమాపకశాఖ డీజీ నాగిరెడ్డి తదితరులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

### మోదీ దిగ్భ్రాంతి

త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50 వేల పరిహారం అందిస్తామన్నారు. గుల్జార్‌హౌస్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 17 మంది మృతి చెందారు. మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులున్నారు. ఆదివారం ఉదయం భవనం మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. మంటల్లో చిక్కుకున్న కొందరిని అగ్నిమాపక సిబ్బంది రక్షించి ఉస్మానియా, యశోద (మలక్‌పేట), డీఆర్డీవో అపోలో ఆసుపత్రులకు తరలించారు. విద్యుదాఘాతం వల్లే భవనంలో మంటలు చెలరేగినట్లు ప్రాథమిక సమాచారం. గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాద ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అగ్నిమాపక సిబ్బందికి సరైన శిక్షణ అందించాలి: కిషన్‌రెడ్డి

గుల్జార్‌హౌస్ వద్ద ఘటనాస్థలాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పరిశీలించారు. అధికారులతో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. ఆదివారం ఉదయం 6 గంటలకు ప్రమాదం జరిగిందని చెప్పారు. సహాయక చర్యల్లో అగ్నిమాపక సిబ్బంది ఆలస్యం చేశారని బాధితులు ఆరోపిస్తున్నారని తెలిపారు. చిన్న ప్రమాదమే అయినా.. ప్రాణ నష్టం ఎక్కువగా ఉందన్నారు. అగ్నిమాపక సిబ్బందికి ప్రభుత్వం సరైన పరికరాలు, శిక్షణ అందించాల్సి ఉందని చెప్పారు. అగ్నిమాపక శాఖ సాంకేతికతను మెరుగుపరుచుకోవాలని అభిప్రాయపడ్డారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాలకు కేంద్రం తరఫున సాయం అందిస్తామని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.




# మరో సౌరవ్యవస్థలో గడ్డ కట్టిన నీరు

పలు సాక్ష్యాధారాలను సంపాదించింది.ఒక యువ నక్షత్ర మండలంలో గడ్డకట్టిన నీటి జాడలను కనిపెట్టినట్లు నాసా తాజాగా ప్రకటించింది. నక్షత్రం చుట్టూ తిరుగుతున్న దుమ్ము ధూళితో కూడిన అంతరిక్ష శిలలు, శకలాలు, శిథిలాల వలయాల్లో నీరు గడ్డకట్టి ఉందని నాసా వెల్లడించింది. మన సౌరవ్యవస్థ వయసుతో పోలిస్తే తక్కువ వయసున్న ఈ కొత్త నక్షత్ర మండలం 'హెచ్‌డీ 181327'మన భూమికి 155 కాంతి సంవత్సరాల దూరంలో ఉందని నాసా తెలిపింది.వెబ్ టెలిస్కోప్ పంపిన 'స్పెక్ట్రా'డేటాలో ఇందుకు సంబంధించిన వివరాలు ఉన్నాయి. విశాల అంతరిక్షంలో ఎక్కడో ఓ చోట నీరు నిక్షిప్తమై ఉంటుందని నాసా వారి స్పిట్జర్ స్పేస్ టెలిస్కోప్ 2008లోనే కొంత డేటాను పంపించింది. ఆ తర్వాత జేమ్స్ వెబ్ టెలిస్కోప్ ఇలా నీటిజాడలను వెతికిపట్టడం ఇదే తొలిసారి. 'కేవలం నీటిని మాత్రమేకాదు మరీముఖ్యంగా స్ఫటికాకృతిలో ఉండే గడ్డ కట్టిన నీటి జాడను వెబ్ టెలిస్కోప్ కనుగొంది.ఈ ధూళి వలయాల్లోని ప్రతి దుమ్ము కణంతో నీటి అణువులు కలిసిపోయి ఉన్నాయి. ఈ అణువులను సమీప-పరారుణ స్పెక్ట్రోగ్రాఫ్ ఉపకరణంతో చూసినప్పుడు ఇవన్నీ మంచు బంతుల్లా కనిపించాయి. గతంలో ఇలాంటి క్రిస్టల్ ఐస్‌ను మన సౌరవ్యవస్థలో శనిగ్రహ వలయాల్లో, క్యూపర్ బెల్ట్‌లో చూశాం"అని ఈ పరిశోధనా పత్రం ముఖ్య రచయిత చెన్ గ్జీ చెప్పారు. చెన్ గ్జీ.. మేరిలాండ్‌లోని జాన్ హాప్కిన్స్ యూనివర్సిటీ(బాల్టిమోర్)లో అసిస్టెంట్ రీసెర్చ్ సైంటిస్ట్‌గా సేవలందిస్తున్నారు. సంబంధిత వివరాలు 'నేచర్'జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. అంతరిక్షంలో నక్షత్రాల చుట్టూతా గ్రహ వ్యవస్థ పురుడుపోసుకోవడానికి నీరే ప్రధాన కారణం. యువ నక్షత్రాల చుట్టూతా పరుచుకున్న దుమ్ము, ధూళి వలయాల్లో ప్రధాన ముడి సరకు నీరే. ఒక రకంగా పట్టిఉంచే నీరు సైతం ధూళి, దుమ్ము గట్టిపడి గ్రహాల ఆవిర్భావానికి దారితీస్తుంది. తక్కువ గురుత్వాకర్షణ సందర్భాల్లో తోకచుక్కలు, గ్రహశకలాల వంటివి ఏర్పడతాయి. ఒకవేళ బలాలు బలపడితే ఇవన్నీ కలగలిసిపోయి పెద్ద గ్రహాలుగా రూపాంతరం చెందుతాయి. మన భూమి సైతం తొలినాళ్లలో ఇలాగే ఏర్పడింది.తాజాగా వెబ్ టెలిస్కోప్ సేకరించిన సమాచారంతో ఇతర ఖగోళ అధ్యయనకారులు సైతం నూతన నక్షత్రవ్యవస్థల్లో కొత్త గ్రహాలు ఎలా ఏర్పడతాయి వంటి అంశాలపై మరింత శోధన చేసేందుకు అవకాశం లభించనుందని మరో రచయిత క్రిస్టీన్ చెన్ చెప్పారు. ఈ 'హెచ్‌డీ 181327'నక్షత్ర వ్యవస్థ కేవలం 2.3 కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడింది. మన సూర్యుడు ఏకంగా 460 కోట్ల సంవత్సరాల క్రితం ఆవిర్భవించాడు. వయసులో చిన్నదైనా సరే ఈ యువ నక్షత్రం మన సూరీడి కంటే బరువు ఎక్కువగా ఉంది. వేడి కూడా మరింత ఎక్కువగా ఉన్నట్లు తేలింది.

# విరుచుకుపడ్డ రష్యా

273 ఆత్మాహుతి డ్రోన్లను ప్రయోగించింది. వాటిలో 88 డ్రోన్లను కూల్చివేశాం" అని ఉక్రెయిన్ వైమానికదళం తెలిపింది. సంఖ్యాపరంగా ఇదే అతిపెద్ద డ్రోన్ దాడిగా తెలుస్తోంది. గతంలో మాస్కో ఓసారి 267 డ్రోన్లు ప్రయోగించింది. తాజా దాడుల్లో కీవ్ ప్రాంతంలో ఓ మహిళ మృతి చెందినట్లు స్థానిక అధికారులు తెలిపారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయని చెప్పారు. కీవ్ ప్రయోగించిన డ్రోన్లనూ కూల్చివేసినట్లు అటు రష్యా రక్షణశాఖ ప్రకటించింది.యుద్ధానికి కారణమైన అంశాలకు ముగింపు పలకడం, శాశ్వత శాంతి కోసం పరిస్థితులను సృష్టించడం, దేశ భద్రతకు హామీ వంటివి తమ లక్ష్యాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆదివారం స్పష్టం చేశారు. కీవ్‌కు నాటో సభ్యత్వం ఇవ్వకపోవడం, క్రిమియా, మరో నాలుగు ప్రావిన్స్‌లు తమకు చెందుతాయని అంగీకరించడం వంటివి నెరవేర్చాలని మాస్కో మొదటినుంచి డిమాండ్ చేస్తోంది. మరోవైపు.. రక్తపాతం ఆపడమే తన ఎజెండా అని, ఈ విషయమై పుతిన్‌తో మాట్లాడతానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే.

# నేడు నాగర్ కర్నూల్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

**ఇందిర సౌర గిరి జల వికాసం పథకాన్ని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి**

హైదరాబాద్(జనంసాక్షి):నేడు నాగర్ కర్నూల్ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న ఇందిర సౌర గిరి జల వికాసం" పథకాన్ని ప్రారంభిస్తారు. రూ. 12,600 కోట్ల బడ్జెట్‌తో చేపట్టే ఈ పథకంలో ఒక్కో యూనిట్ కు రూ. 6 లక్షల చొప్పున వంద శాతం సబ్సిడీతో లబ్ధిదారులకు అందించనుంది.. పథకాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు సోలార్ పంపుసెట్లను పంపిణీ చేయనున్నారు. అనంతరం సీతారామాంజనేయ ఆలయాన్ని దర్శించుకుని బహిరంగ సభకు హాజరవు తారు. కార్యక్రమం అనంతరం స్వగ్రామం కొండారెడ్డిపల్లె ఆంజనేయ స్వామి ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం కొండారెడ్డిపల్లె నుంచి తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు.

# పక్కా ప్రణాళిక, ఖచ్చితత్వంతో దాడులు చేశాం

భారత సైన్యం ఎలా ప్రణాళికలు రచించింది, సైనికులకు ఏ విధంగా శిక్షణనిచ్చి.. దాడులను అమలు చేసిందనే విషయాన్ని 'ప్లాన్డ్.. ట్రెయిన్డ్.. ఎగ్జిక్యూటెడ్' కోట్‌తో ఆర్మీ వెస్టర్న్ కమాండ్ అధికారులు పంచుకున్నారు."పహల్గామ్ ఉగ్ర దాడితో దేశ ప్రజలలో ఆక్రోశం లావాలా పొంగింది. ఈసారి పాక్‌కు తరతరాలు గుర్తించుకునేలా గుణపాఠం నేర్పాలనే ఒకేఒక ఆలోచన సైనికుల మనసులో ఉంది. ఇది ప్రతీకార చర్య కాదు. బాధిత కుటుంబాలకు సైన్యం చేసిన న్యాయం. ఉగ్రవాదులను పోషిస్తున్న పాక్‌కు తగిన గుణపాఠం" అని వీడియోలో సైనికులు పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ పాక్‌లోని ఉగ్రస్థావరాలపై మే 7న దాడులు చేసింది. ఆ తర్వాత మే 9 అర్ధరాత్రి, 10వ తేదీన పాకిస్థాన్‌లోని కీలక వాయుసేన స్థావరాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశామని భారత్ ప్రకటించింది. పూర్తి స్వదేశీ ఆయుధాలతో దాడి చేసి 11 వాయుసేన స్థావరాలను దెబ్బతీసినట్లు తెలిపింది.

# జూన్ నుంచి థియేటర్లు బంద్

**ఎగ్జిబిటర్ల కీలక నిర్ణయం..**

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లోని సినీ ఎగ్జిబిటర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. అద్దె ప్రాతిపదికన సినిమాలు ప్రదర్శించలేకపోవడంతో జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ చేయాలని నిర్ణయించారు. పర్సంటేజ్ రూపంలో చెల్లిస్తేనే సినిమాలు ప్రదర్శిస్తామని తేల్చి చెప్పారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నిర్మాతలు దిల్‌రాజు, సురేశ్‌బాబు సహా 60 మంది ఎగ్జిబిటర్లు హాజరయ్యారు.ఎగ్జిబిటర్లకు, డిస్ట్రిబ్యూటర్లకు మధ్య పర్సంటేజీలపై చాలా కాలంగా చర్చ కొనసాగుతోంది. అద్దెల రూపంలో సినిమాలను ప్రదర్శించడం సాధ్యంకాదని ఎగ్జిబిటర్లు అంటుంటే.. వారికి పర్సంటేజీలు ఇవ్వలేమని డిస్ట్రిబ్యూటర్లు అంటున్నారు. ఈ వ్యవహారం నిర్మాతలకు ఇబ్బందిగా మారుతోంది.



# ఆగస్టుకల్లా 'బెట్టేతండా'పూర్తి చేస్తాం

పథకం పూర్తి అయితే లబ్దిపొందేది పెద్ద సంఖ్యలో గిరిజన రైతులని ఆయన చెప్పుకొచ్చారు.ఈ ఎత్తిపోతల పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు గాను ఇప్పటికే భూసేకరణ పూర్తి చేసి భూ నిర్వాసితులకు నగదు చెల్లించినట్లు ఆయన తెలిపారు. పనులు వేగవంతంగా పూర్తి చేసి ఆగస్టు మాసంతానికి నీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్,మండల పార్టీ అధ్యక్షుడు ఎన్.వి సుబ్బరావ్,మాజీ ఎంపీపీ గోపాల్ నాయక్, మాజీ జడ్పీటీసీ బుజ్జి మోతీలాల్,కాంగ్రెస్ నాయకులు, మీసాల ఉపేందర్,వెంకట్ రెడ్డి,భూపాల్ రెడ్డి,భాస్కర్ రెడ్డి, మొహమ్మద్ ఖాసీం,జ్యోతి,తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాకు థరూర్.. యూకేకు రవిశంకర్

న్యూఢిల్లీ: ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ మన దేశంపై విషం చిమ్ముతున్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు ఏడు అఖిలపక్ష బృందాలను కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. శశిథరూర్ (కాంగ్రెస్), రవిశంకర్ ప్రసాద్ (భాజపా), బైజయంత్ పాండా (భాజపా), సంజయ్‌కుమార్ ఝా (జేడీ-యూ), కనిమొళి (డీఎంకే), సుప్రియా సూలె (ఎన్సీపీ-ఎస్పీ), శ్రీకాంత్ శిందే (శివసేన)లు ఈ బృందాలకు నేతృత్వం వహిస్తారు. దేశం తరఫున జాతీయ ఏకాభిప్రాయాన్ని ప్రపంచ యవనికపై చాటడం ఉద్దేశంగా ఐరాస భద్రతా మండలిలోని దేశాలకూ ఈ బృందాలు వెళ్లనున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖ తెలిపింది. ఏయే బృందాలు.. ఏయే దేశాలకు వెళ్తాయనే జాబితాను కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తాజాగా వెల్లడించారు.

బైజయంత్ పాండా నేతృత్వంలోని బృందం: సౌదీఅరేబియా, కువైట్, బహ్రెయిన్, అల్జీరియా

రవిశంకర్ ప్రసాద్ బృందం: యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఈయూ, ఇటలీ, డెన్మార్క్

సంజయ్‌కుమార్ ఝా బృందం: ఇండోనేసియా, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, జపాన్, సింగపూర్

శ్రీకాంత్ శిందే బృందం: యూఏఈ, లైబీరియా, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, సియెర్రా లియోన్

శశిథరూర్ బృందం: యూఎస్, పనామా, గయానా, బ్రెజిల్, కొలంబియా

కనిమొళి బృందం: స్పెయిన్, గ్రీస్, స్లోవేనియా, లాట్వియా, రష్యా, సుప్రియా సూలె బృందం: ఈజిప్ట్, ఖతార్, ఇథియోపియా, దక్షిణాఫ్రికా

# మళ్లీ భీకర దాడులు

ఆరోగ్యమంత్రిత్వ శాఖ తెలిపింది. మార్చి 18న కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనకు గురైనప్పటి నుంచి 3 వేల మందికిపైగా పాలస్తీనియన్లు మృత్యువాతకు గురయ్యారని వెల్లడించింది. దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇటీవల కీలక ప్రకటన చేశారు. కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపునకు హమాస్ అంగీకరించని కారణంగానే దాడులను తీవ్రం చేసినట్లు తెలిపారు. 'మా బందీలను విడుదల చేయడానికి హమాస్ పదేపదే నిరాకరిస్తోంది. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ ప్రతిపాదించిన కాల్పుల ఒప్పందం కొనసాగింపును తిరస్కరించింది. ఈనేపథ్యంలోనే దాడులకు ఆదేశించాం. యుద్ధం లక్ష్యాలను సాధించడానికి గాజాలోని హమాస్ స్థావరాలే లక్ష్యంగా ఐడీఎఫ్ దాడులు చేస్తోంది' అని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

# న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థల కంటే రాజ్యాంగమే సర్వోన్నతమైనది

**- మూలస్తంభాలుగా ఇవన్నీ కలిసి పని చేయాలి**

**- సీజేఐ జస్టిస్ గవాయ్**

చెందడం సంతోషంగా ఉందన్నారు."న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థ, పార్లమెంటు కంటే భారత రాజ్యాంగమే సర్వోన్నతమైనది. మూలస్తంభాలుగా ఉన్న ఈ మూడు విభాగాలు రాజ్యాంగం ప్రకారం కలిసి పని చేయాలి. ఇందులోని అన్ని వ్యవస్థలు సహకారం అందించుకుంటూ పరస్పరం గౌరవించుకోవాలి. రాజ్యాంగ మౌలిక స్వరూపం పటిష్ఠంగా ఉంది" భారత ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాను గతంలో ఇచ్చిన 50 కీలక తీర్పులతో రూపొందించిన పుస్తకాన్ని సీజేఐ జస్టిస్ గవాయ్ ఆవిష్కరించారు.మహారాష్ట్రకు చెందిన జస్టిస్ గవాయ్.. సీజేఐగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి రాష్ట్రంలో పర్యటించారు. బీఆర్ అంబేద్కర్ స్మారకమైన చైత్యభూమి సందర్శించి నివాళులు అర్పించారు.

# భారత్ చర్యల నేపథ్యంలో.. పాక్ సైతం విదేశాలకు.

విదేశాలకు వివరించడానికి మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో నేతృత్వంలో ఓ బృందాన్ని పలు దేశాలకు పంపేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపాయి. ఈ విషయంపై ఆ దేశ ఉప ప్రధాన మంత్రి ఇషాక్ దార్ మాట్లాడుతూ.. సరిహద్దుల్లో ఉద్రిక్తతలపై అమెరికా, యూకే, బెల్జియం, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాలకు తమ వైఖరిని తెలియజేయడానికి సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు. ఈ ప్రతినిధి బృందంలో మాజీ డిప్యూటీ విదేశాంగ మంత్రి హీనా రబ్బానీ ఖర్, మాజీ రక్షణ మంత్రి ఖుర్రం దస్తగిర్ ఖాన్, మాజీ విదేశాంగ కార్యదర్శి జలీల్ అబ్బాస్ జిలానీ సభ్యులుగా ఉన్నట్లు స్థానిక మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ మేరకు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్.. తమ బృందానికి నాయకత్వం వహించాలని తనను కోరినట్లు భుట్టో సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. కాగా సీమాంతర ఉగ్రవాదాన్ని పోషిస్తున్న పాక్ తీరును ప్రపంచ దేశాల ముందు ఎండగట్టడానికి ఏడు బృందాలను ప్రపంచ దేశాలకు పంపిస్తున్నట్లు భారత ప్రభుత్వం శనివారం ప్రకటించింది. ఎంపీలు శశిథరూర్ (కాంగ్రెస్), రవిశంకర్ ప్రసాద్ (భాజపా), బైజయంత్ పాండా (భాజపా), సంజయ్‌కుమార్ ఝా (జేడీ-యూ), కనిమొళి (డీఎంకే), సుప్రియా సూలె (ఎన్సీపీ-ఎస్పీ), శ్రీకాంత్ శిందే (శివసేన) ఈ బృందాలకు నేతృత్వం వహించనున్నట్లు తెలిపింది.

# భారత్‌తో పెట్టుకుంటే మీకే నష్టం




ఇంకా పెంచుకోవడం వల్ల పాక్‌కే ఎక్కువ సమస్యలు వస్తాయని చురకలు అంటించింది. ఈ ఘర్షణలు దేశంలో ఆర్థిక, బాహ్య సంస్కరణల లక్ష్యాలకు ముప్పు కలిగిస్తాయని హెచ్చరించింది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల వల్ల స్టాక్ మార్కెట్ మొదట నష్టాల్లోకి వెళ్లినప్పటికీ..ప్రస్తుతం స్థిరంగా ఉన్నాయని ఐఎంఎఫ్ నివేదికలు పేర్కొన్నాయి.ఐఎంఎఫ్ ఇస్తున్న నిధులను పాక్ అభివృద్ధికి కాకుండా ఉగ్రవాదులను పోషించడానికి వినియోగిస్తోందని భారత్ ఇటీవల ఆరోపించింది. ఆపరేషన్ సిందూర్‌లో ధ్వంసమైన ఉగ్రవాద స్థావరాలను పునర్నిర్మించడానికి జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు రూ.14 కోట్లు ఇస్తున్నట్లు పాక్ ప్రభుత్వం ప్రకటించిందని పేర్కొంది. పాక్‌కు నిధులు మంజూరు చేస్తే పరోక్షంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినట్లే అవుతుందని.. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఐఎంఎఫ్ పాక్‌కు నిధులు సమకూర్చడంపై పునరాలోచించాలని మోదీ ప్రభుత్వం కోరినప్పటికీ.. అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి పాక్‌కు 1 బిలియన్ డాలర్ల నిధులు (దాదాపు రూ.8,540 కోట్లు) మంజూరయ్యాయి. ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ కింద ఈ మొత్తాన్ని ఇవ్వడానికి ఐఎంఎఫ్ ఆమోదం తెలిపింది.

# జనసంద్రంగా కాళేశ్వరం

**పుష్కరాలకు పోటెత్తిన భక్తులు**

**కిక్కిరిసిన ప్రాంగణాలు**

**దారులన్నీ కాళేశ్వరం వైపే..**

**ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్**





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** కాళేశ్వరం జనసంద్రంగా మారింది.. సరస్వతి పుష్కరాలకు భక్తులు పోటెత్తారు.. ఆలయ ప్రాంగణాలు భక్తులతో కిక్కిరిసి పోయింది.. దారులన్నీ కాళేశ్వరం వైపే అన్నట్లుగా భారీగా వాహనాలు తరలి వస్తున్నాయి.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తగు సూచనలు చేస్తున్నారు.. నాలుగో రోజైన ఆదివారం కాళేశ్వరానికి భక్తుల తాకిడి పెరగడంతో పుస్కరాలు నూతన శోభను సంతరించుకున్నాయి..

త్రివేణి సంగమ తీరానికి భక్తుల రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. సరస్వతి పుష్కరాల్లో నాలుగో రోజు ఆదివారం ఉదయం నుండే లక్షలాది మంది భక్తులు సరస్వతి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన భక్త జనం కాళేశ్వరం క్షేత్రానికి చేరుకున్నారు. సరస్వతి అంతర్వాహిని నది పుష్కరాలను పురస్కరించుకుని భక్తులు భక్తి పారవశ్యంతో పులకించి పోయారు. త్రివేణి సంగమంలోని గంగమ్మ ఒడిలో జంగమయ్యను ఆరాధించారు. సైకత లింగాలను తయారు చేసుకున్న భక్తులు శివ నామస్మరణ చేస్తూ భక్తి భావాన్ని చాటుకున్నారు. నది తీరంలో పవిత్ర స్నానాలు ఆచరించిన తరువాత నదీ తీరంలోనే సైకత లింగాలను తయారు చేసి శివుడిని ప్రత్యేకంగా పూజించే ఆనవాయితీని పాటించారు. అనంతరం త్రివేణి సంగమాన్ని పూజించి దీపారాధన చేసి గంగమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆ తరువాత సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన 17 అడుగుల ఏకాశిల సరస్వతి మాతను, శ్రీ కాళేశ్వర, ముక్తీశ్వర స్వామిని, శుభానంద దేవిని, సరస్వతి మాతను దర్శించుకున్నారు. పుష్కరుడు సంచరించే వేళ ముత్తయిదలు మొంటెల వాయినం మొక్కులు తీర్చుకున్నారు. సుభాషిణీలకు సాంప్రాదాయ బద్దమైన ఆచారంలో భాగంగా మొంటెల వాయినాలు ఇస్తూ దీర్ఘ సుమంగలిగా ఉండేలా దీవెనలు అందుకున్నారు. ఆధ్యాత్మికతతో ఉట్టిపడుతున్న త్రివేణి సంగమ తీరం ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయింది.

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న కలెక్టర్..

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నారు. సిబ్బంది పనితీరును పరిశీలిస్తున్నారు. శనివారం వాహనాలు భారీగా వచ్చి ట్రాఫిక్ జామ్ అయి ఇబ్బందులు ఎదురైనందున, అలాంటి ఘటనలు తిరిగి పునరావృతం కాకుండా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. దీంతో ఆదివారం ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా వాహనాల రాకపోకలు యధావిధిగా సాగాయి. అదేవిధంగా సరస్వతి ఘాట్, భక్తులు పుణ్యస్నానాలు ఆచరించు త్రివేణి సంగమం, ఆరోగ్య శిబిరం, కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాలయం, పుష్కర విధులు నిర్వహించు సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజన శాల తదితర ప్రాంతాలల్లో కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు భక్తుల రద్దీ పెరుగుతున్నదని, రేపటి వరకు అదనంగా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పుష్కర స్నానానికి భక్తులు వెళ్లేందుకు అదనంగా తాత్కాలిక రహదారి వేయాలని తెలిపారు. భక్తులు వ్యర్థాలు వేసేందుకు అదనంగా డస్ట్ బిన్స్ ఏర్పాటు చేయాలని డిపిఓ ను ఆదేశించారు. ఈ సందర్భంగా భక్తులను ఏర్పాట్లు అడిగి తెలుసుకున్నారు. త్రివేణి సంగమ ప్రాంగణం మొత్తం దర్టీగా ఉందని, సాయంత్రం మళ్ళీ వస్తాను అప్పటి వరకు మొత్తం పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. సంగమ ప్రాంతంలో అపరిశుభ్రత లేకుండా ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించి పరిశుభ్రం చేయాలని స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్, డిపిఓకు వాకిటాక్ ద్వారా సూచించారు. పారిశుధ్యం అద్వాన్నంగా ఉందని అదనపు సిబ్బంది ఏర్పాటు చేసి వ్యర్థాలను తొలగించాలని మళ్ళీ వస్తాను మార్పు రాకపోతే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. భక్తుల రద్దీ పెరుగుతున్నదని దేవస్థానంలో స్వామి దర్శనానికి క్యూ లో ఉన్న భక్తులను దర్శనానికి ఎంత సమయం పడుతుందని అడిగి తెలుసుకున్నారు. భక్తులకు దర్శనం త్వరగా అయ్యేలా చూడాలని దేవస్థానం సిబ్బందిని ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు మంచినీళ్లు అందించాలని సూచించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. భద్రత, శుభ్రత, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.



## రైతును నదిలోకి లాక్కెళ్లిన మొసలి

**కృష్ణ, మే 18 (జనం సాక్షి):** కృష్ణ మండల కుసుమూర్తి గ్రామంలో తిప్పన్న అనే రైతుని మొసలి నీళ్లలో తీసుకెళ్లిందని గ్రామస్తులు ఆదివారం తెలిపారు. 24 గంటలు గడిచినా అయన ఆచూకీ తెలవకపోవడంతో సంఘటన స్థలానికి కుటుంబ సభ్యులు గ్రామస్తులు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు.సమాచారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సంఘటనపై ఆరాతీశారు. తెలుసుకున్న ఫారెస్ట్ , ఎన్డీఆర్ఫ్ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. కృష్ణ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ సర్ఫరాజ్ , మాగనూర్ మండలం అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఎమ్ కృష్ణ మూర్తి, సంతోష్ పాటిల్ గుర్జాల్, పల్లే సురేష్, ఎలాగైనా రైతు ఆచూకీ కనిపెట్టాలి అని కోరారు.సంఘటన స్థలానికి ఎస్ఐ సురేందర్ బాబు సిబ్బంది చేరుకున్నారు.



# ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యంతో అగ్నిప్రమాదం

**ఘటన స్థలాన్ని సందర్శించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రభుత్వ వ్యవస్థల నిర్లక్ష్యం మూలంగా చార్మినార్ ప్రక్కన ఉన్న గుల్జార్ హౌస్ లో ఏసీ షార్ట్ సర్క్యూట్ కారణంగా 17 మంది చనిపోవడం ఆందోళన కలిగిస్తున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పేర్కొన్నారు. నేడు ఘటన జరిగిన ప్రాంతాన్ని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం డి అబ్బాస్ మరియు హైదరాబాద్ సౌత్ జిల్లా ప్రతినిధి బృందం తో కలిసి ఘటన జరిగిన ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులను కలిసి వివరాలు తెలుసుకున్నారు . ఘటన జరిగిన వెంటనే అత్యాధునిక ఎమర్జెన్సీ సౌకర్యాలు కలిగిన సామాగ్రితో సిబ్బంది సకాలంలో వచ్చి ఉంటే ఈ ఘటన లో ఇన్ని ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉండకపోవునని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అక్కడికి ఫైరింజన్లలో సరిపడ నీళ్లు,ఆక్సీజన్ సిలిండర్లు, మాస్క్ లు లాంటివి ఉన్న ఫైరింజన్లు, అంబులెన్సులు రాకపోవడం,వల్ల అలాగే వెంటనే ఘటనా స్థలానికి చేరుకోకపోవడం లాంటి కారణంతో ఇంతమంది సామాన్య కుటుంబాలవారు చనిపోయారని, చనిపోయిన కుటుంబాలకు అన్నివిధాల రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు జరగకుండా అన్ని రకాల జాగ్రత్తలు ప్రభుత్వం తీసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం డి అబ్బాస్ మాట్లాడుతూ జనసాంద్రత ఎక్కువగా ఉండే ఈ ప్రాంతం లోని నివాస ప్రాంతాల్లో ఉండే ప్రజలకు ప్రభుత్వ అధికారులు సరైన అవగాహన కలిగించకపోవడం ఈ దుర్ఘటనకు కారణమని విశ్లేషించారు. ప్రతినిధి బృందంలో సి పీ ఎం హైదరాబాద్ సౌత్ జిల్లా నేతలు ఎమ్.మీనా,జి. విఠల్, పి.నాగేశ్వర్, ఎస్ కిషన్, కే జంగయ్య, ఏ కృష్ణ, బాబర్ ఖాన్, రాంకుమార్, యాకూబ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

# నేడు ఇందిరా సౌరగిరి జలవికాస పథకానికి శ్రీకారం

- మాచారంలో ప్రారంభించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ముఖ్యమంత్రి రాక సందర్భంగా పూర్తి స్థాయిలో పకడ్బందీ ఏర్పాట్లు





**అచ్చంపేట మే 18 (జనం సాక్షి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా సౌరగిరి జల వికాస పథకాన్ని రాష్ట్రంలోనే ప్రథమంగా ప్రారంభించేందుకు సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంపీ, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు రానున్నందున అందుకు సంబంధించిన పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం అచ్చంపేట నియోజక వర్గంలో అమ్రాబాద్ మండలం మాచారంలో సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ...ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బేగంపేట ఎయిర్పోర్టు నుంచి హెలీక్యాప్టర్ ద్వారా బయల్దేరి 11 గంటలకు అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న రాష్ట్రంలోనే ప్రప్రథమంగా గిరిజనుల సంక్షేమానికి చేపట్టిన ఇందిరా సౌరగిరి జలవికాసం పథకాన్ని ప్రారంభించి అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ సందర్శన అనంతరం. ఉదయం 11.35 గంటలకు. మాచారంలో ఉన్న సీత రామాంజనేయ ఆలయాన్ని దర్శించుకొని పూజలు చేస్తారన్నారు. తర్వాత 11.45 గంటలకు మాచారంలో జరిగే సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. సభ పూర్తయిన అనంతరం మాచారం నుంచి రోడ్డు మార్గాన ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి స్వగ్రామమైన వంగూరు మండలం కొండారెడ్డిపల్లి వెళ్తారని అక్కడ ఆంజనేయస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ బాదావత్ సంతోష్ వివరించారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల సమయంలో కొండారెడ్డిపల్లిలోని సందర్శిస్తారని... అక్కడ గంట పాటు గడుపుతారని పేర్కొన్నారు. అనంతరం అక్కడ నుంచి హెలీక్యాప్టర్ ద్వారా సాయంత్రం 3.30 గంటలకు తిరిగి హైదరాబాద్ పయనమవుతారని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా హెలీప్యాడ్తో పాటు ఆయన సందర్శించే ప్రదేశాలు, ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు సభాస్థలిని కూడా సిద్ధం చేసినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించి జిల్లా స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో సమన్వయంతో తమ విధులు నిర్వర్తిస్తూ ముఖ్యమంత్రి పర్యటన విజయవంతానికి కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

# తెలంగాణకు ఖర్చుచేసిన నిధులపై శ్వేతపత్రం విడుదలకు సిద్ధం

**రోడ్ల కోసమే రూ.లక్షన్నర కోట్లు ఖర్చు చేసినం**

**రైల్వేల అభివృద్ధికి రూ.33 వేల కోట్లు కేటాయించినం**

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**



**కరీంనగర్ (జనంసాక్షి) :** తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందంటూ పదేపదే పనికిమాలిన ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు రోడ్లు, రైల్వేల అభివృద్ధే నిదర్శనమన్నారు. జాతీయ రహదారుల కోసమే రూ.లక్షన్నర కోట్లు, రైల్వేల అభివృద్ధికి రూ.33 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులు, చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇకనైనా విమర్శలు మానుకుని అభివృద్ధికి సహకరించాలని కోరారు.

కరీంనగర్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను పరిశీలించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. పాతబస్తీ గుల్జార్ హౌజ్ ప్రమాద ఘటనపట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "హైదరాబాద్ గుల్జార్ హౌజ్ ప్రమాద ఘటనలో 17 మంది మరణించడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. బీజేపీ పక్షాన సంతాపం వ్యక్తం చేస్తున్నా. చిన్నారులు కూడా మరణించారు. ఆ ఘటన తలుచుకుంటేనే మనసు కలిచివేస్తోంది. ప్రధానమంత్రి మోదీ వెంటనే స్పందించి సాయం ప్రకటించారు. ఆ కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి. మళ్లీ ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. బతికుంటే పరిహారం...చనిపోతే సంతాపంతోనే సరిపెట్టడం సరికాదు"అని పేర్కొన్నారు. కేంద్రం ఏం చేసిందంటూ పదేపదే పసలేని ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు రైల్వే స్టేషన్ల, జాతీయ రహదారుల అభివృద్ధి పనులే నిదర్శనమన్నారు. "జాతీయ రహదారుల కోసమే ఇప్పటి వరకు రూ.లక్షన్నర కోట్లు ఖర్చు చేసినం. తెలంగాణకు ఎన్ని నిధులు కేటాయించాం? ఏ విధమైన అభివృద్ధి చేశామనే అంశంపై శ్వేత పత్రం విడుదల చేసేందుకు సిద్ధం. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది. నిజానికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పూర్తిస్థాయిలో సహకరించడం లేదు. విమర్శలకే పరిమితమవుతూ అభివృద్ధికి అడ్డంకిగా మారుతున్నారు. ఇకనైనా రాష్ట్రాభివృద్ధి విషయంలో కలిసి రావాలని కోరుతున్నా" సూచించారు. "తెలంగాణలో రైల్వే అభివృద్ధికి 32 వేల 940 కోట్ల రూపాయలకుపైగా ఖర్చు చేసినం. ఈ ఒక్క ఏడాదే 5 వేల 336 వేల కోట్లు కేటాయించినం. నాచారం రైల్వే టెర్మినల్ ను అద్భుతంగా నిర్మించుకున్నం. 750 కోట్లతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పనులు కొనసాగుతున్నాయ్. 350 కోట్లతో నాంపల్లి రైల్వే స్టేషన్ ను ఆధునీకరిస్తున్నం. ఈ అభివృద్ధి పనులన్నీ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు కన్పించకపోవడం సిగ్గు చేటు"అని వ్యాఖ్యానించారు.

## అంతర్జాతీయ కొవ్వొత్తుల స్మారక దినోత్సవ ర్యాలీ



**నాగర్ కర్నూల్ ఆర్సీ, మే 18(జనంసాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాధితో చనిపోయిన వారి స్మారకార్థం అంతర్జాతీయ కొవ్వొత్తుల స్మారక ర్యాలీ నిర్వహించారు. ప్రతి సంవత్సరం మే నెల మూడో ఆదివారం రోజు హెచ్ఐవి/ఎయిడ్స్ తో చనిపోయిన వారి స్మారకార్థం, సంఘీభావం కోసం ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. ఒక నిమిషం మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో దిశా క్లస్టర్ మేనేజర్ రమేష్, డిపిఎంవో సుకుమార్ రెడ్డి, జిల్లా ఫార్మసీ సూపర్వైజర్ సురేష్ కుమార్, ఐసిటిసి కౌన్సిలర్ శివశంకర్, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలైన ఎమ్మార్డీఎస్, వైఆర్జికె బృంద సభ్యులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డులో అరిగోస

- అభివృద్ధి నోచుకోని వ్యవసాయ మార్కెట్ యాడ్
- చిన్నపాటి వర్షానికి కుంటల మారిన రైతు బజార్
- బుర్ద నీటిలో కూరగాయలు దుకాణదారులు



**సంగారెడ్డి టౌన్ 18మే (జనం సాక్షి ) :** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి వ్యవసాయ మార్కెట్ యార్డ్ సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది. వ్యవసాయ మార్కెట్ పై వచ్చే ఆదాయాన్ని మాత్రమే తీసుకుంటూ సమస్యలు పరిష్కరించడంలో సంబంధిత కార్యదర్శి నిర్లక్ష్యం వహిస్తున్నాడని మార్కెట్ యార్డ్ లోని దుకాణదారులు మండిపడుతున్నారు. కొద్దిపాటి వర్షానికి సంగారెడ్డి పట్టణంలోని ఉన్న వ్యవసాయ మార్కెట్ యాడ్ పూర్తిగా బుర్ధమయంగా మారి డ్రైనేజీ నీటితో తీవ్ర దుర్వాసన వెదజల్లుతుంది. ప్రజలకు నిత్య అవసర సరుకుల్లో ఒకటి కూరగాయలు ఆ కూరగాయలు సంగారెడ్డి ప్రజలకు అందించేందుకు రైతులు సంగారెడ్డి పట్టణంలోని రైతు బజార్ లో దుకాణాల్లో కూరగాయలు విక్రయిస్తారు. కూరగాయల మార్కెట్ యాడ్ సరిగా లేకపోవడంతో కనీస సౌకర్యాలు కూడా కనిపించడం లేదు రైతులు కూడా కూరగాయల వ్యవసాయ మార్కెట్ సరిగా లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు రైతులు కూరగాయలను తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు. గతంలో చుట్టుపక్క ప్రాంతాల రైతులు సంగారెడ్డి జిల్లా కేంద్రానికి కూరగాయలు రైతులు తీసుకొచ్చేవారు ఇప్పుడు రైతులు సంగారెడ్డి పట్టణం లోని , వ్యవసాయ మార్కెట్కు కూరగాయలు విక్రయించడానిక రావడంలేదని దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, కొద్దిపాటి వర్షానికి రోడ్లపై ఉన్న డ్రైనేజీ వాటర్ ను పూర్తిగా వ్యవసాయ మార్కెట్ కమిటీ లోకి చేరి భరించలేనంత దుర్వాసన బురద కావడంతో కొనుగోలుదారులు విక్రయదారులు రావడంలేదని దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేకసార్లు అధికారుల దృష్టికి సమస్యలను తీసుకువెళ్లిన పట్టించుకోకపోవడం లేదని వ్యవసాయ కమిటీ సెక్రెటరీ కి దుకాణదారులు సమాచారం ఇచ్చిన పట్టించుకోకపోవడంతో ఇలాంటి సమస్యలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా ఉన్నంత అధికారులు సమస్యలను పట్టించుకోని రైతు లకు మేలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వ్యవసాయ మార్కెట్ లోపల దుకాణ సముదాయం ముందు సీసీ రోడ్డు వేసి డ్రైనేజీ ఏర్పాటుచేసి నీళ్లు నిలవకుండా చూడాలని కోరారు.



# బ్రిడ్జితో మారు పేరొస్తదని ప్రజలకు అన్యాయం

- గతంలో అనుమతి పొందిన పనులకే పేర్లు మార్చి మళ్లీ శంకుస్థాపనలు
- శ్మశాన వాటిక నిర్మాణంలో ఎన్నో అక్రమాలు చేసిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు
- మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు ఆగ్రహం



**మంచిర్యాల ప్రతినిధి, మే 18 (జనంసాక్షి)**

మంచిర్యాల జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మాణానికి 164 కోట్లు కేటాయించినప్పటికీ ఆ బ్రిడ్జి నిర్మాణం చేస్తే మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావుకు పేరు వస్తుందని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అక్కడ బ్రిడ్జి రద్దు చేయడంపై మాజీ ఎమ్మెల్యే దివాకర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటుచేసిన సమావేశంలో దివాకర్ రావు మాట్లాడుతూ.. జిల్లా ప్రజల ఆకాంక్ష మేరకు మంచిర్యాల అంతర్గాం మధ్యలో ఉన్న గోదావరి నదిపై వంతెన నిర్మాణం చేయడానికి బీఆర్ఎస్ హయాంలోనే అన్ని అనుమతులు పొంది 164 కోట్ల రూపాయలు మంజూరై బ్రిడ్జికి టెండర్ ప్రక్రియ,స్థల సేకరణ, అగ్రిమెంట్, మట్టి పరీక్షలు కూడా పూర్తి అయిన బ్రిడ్జిని నిర్మిస్తే దివాకర్ రావుకు పేరు వస్తుందని ఆ స్థలంలో బ్రిడ్జిని రద్దు చేసి మంచిర్యాల ప్రజలకు అన్యాయం చేశారని ఆయన పేర్కొన్నారు. బ్రిడ్జను మారుస్తూ ఆ బ్రిడ్జికి బదులుగా ప్రత్యామ్నాయ రోడ్గా లక్ష్మీ టాకీస్ నుండి అమరవీరుల స్తూపం నుండి రాళ్ల వాగు నుండి రంగపేట నుండి పాత మంచిర్యాల ఆర్అండ్బీ రోడ్డు వరకు ఈ మధ్యకాలంలో మార్చబడిందని, మేము తీసుకొచ్చి నిధులు మార్చడం కాకుండా మేము తెచ్చిన పనులు యధావిధిగా చేసుకుంటూ మంచిర్యాల అభివృద్ధికి కొత్తగా నిధులు తేవాల్సిన ఎమ్మెల్యే పాత వాటి పేర్లు మార్చి దారులు మళ్లించడానికి ప్రజలందరూ గమనిస్తున్నారని పేర్కొన్నారు. 2028 ఎన్నికల తర్వాత నూటికి నూరు శాతం మంచిర్యాలకి గుండెకాయ లాంటి మంచిర్యాల-అంతర్గాం బ్రిడ్జిని మళ్లీ ఏదా స్థానంలో నిర్మిస్తామని అన్నారు. మహా ప్రస్థానం స్మశాన వాటిక నిర్మాణం కోసం 4 కోట్ల రూపాయల పనికి 11 కోట్లకు మార్చడానికి ప్రయత్నిస్తున్నారని ఇలాంటి బిల్లులు స్థానిక ఎమ్మెల్యేకి బంగారుబాతు లాగా కనిపిస్తుందని ఎద్దేవాచేశారు. ప్రస్థానానికి నిర్మాణానికి డబ్బులు కట్టకుండా, మంచిర్యాల గోదావరి నది నుండి అడ్డగోలుగా ఇసుక,మట్టి అక్రమ రవాణా చేసి పోయడం ఆ మట్టి పోసిన టిప్పర్ల యజమానికి ఇసుక మట్టి బయట అమ్ముకునే విధంగా అతనికి వసతులు కల్పించి, ఆ ప్రస్థానంలో ఇసుక మట్టి పోయడం జరిగింది, ఇలా చెప్పుకుంటూ పోతే మహాప్రస్థానంలోనే చాలా పెద్ద అవినీతి జరుగుతుందని ఆరోపించారు. మహాప్రస్థానం నిర్మించిన భూదాన్ భూమి కూడా ఒకప్పుడు దివాకర్ రావు 2014లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అక్రమార్కుల నుండి ఈ భూదాన్ భూమిని కాపాడి,ప్రభుత్వానికి అప్పజెప్పిన భూమి అని గుర్తు చేశారు. మహాప్రస్థానంలో దాన సంస్కారాలు చేసినప్పుడు, అటుగా పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు స్మశాన వాటిక నుండి వచ్చి పొగ మీదగా రాకపోకలు కొనసాగించాలి, అదేవిధంగా పుష్కర ఘాటు మీదకు, దేవాలయాల మీదకు, ఇళ్ళ మీదకు కూడా స్మశాన వాటిక నుండి ఒక వస్తుంది అని అన్నారు. అమాయక యువకుడు 2025 జనవరిలో కరెంట్ షాక్తో మరణిస్తే ఆ విషయాన్ని కూడా బయటకు రాకుండా చేశారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్మాణం కాబట్టి ప్రభుత్వమే మెయింటైన్ చేయాలి కానీ స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మహాప్రస్థానం మెయింటెనెన్స్ పేరు నెపంతో వ్యాపారస్తుల నుండి కుల సంఘాల నుండి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు.

**ప్రతి పనికి డబ్బులు కావాలనే ఏకైక ఎమ్మెల్యే మంచిర్యాల ఎమ్మెల్యే**

మంచిర్యాల నియోజకవర్గం లోని ఎసిసి క్వారీలో ఉన్న భూమి, ఆ భూమిని ఇండస్ట్రియల్ భూమి నుండి రెసిడెన్షియల్ భూమిగా మార్చడానికి ఆ ప్రాంత ప్రజానీకాన్ని పిలిపించి ఆ భూమిని ఇండస్ట్రియల్ నుండి రెసిడెన్షియల్గా మార్చడానికి లక్షలాది రూపాయలు కావాలని వారితో చెప్పడం జరిగింది అని అన్నారు. ప్రతి విషయాన్ని డబ్బులు కావాలని ఏకైక ఎమ్మెల్యే నాకు తెలిసి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావే అని ఆరోపించారు. డబ్బులు ఇవ్వకుండా ఎవరైనా ఎదురు మాట్లాడితే వారిని భయభ్రాంతులకు చేయడానికి ఒక గ్యాంగ్ ను తయారు చేసి వారితో బెదిరింపులకు చూపిస్తూ,ఎదురు మాట్లాడిన వారిపై దాడులు చేపిస్తూ, ఇలా డబ్బులు వసూలు చేసే కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు విజిత్ కుమార్ తాజామాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, టీబీజికేఎస్ నాయకులు, కార్యకర్తలు, బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులందరూ పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
19 మే 2025
తెలంగాణ

## కేటీఆర్ గారూ! జర్నలిస్ట్ మునీర్
# ఆరోగ్యాన్ని నీరుగారనివ్వొద్దు

**కేటీఆర్ గారూ! పోటీ పడండి..**

*అస్వస్థులైన జర్నలిస్ట్ మునీర్ ను కాపాడడంలో గట్టిగా పోటీ పడండి. సామాన్యుడే కేంద్రంగా అలుపెరుగని రచనల తెలంగాణ ఉద్యమ పాత్రికేయుడు ఎం.డి. మునీర్ ఆరోగ్యాన్ని నీరుగారనివ్వొద్దు.*

తెలంగాణ సమాజం మంచిని గాఢంగా కోరుకునే సింగరేణి మంచిర్యాల కలం వీరుడికి గరిష్ట వైద్యం కోసం పాటుపడండి. కుల, మత అంతరాలు ఏమాత్రం నచ్చని, గిట్టని మీ మనసేంటో అనేక మందికి తెలిసినట్టే వ్యాసకర్తగా నాకూ తెలుసు.

కేటీఆర్ అంటే పడిచచ్చేటోళ్ళు కోకొల్లలు. తన "పొజిషన్"తో నిమిత్తం లేకుండా పరోపకారం చేయని రోజుండని మనసున్న మహారాజు. ఇక అనారోగ్య పీడితులకైతే లెక్కేలేదు. అయితే తన నజర్ కు చేరడమే కావాల్సినది. అదే అసలు సవాలు. అధికారంలో ఉన్నప్పుడైనా, ఇప్పుడైనా ఒకసారి తన దృష్టికి పోవాలే, మనసుకు తాకాలే కానీ బచాయిస్తారు.

నేటికీ కేటీఆర్ టీం ఫుల్ యాక్టివేషన్ లోనే ఉన్నది. తన మాటగా చెప్పడమే కాదు, అవసరమైతే తన డబ్బులూ వైద్యానికి ఇస్తారు కేటీఆర్. మనిషిని కాపాడడంలో తమ, పర భేదం తనలో ఉండదు. నిజానికి ఒక్కమాటలో చెప్పాలంటే, ఒకరికి సహాయం చేసి, రక్షించారంటే తనకు అంతకుమించిన సంతృప్తి ఉండదు. ఇట్లాంటి ఆపదల్లో ఆదుకోవడంలోనే తన ఆనందాన్ని వెతుక్కుంటారు కేటీఆర్. అదే సమయంలో సామాజిక సేవలకు మరింత బలాన్ని కూడదీసుకుంటారు. ఇది ఎవరి అనుభవం మేరకు వారికి ఉండే ఒపీనియన్. దీంతో విభేదించే వారూ లేకపోలేదు.

ఏదేని సమాచార లోపం, మరేదైనా సమన్వయ వెలితి వంటి కారణాంతరాల్లో మాత్రం వేరు.



సాయం పొందిన వారు బయటకు చెప్పని సందర్భాలే అధికం. కానీ సాయం దక్కని వారు చెప్పే అవకాశాలు అనేకం. ఇది మానవ సహజం.

రాజకీయ విరోధి అయినా ఆరోగ్యపరంగా క్షేమంగా ఉండాలనే కేటీఆర్ ఉబలాటపడుతుంటారు.

తనకు కేసీఆర్ గారి నుంచి అబ్బిన గొప్ప సుగుణంగానూ చూడొచ్చు.

**రేవంతన్నా..కేటీఆర్ సార్**

ఆంధ్రజ్యోతి, వెలుగు వంటి డెయిలీస్ మరీ ముఖ్యంగా జనంసాక్షిలో ఎండీ మునీర్ ఆర్టికల్స్ లేని సంచిక దాదాపు ఉండదు. కాలం ఎవరి కోసమూ ఆగనట్టే, మునీర్ కలమూ ఆగదు. తన మనసు చిట్ట చివరి పొరుల ఉన్నతి చుట్టే పరిభ్రమిస్తుంది. తనలోని భావాలకు నిర్మొహమాటంగా, నిర్భీతిగా అక్షర రూపమై జ్వలిస్తుంది. అది ప్రపంచానికి నిరంతర వ్యాసంగ కాగడా. నల్ల బంగారు లోకంలో ముసురుకునే చీకట్లలో వెలుగు దీవిటీ. రిపోర్టింగ్ చేయడం, వ్యాసాలు ఇవ్వడమే కాదు.. తెలంగాణ సమాజం కోసం క్షేత్రంలోనూ పోరాడారు మునీర్.

స్వరాష్ట్ర సాధన కోసం సింగరేణి సకల జనుల సమ్మెకు కన్వీనర్గా వ్యవహరించిన బహుళ పార్శ్వాలకు చిరునామా తాను. సింగరేణి కార్మికుల జీవన స్థితిగతులను ప్రతిఫలించే అక్షర శిల్పిగా సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్ వంటి ఉన్నతాధికారులకూ సుపరిచితుడు. అటువంటి మనో నిబ్బర సీనియర్ కలం కార్మికుడి దేహానికి సుస్తీ చేసింది. ఇటువంటి సమయంలోనే ఇన్నాళ్ల త్యాగాలు, సేవలకు ఆదరణ దక్కాలి. ఎటొచ్చీ సాధారణ స్థితికి తెచ్చే చేయూత కావాలి.

భిన్నాభిప్రాయాలు ఉండకపోతే ప్రజా జీవితం వెలవెల బోదా? ఈ ఒక్క సూక్ష్మం స్ఫురణలో ఉంటే చాలు. రేవంతన్నా అని పిలవగానే వెనక్కు చూసే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కమారు మునీర్ వైపు చూడాలి. అన్ని విధాలా మునీర్ కు హెల్ప్ చేయాలి. కేటీఆర్ సార్ కూడా దిల్ సే మనసు పెట్టాలి. ఈ మానవీయతలో రేవంత్, కేటీఆర్ పోటీ పడాలి. ఇద్దరూ గెలవాలి. తద్వారా జర్నలిస్టు మునీర్ భాయ్ ఆరోగ్యాన్ని గెలిపించాలి. తన ఆర్టికల్స్ మన సమాజానికి పది కాలాలపాటు అందాలి.

**ఇల్లెందుల దుర్గాప్రసాద్**
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు
హైదరాబాద్
9440850384

# సికాసలో లేచిన బొగ్గు రవ్వలు




1969ల్లో ఉద్భవించిన నక్సల్బరీ ఉద్యమం ఊపిరిగా తెలుగు నాట శ్రీకాకుళంలో అడుగుపెట్టి తెలంగాణ నేలన విస్తరించిన రాడికల్ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన గురిజాల రవీందర్ వ్రాసిన బొగ్గురవ్వలు పుస్తకంలో తన జీవన ప్రస్థానాన్ని, తనతో పాటు తన సహచరుల పోరాటాన్ని అక్షరీకరించిన తీరు నేటి తరానికి కావాల్సిన వైద్యం పుష్కలంగా ఉంది. సమస్యలనుండి పారిపోయే నేటి తరం వాట్సాప్ల్లో ఫార్వార్డ్ చేయబడుతున్నదే చరిత్రగా అదే నిజమనే భ్రాంతిలో కొట్టుమిట్టాడుతున్న తరం చదవాల్సిన పుస్తకం ఇది. నమ్ముకున్న సిద్ధాంతం కోసం, విలువల కోసం బ్రతికిన బ్రతుకులోని ఆనందం కన్నా మించినది మరొకటి ఉండదని మొగిలమ్మ లింగయ్యల పుత్రుడు రవీందర్ ఋజువు చేసారు. బతుకు దెరువు కోసం ఊరు విడిచి కార్మిక ఆవాసాల మధ్య ఓ హోటల్ నడుపుకుంటూ హోటల్ నిర్వహణ కోసం కావాల్సిన పాలకై పశువులను పెంచుతూ వనరులను సమకూర్చుకోవడం నాటి తరంలోని శ్రమైక జీవన సౌందర్యాన్ని ప్రతిబింబిస్తుంది.

తన చుట్టూ ఉన్న మనుషుల జీవితాలని గమనిస్తూ చదువుతూ లోతుపాతుల పై విశ్లేషిస్తూ లోటుపాట్లను సరిదిద్ద అవసరమైన సిద్ధాంతాన్ని ఆచరిస్తూ ప్రజల్లోకి తీసుకెళ్ళ గలిగిన రవీందర్ పయనం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఊరు వదిలి వచ్చినా ఆప్యాయతను వదలలేని హుస్సేన్ మామ తిరిగి వెతుక్కుంటూ హోటల్ కి రావడం పాటలతో ఉత్తేజితులను చేయడం, దొరల చేతుల్లో నడుస్తున్న సింగరేణి యూనియన్లకు ప్రత్యామ్నాయంగా సికాసను ఏర్పాటు చేయడంలో రవీందర్ పాత్ర మాత్రమే కాక నాటి కార్యకర్తల కఠోర శ్రమను త్యాగాన్ని గుర్తు చేసారు. ఈ నేలన జరిగిన సాయుధపోరాట స్ఫూర్తిని నిలబెట్టిన ఆర్వైఎల్ పోరాటాలను సమస్యలను ఉటంకిస్తూ చర్చించిన అంశాలు సోదాహరణంగా ఉన్నాయి. సింగరేణి బొగ్గు గనుల్లో అలసిన శరీరాల వల్ల చెదిరిన దాంపత్య జీవితాలను జైలు జీవితాల్లోని బీడీలు డబ్బులు హోమోసెక్సువల్ ఘటనలు, బలం ఉన్న వాడి చేతుల్లో బానిసలు గా ఆ జైలు గోడల మధ్య బాహ్య ప్రపంచానికి తెలియచేసారు.

తన ఆత్మకథ అని అనటం కన్నా తాను నడిచిన మార్గం లోని ఒడిదుడుకులను తెలియచేస్తూ అనుభవించిన పోలీసు చిత్రహింసల ను నిర్బంధాలను పాఠకులకు పరిచయం చేయడం ద్వారా ఎన్ని నిర్బంధాలైనా ఉద్యమాలను ఆపలేవని చెప్పగలిగారు. తన బాట ముళ్ళబాట అని తెలిసినా ఆ బాటలోనే నడవటానికి నిర్ణయించుకున్న మేన మరదలు సరళ పదిహేడేళ్ళకే పరిణతి చెందిన నిర్ణయం తీసుకోవడం వెనుక సిద్ధాంత స్ఫూర్తి ఉంది. షెల్టర్ ఇవ్వడానికి తోబుట్టువులు తండ్రి జంకినా సానుభూతిపరుల ఇంట అజ్ఞాత జీవితం గడిపి తాను నడిచే బాటలోని ఔన్నత్యాన్ని గుర్తు చేసారు. చదివే క్రమంలో బతుకుల బాగుకోసం సామాజికార్థిక అసమానతలు మూలమని గ్రహించి లీగల్గా సేవలందిస్తూ పార్టీకి అవసరమైనప్పుడు అండర్ గ్రౌండ్కి వెళ్ళి అత్యవసర సమయంలో మురుగు నీరు సైతం మంచి నీరుగా సేవించాల్సిన పరిస్థితులను విశదీకరించారు. అజ్ఞాత జీవితంలోకి భార్యాభర్తలను ఒకేసారి పార్టీ అనుమతించ నిరాకరించడంతో కలిసే జీవించాలనుకునే మౌలిక సూత్రానికనుగుణంగా కోర్టులో లొంగిపోయానని రవీందర్ తేటతెల్లం చేసారు.

ఉద్యమకారులకు పిల్లలు వుంటే ఉద్యమంలో చురుకుగా పాల్గొనేందుకు అడ్డని భావించి పిల్లలు పుట్టకుండా సరళ ఆపరేషన్ చేసుకున్నా ఆపాటికే గర్భం దాల్చడం అబార్షన్ కోసం వివిధ డాక్టర్లను సంప్రదించడం జరిగినది జరిగినట్లు ఎక్కడా అతిశయోక్తి లేకుండా రచించారు. పుట్టిన పిల్లను తాత దగ్గర వదిలి ఉద్యమంలో పాల్గొంటూ బిడ్డ తమకు దూరం అవుతుందనే బాధను వెలిబుచ్చారు సగటు తల్లితండ్రుల్లా.

పోలీసు చిత్ర హింసలకు వెన్ను నొప్పి నివారణకు ఆయుపంక్చర్ వైద్యాన్ని ఆశ్రయించి డాక్టర్ మిత్ర చేసిన వైద్య సహాయాన్ని ఉటంకించారు. వివిధ ప్రముఖ ఉద్యమకారులను ఉద్యమ నేపథ్యంలో కలిసిన, చర్చించిన మరియు ఏర్పాటు చేసిన సందర్భాలను తేదీలవారీగా ఇన్నాళ్ళ తర్వాత సైతం వ్రాయగలగడంలో తన డైరీలు ఉపయోగ పడ్డాయని భావించవచ్చు లేదా జ్ఞాపక శక్తి కి సెల్యూట్ చేయవచ్చు. పార్టీలు వేరైనా తాను జైలులో ఉన్నప్పుడు ఎంఎల్ఏ బోడ జనార్దన్ వచ్చి వెళ్ళాడని తెలియ చేయడంలో మానవీయ కోణం ఉంది.

తోటి కామ్రేడ్ గంగారం ఎన్కౌంటర్ అయినప్పుడు తాను అనుభవించిన బాధను అధిగమించటానికి చాలా సమయం తీసుకున్నారని తన వేదన ద్వారా గ్రహించవచ్చు. కొత్త దంపతుల నివాసానికి గుడిసెల మధ్య పందులు తిరుగాడుతుంటే సరళ వేరే ప్రాంతం చూడమన్నప్పుడు రెండు కవితలు చెబుతూ ఆ నివాసాల మధ్య ఉంటే సదరు ప్రజానీకం తమతో కలిసిపోతేనే సిద్ధాంత భూమిక త్వరగా నెరవేరుతుందని చెప్పటంలో తన సామాజిక బాధ్యత ను పరిణతిని అంచనా వేయవచ్చు . అజ్ఞాత జీవితం నుండి బైటికి వచ్చి ముప్పై ఏళ్ల పాటు విద్యాసంస్థలను నడిపి తాను ఆశించినట్లు నేడు నడపలేకపోతున్నందున తప్పుకోవడం అతని వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది. చివరగా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స కు ముందే బీజం పడి అబార్షన్ ను తప్పించుకుని పుట్టిన బిడ్డే వ్యాఖ్యాత గా ఈ బొగ్గురవ్వలు ఆవిష్కరణ జరగడం గమనార్హం!

**- గిరి ప్రసాద్ చెలమల్లు**
9493388201
201 క్లాసిక్ అవెన్యూ మియాపూర్ హైదరాబాద్ 500049



## నేరగాళ్ళే నేతలైన మిడిమాల
# దేశాన అందాల పోటీలు

పోటీలూ
పందాలు
ఒకటో కాదో కానీ..

అప్పుడెప్పుడో
మా ఊరిలో
జాతరకని
భలే గ్రాండుగా
జరిగాయిజి
బండలాగుడు పోటీలు
క్రూర నిషేదాజ్ఞల
మధ్య..

అయితే అవి
ఎద్దులవి లెండి...

మొన్నేమో
ఏదో పర్వమనో
ఎవరిదో దినమనో
ఎవరో పునుకుంటే
ఊర కుక్కల
పరుగు పోటీలూ
జోర్దారుగా జరిగినై..

కోళ్ళు
తన్నుకు చచ్చే
పదెం పోటీలూ..

పొట్టేళ్ళు
గుద్దుకుచచ్చే
పౌరుష పోటీలూ..
గడప దాటని
జంతు ప్రేమికుల
గొంతుకల సాక్షిగా..
ఎప్పుడూ ఉండేవే
ఏడాదెల్లా జరిగేవే..
పోటీ ఏదైనా
పబ్బం ఏదైనా..
ఫుల్లు ఈలలూ..
గొల్లు కేకలూ..
బెట్టులూ..
బెట్టింగులూ..
మైదానమెల్లా రేగి
ఇండ్లన్నీ కమ్మి
దుమ్మే దుమ్ము
మస్తు జోషు లెండి..
ఊర మోతుబరి
మీసాలు మెలేసి
పూనుకుంటే..
సుట్టూ యావయ్యరవై
ఊర దుద్దెగాల్ల కెల్లా
పూనకమొస్తుండె...
నడపడానికి
అనుమతుల్లేవు..
శిక్షార్హమైన
నేరమంటూ..
హెచ్చరికల మీద
హెచ్చరికలు...
జీపు మైకులోంచి
సర్కారీ స్వరమొకటి
మృదు మధురగీతం
పరుషంగా
ఆలపిస్తుంటే..
కనుసైగల
ఇషారాల నడుమ
ఆట ముగిసి
సీకటి కమ్మేస్తుండె..
బెల్టుషాపుల

ఆవలింతలతో
ఆదినమలా గడిసి
లోకానికదో వార్తై
సప్పున తెల్లారుతుండె..
రోషాలవో
మీసాలవో
ముగ్గులవో
వొంటలవో
పోటీలే
పోటీలు
ఎప్పుడూ
పోటీలు
ఉన్నవేగాదా..
ఇప్పుడు
ఇవోరకం
పోటీలు..
సోకులవంటూ...
పోటీలూ..
పందాలూ..
మన తరాల
ఘన చరితల
సంపత్తులుకదా..
జీవగంజికివి
మూలాలుకదా
జరగకపోతెట్లా..!!
జగతికీ
జీవజాతికీ
ఆలంబనలు కదా
అందాల పోటీలు
జరగకూడదంటెట్ల..??
కడుపుకింత
కూడు లేక
బడికెళ్లే
నసీబు లేక
డొక్కమూరెడు
లోనికెళ్లి
దిక్కులేని
ధీన బాలలవీ..
కన్నుమిన్ను
కానకుండా
ముసలి ముతకని
వొదలకుండా..
పాలుదాగే పిల్ల సైతం
ఘడియ కొకటిగా
ఘోర రేపులు
దాపురించిన
దుర్ఘటనలవీ..
నోటి కాడి
ముద్ద గుంజి
నోరులేని
ఆదివాసుల..
కాళ్లకింది
నేల దోసి
కడుపులున్న
ఖనిజ సంపద..
కార్పొరేట్లకు
దుడిసి పెట్టగ
పిట్టలోలే
కాల్చడంల..
ఆకులలములె
తోడు నీడను
గిరి పుత్రుల
సంపదంల..
విశ్వ ఖ్యాతిగ
వినుతి కెక్కిన

నెత్తుటేరులు
పొంగ బెట్టిన..
రాజ్యహింసల
కిరాతకాల్లా..
పోటీలు
పెట్టుకుంటే
ఏంతబాగుండునో..
సొంత పౌరులను
వొందలొందలు బొంద
బెట్టే
బాకాలు ఊదుకుంటే
ఎంత
పేరొచ్చుండునో..
ఎన్నెన్ని పోటీల్ల
ఎన్నోటి మెడల్లు
ఈ పాటికొచ్చేవో
కీర్తెంత దక్కేదో..
దొమ్మ ఎక్కడ
ద్రోహులకు..
ప్రజల జంపే
పాలకులకు..
గొంతెత్తినోళ్లను
ఖైదులో కుక్కేటి
నేరగాళ్ళే నేతలైన
మిడిమాల దేశాన..

జరగనీ జరగనీ
నుదుటి పోటీలు
కళ్ళ పోటీలు
కను బొమ్మల పోటీలు
చెవుల పోటీలు
ముక్కు పోటీలు
జరగనీ జరగనీ
ఇవి జరక్క పోతే
జనానికల్లా
ఊపిరాగుతది గదా..
అప్పుడే ఏమైంది..
రాబోయే దినాల్ల
ఇడవాల్సినవెల్ల
ఇగ్గిగ్గి ఈడ్సేసి
అంగాంగ పేర్లతో..
మిరుమిట్ల
కాంతులతో..
కళ్ళు చెందిరే
రంగులతో..
శివాలెత్తిస్తారు...
దౌడల పోటీలు
దొమ్మల పోటీలు
తుప్పల పోటీలూ..
నుదురు పోటీలు
నడుం పోటీలు
బొడ్డ పోటీలు
ముడ్ల పోటీలూ..
కొక్కులన్నీ కూడి
ఖాళీ చేసేసిన
ఖాజానాకు
దిక్కనుకుంటూ..
శతకోటి పోటీలకు
పూనుకునేజి
మన ప్రభువులకు
అనంతకోటి
వొందనాలు..!!!!

**డాక్టర్. ఇక్బాల్ పాషా**
9440775732

# అలోచించండి

స్వర్గమంటే ఎక్కడో లేదోయి
వున్నదీ బాల్యపు ఆనందములోనే కాదా

రంగురంగుల సీతాకోకచిలుకలై
చదివి ఆడి పాడేవాళ్లము
మీ బాల్యపు ఆనవాళ్ళు గుర్తు తెచ్చుకోండి

వేదాల ఘోషించే వర్ణమాల,
పచ్చబొట్టు లా నిలిచే నీతి సూక్తులు,
గుర్తుకు తెచ్చుకో భాయి,
ఇది మన తీపి జ్ఞాపకమోయి

పాఠశాల నేను, ప్రభుత్వ పాఠశాలను నేను
మీ పిల్లలకు ఉచిత విద్యనందిచ్చె
భావి నిర్మాతను నేను

జీవన నైపుణ్యా లెన్నో
ఒకప్పుడు నా నుండే నేర్చుకున్నారు మీరంతా

సామాజిక, ఆర్థిక స్థితి గతులేమైనా
పిల్లలందరికీ సమాన అవకాశాలను ఇచ్చాను

మరీ ఇప్పుడు మా స్థితి ఏంటీ..?
తోడు లేని నీడ లా బెంచీలు,
పిల్లల అల్లరి తో వీనుల విందు కాక
చిలుం పట్టిన తాళం కప్పలా బడుల పై కప్పు
ఇంకా ఎన్నెన్నో ఒకసారి చూసి
దుఃఖము తెచ్చుకో...
పూర్వము ఇట్లుండెనా...?

ఎట్లాంటి బడి ఇది
దేశ భవిష్యత్తుకు తడి
మన అమ్మకే ఒడి ఇది

నల్లబల్లలు నెర్రలు బారుతున్నాయి
పలుచనవుతున్న పిల్లల మేఘవదనాన్నీ చూసి

బడుల రంగు వెలిసి పోతున్నదీ
ప్రవేట్ మోజులో కాంతివిహీన చిన్నారుల చూసి

ప్రవాహ జీవనది బడి చిన్నబోతుంది
కార్పొరేట్ కాలువల్లో చీలికలవుతున్న
మన సర్కారు పిల్లల చూసి

ప్రవేట్, కార్పొరేట్, గురుకులాలుగా చీలిన బడి
గుండెల నిండా నిశ్శబ్దాన్ని
నింపు తున్నదీ మీరు కాదా...?

ముళ్ళ పొదలను పూల వనముగా
భ్రమించే భ్రాంతి భ్రమరం మీరు కాదా...!

ఒక్కొక్క ప్రభుత్వ సారు,
ఇంటి ఇంటికి తిరిగి తిరిగి
ప్రభుత్వ బడి బాట పట్టమనీ
గుండె విలిసేలా అరిచి చెబితే
ఓదార్చే మనుషులు,
అర్థం చేసుకునే పెద్దలెక్కడా...

నాల్గు వంతులలో మూడు వంతులు
నాల్గు దిక్కులా రంగురంగుల బస్సెక్కి పోతుంటే
ఆ తప్పు మీది కాదా....?
మన ఊరి బడి ఏమవుతుందనే
సోయి మీకు లేదా...?

ఒక్కొక్కరు ప్రెస్టేజ్, స్టేటస్
సింబల్ గా దారులు మారుతూ
ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంఖ్యను
ఒక్కొక్కటి గా నిర్వీర్యం చేస్తూ
చైతన్య ప్రతీకను అచేతనము
చేస్తున్నదీ మీరు కాదా...?
ఒక్కో సంఖ్యనూ చెరిపి,
చివరికికేమీ మిగల్లేదని మూసేస్తే
ఆ బాధ్యత మీకు లేదా...?
ఆచరించండి, మీ వంతు కర్తవ్యం మీరు
చేయండి
అలోచించండి, అంపశయ్య పై నున్న
మన ప్రభుత్వపు బడిని బతికించండి

**డా.ఐ.చిదానందం**
8801444335







# కాలం మారింది

ఒకప్పుడు మనం ఎవరికైనా సహాయం చేస్తే వాళ్లు ఎప్పటికి మీకు ఋణపడి ఉంటాము అనేవారు, ఆప్యాయత ప్రేమ తో ఆదరించేవారు, మానవ సంబంధాలు కొనసాగించేవారు... కానీ ఇప్పుడు కాలం మారింది.. నీతో అవసరం ఉన్నంత వరకే నీతో స్నేహం లేదంటే కనీసం పలకరించకపోవడం, ఏమాత్రం సంబంధం లేకుండా నువ్వు ఎవరో మాకు తెలియదు అన్నట్లు ఉండడం అలవాటు అయిపోయింది, అవసరం ఉంటే మన చుట్టూ తిరిగి వారి అవసరాలు తీరగానే మనలని పట్టించుకోవడం కనీస మానవ సంబంధాలు లేకుండా ఫేక్ దోస్తులు ఎక్కువైపోయారు... కానీ మనిషి కష్టసుఖాలు తెలుసుకోవడానికి మనిషిని అర్థం చేసుకోవడానికి ఎంతా సమయం పట్టదు.. మన ఆప్యాయత అనురాగాలను పంచుకుంటూ తల్లిదండ్రులు అన్నదమ్ములు అక్కాచెల్లెళ్ళు భార్యాపిల్లల తో ఎక్కువ సమయం కేటాయించడం వలన మనిషి సంతోషంగా ఉంటాడు.. హార్వర్డ్ యూనివర్సిటీ అధ్యయనంలో బెస్ట్ ఫ్యామిలీ రిలేషన్స్ ఉంటే మనిషి ఆనందంగా ఉంటాడు అని తేలింది... అందుకే బెస్ట్ ఫ్యామిలీ రిలేషన్స్ ను కొనసాగించడానికి మనం మనకు వీలైనంత సమయం ఇంట్లో వారికి కేటాయిద్దాం... మనల్ని ఆప్యాయత అనురాగాలతో పలకరించే ప్రతీ ఒక్కరికీ తోడుగా నిలుద్దాం... మనకి తెలిసిన వాళ్ళని పలుకరిద్దాం... డబ్బు ఎంతైనా సంపాదించొచ్చు కానీ మంచి పేరు సంపాదించడం కష్టం.. రాజకీయ నాయకులు ఓట్ల కోసం పనిచేయడం కాకుండ ప్రజలలో మంచి పేరు సంపాదించడం కోసం ప్రయత్నం చేయాలి.. ఒక వైద్యుడు పెద్ద పెద్ద దవాఖానలు కట్టి అక్కడికి వచ్చిన అమాయక ప్రజల ఆరోగ్యం బాగుపడాలి అని పనిచేయాలి కానీ ఒక పేషెంట్ విలువ డబ్బుతో చూడొద్దు.. మనిషి ప్రాణానికి విలువ ఇవ్వాలి.. అలాగే ఒక టీచర్ తన వృత్తి నీ పిల్లల భవిష్యత్తు ను సవరించే లా చేయాలి.. ఒక లాయర్ ఫేక్ కేసులు పెట్టడానికి ఆలోచించాలి... ఒక హోటల్ యజమాని తన హోటల్లో నాణ్యత పాటించాలి.. ఇలా ఎవరి వృత్తిలో వారు నిజాయితీగా పనిచేస్తే.... మనిషితనం మంచితనం ఎప్పటికీ ఉంటాయి ఎన్ని కాలాలు మారిన ఒక మంచి పనిని మర్చిపోవడం జరుగదు...




**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

# సుప్రసన్న గారి తాత్విక కావ్యం

## వనవాస రాఘవము


"మరల నిదేల రామాయణం బన్నచో"అన్నట్లు ఆయా కవులు తమ తమ అనుభవాలను, అనుభూతులను వెల్లడిస్తూ నేటికీ ఎంతోమంది రామాయణం రాస్తూనే ఉన్నారు. రామకథ, కావ్యం, చరిత్ర సమాజాన్ని ప్రభావితం చేసినంతగా మరో కథ గాని కావ్యంగాని చరిత్ర గాని ప్రభావితం చేసినట్లు కనిపించదు. హిమవత్ భూధర గుహాగ్రమునుండి వెలువడు గంగలా నాటి వాల్మీకి రామాయణం నుంచి నేటి విద్యార్థి రామాయణం దాకా అది సజీవ స్రవంతి అయి పరవళ్ళు తొక్కుతూనే ఉంది.

ఈ నేపథ్యంలో ప్రాయమింతకు మిగులకై వ్రాలకుండ అని శ్రీనాథుడు అన్నట్లు కాకలు తీరిన కవి పండితులు, కాకతీయ విశ్వవిద్యాలయ తెలుగు శాఖపూర్వ ఆచార్యులు కోవెల సుప్రసన్నాచార్య గారు ఇటీవల వనవాస రాఘవము పేర నూతన కావ్యం రాశారు. సీతలో జగన్మాత లక్షణములను, రాముడిలో ఆదినారాయణ తత్వమును దర్శించిన తాత్వికులు శ్రీ సుప్రసన్న గారు. తేజ చక్రము, అధునా, శతాంకుర, కృష్ణరశ్మీ, శ్రీ నిరుక్తి, సాంపరాయ మొదలైన కావ్యాలతో పాటు సాహిత్య వివేచన, విశ్వనాథ మార్గము, భావుక సీమ, కావ్య ప్రమిత మొదలైన విమర్శ గ్రంథాలు రాసి తెలుగు సాహిత్యమును సంపన్నం చేసినారు. ఇటీవల జనవరి 2025 లో వెలువడిన ఈ కావ్యం లో 121 పద్యాలు ఉన్నాయి. దీనికి ప్రముఖ సాహితీ పరిశోధకులు డాక్టర్ కె.వి. ఎన్.రాఘవన్ గారు విలువైన పీఠికను సమకూర్చారు. భారతీయ చింతన, తాత్వికత నేపథ్యంలో సాగిన వినూత్న, విశిష్ట రచన ఇది."భారత దేశ సంస్కృతి విభావము పొల్చును రామ తత్వమై" అన్నది కావ్యానికి ఇరుసుగా చెప్పవచ్చును. కుండలిని యోగ శక్తుల్ని గర్భీకరించుకున్న రామాయణంలోని రహస్యాలను గుంటూరు శేషేంద్ర శర్మ గారు వివరిస్తే సుప్రసన్న గారు రాముడు సీతను"నుదుట అష్టమి చంద్రునిగా, పెదవుల వాగీశ్వరిగా, హృదయంలో పరమహంసివలె నిలుపుకున్న వైనం లలితా సహస్రనామ స్తోత్రం లోని అష్టమి చంద్ర విభ్రాజ దళిక స్థల




శోభితాను" సూచిస్తున్నది. అలాగే శివధనుస్సును విరిచిన రాముడు పొడవరిగా సీతకు కనిపించాడట. అది రుద్రారంభములోని ఆపాతాళ నభస్థలాంత అన్న మంత్రాన్ని స్ఫురింప చేస్తుందనడం కవి "లోనారాసిన" వైనాన్ని వెల్లడిస్తున్నది. భరతునికి పట్టాభిషేకం, రాముడికి 14 ఏళ్ల వనవాసం కోరిన కైకచే విశ్వాత్మ"నాకిది తోచే దైవ విధి నేనొక ఉపకరణము"అనిపించిందట. అలాగే కైకేయి కోరికల్ని విని అందరూ ఆశ్చర్య పోతే"విభ్రాంతి పొందని" దొకడె వీరుడు రామచంద్రుండు"అని అభివర్ణించారు. అభినవమైన అభివ్యక్తికి ఇవి ఉదాహరణలు. అత్రి అనసూయలు సీతారాములకు ఆశ్రమంలో అతిథి మర్యాదలు సలుపగా"పుట్టింటి సారె"చేరిన తృప్తియు కలిగిందట. ఇక్కడ తెలంగాణ నుడికారం పరిమళిస్తుంది. దాంతో సహజత్వం ఉట్టిపడుతోంది. రామాయణంలో ఋషులందరూ తమ తపశక్తిని ధారపోశారని అగస్త్యుడు ఆదిత్య హృదయమును ఉపదేశించుట అందులో భాగమేనని చివరకు ప్రభువు కృప వల్ల శాంత చిత్తుడైన విశ్వామిత్రుడు తనకు బ్రహ్మర్షి పదవి కంటే చరమ మైన శరణాగతిని పొందటమే ముఖ్యం అనుకున్నాడని తెలిపారు. సురధేనువైన ఈనేల సుందర తరమగుగాక, కనులు మూసిన కాలము కరిగిపోవు, భక్తి అన్న ప్రేమ అన్న ఒక్క భావమగును మొదలైన కవితోక్తులు శాశ్వత సూక్తాలుగా మిగిలిపోతాయి. అలాగే వినయతనయుడు (గరుత్మంతుడు), సీతకు పర్యాయంగా వాడిన అవని జాత, భూమి బిడ్డ, అలాగే రాజుకు పర్యాయంగా వాడిన అవనిధవుడు మంచి ప్రయోగాలు పదబంధాలు. పాల్కురికి సోమనాథుడు అనుభవసారం లో త్రిభంగి అనే విశేష ఛందస్సును ప్రయోగించినట్లుగా సుప్రసన్న గారు ఈ కావ్యం లో "స్వానంద లీలా మధురవృత్తము". అనే విశేష ఛందస్సును ప్రయోగించారు. ఈ కావ్యంలో ఎక్కువగా మధ్యాక్కర ఛందమునే వాడారు.

సుప్రసన్న గారు చెప్పినట్లు"భారతీయ భాషలలో రామాయణములు వందలాదిగా రచింపబడినవి. ఒక్కొక్క కవి రామ మార్గమున తన సాధనమునకు తపస్సునకు ఆధారముగా దానిని నిర్మించుకొనుచు పోయినారు". అని చెప్పారు. ఇది కూడా అతీతం కాదనుకుంటున్నాను. ఇంతటి ఉన్నత, ఉత్తమ కృతిని రచించిన ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య గారికి తెలుగుజాతి రుణపడి ఉంటుంది.



**డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్**
99 891 48 305

# భూ కబ్జాదారుడిని సమర్థిస్తారా..? సస్పెండ్ చేస్తారా..?

- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పై కేసీఆర్, కెటిఆర్‌లు వెంటనే చర్యలు తీసుకోవాలి
- భూ కబ్జాలు చేసింది నిజమే
- కబ్జాలకు సంబంధించిన ఆధారాలను వెల్లడించిన ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి



**వనపర్తి బ్యూరో, మే 18 (జనంసాక్షి) :** భూ కబ్జాలకు పాల్పడ్డ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని వనపర్తి నియోజకవర్గ శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి డిమాండ్ చేశారు.ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్థానిక శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లా,మనోపాడు మండలం,చందూర్ గ్రామంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి బినామీల పేర్ల పై పై సర్వే నెంబర్ 57 లోని 2ఎకరాల 19 గుంటలు భూమిని భూ ఖబ్జా నిజమేనని నిర్ధారణ కావడం తో రెవెన్యూ శాఖ అధికారులు అక్రమణదారులకు నోటీసు లు జారీ చేశారని తెలిపారు.అసెంబ్లీ ఎన్నికల కు ముందు సేవ్ వనపర్తి-చేంజ్ వనపర్తి నినాదం తో ఆత్మగౌరవం కాపాడుకునేందుకు తనకు అండగా నిలిచిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అవినీతి, భూకబ్జాలను నిరూపించడంలో భాగంగా విజిలెన్స్ ఎంఫోర్స్మెంట్ డైరెక్టర్‌కు చేసిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు గద్వాల్ జిల్లా కలెక్టర్ సూచనతో రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులకు సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారన్నారు.తాను కబ్జాలకు పాల్పడలేదని ఎన్నికల ముందు నిరూపించాలని సవాల్ విసిరిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి బిఆరెస్ నాయకులు ఎప్పుడు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తనపై వ్యక్తిగత దూషణలకు దిగిన తాను ఎన్నడూ ఎదుటి వ్యక్తి పై వ్యక్తిగత దూషణలకు దిగలేదని స్పష్టం చేశారు.పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం కు 22 వేల 400 కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరానికి చుక్క నీరు అందలేదని విమర్శించారు.పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు తొంబై శాతం పనులు పూర్తయ్యాయని చెప్పుకుంటున్న బిఆరెస్ నాయకులు తాను సీఎం రేవంత్ రెడ్డి మంత్రులతో మాట్లాడి 2700 కోట్లు విడుదల చేయిస్తాను పూర్తి చేసి చూపాలని సవాల్ విసిరారు.పదహారు నెలల తన పాలనలో వనపర్తి నియోజకవర్గానికి 1000 కోట్ల విలువ గల అభివృద్ధి పనుల లకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయించానని గుర్తు చేశారు. భవిష్యత్తులో వనపర్తి నియోజకవర్గంలో సాగునీటి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపేందుకు 12 లక్షల కోట్ల రూపాయలతో చెరువుల పునరుద్ధరణ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి నివేదికలను సిద్ధం చేస్తున్నామన్నారు.సీజన్లో రికార్డు స్థాయిలో 3 లక్షల 90 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని రైతులు పండించారన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ రైతులపై మొసలి కన్నీరు చూపుతున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం హయాంలో చేసిన నిర్వాకం వల్లే నేడు మిల్లర్లు 700 కోట్ల రూపాయల బకాయిలు పడ్డారని ఈ పాపం ఎవరిదని ఆయన ప్రశ్నించారు.వరి ధాన్యం కొనుగోళ్లలో చివరి గింజ వరకు కొంటామని అన్నదాతలు ఎవరు అధైర్య పడగలను ఆయన సూచించారు.తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో అవినీతి లేని అభివృద్ధిని చేసి చూపిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పీసీసీ సభ్యులు శంకర్ ప్రసాద్, జిల్లా దిశ కమిటీ సభ్యురాలు ధనలక్ష్మి, మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్ పట్టణ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మండల అధ్యక్షుని పదవికి అవకాశం ఇవ్వండి

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోలే శంకర్**



**ఉర్కొండ, మే 18 (జనం సాక్షి) :** ఉర్కొండ మండల పరిధిలోని జకినాలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ భర్త పోలే శంకర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి అవకాశం ఇవ్వాలని కోరుతూ వినతి పత్రాన్ని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా పోలే శంకర్ మాట్లాడుతూ ఉమ్మడి మిడ్జిల్ మండలం లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జెడ్పిటిసి గా పోటీ చేసినప్పుడు ఆయన గెలుపు కొరకు అవిశ్రాంతంగా కష్టపడ్డానాని జకినాలపల్లి ఎంపీటీసీగా నా భార్యను పార్టీ తరఫున నిలబెట్టి నా ఎంపీటీసీ పరిధిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, ఎన్నో సేవలు అందించాలని మండలంలో ఎక్కువ ఎస్సీ సామాజిక వర్గం ఉండటం వలన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాకు అవకాశం ఇవ్వాలని ఈ సందర్భంగా వినతిపత్రంలో తెలియజేశారు.

## సీఎంఆర్ఎఫ్ పథకం పేదలకు వరం

- కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు నారాయణ్ సందీప్ రెడ్డి



**చారకొండ, మే 18 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ యువ నేత నారాయణ్ సందీప్ రెడ్డి, మండల నేత కల్లు సురేందర్ రెడ్డి అన్నారు. సిరుసనగండ్ల గ్రామంలో రామాదేవికి సీఎంఆర్ఎఫ్ నిధుల ద్వారా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సహకారంతో రూ. 22 వేల చెక్కును బాధిత కుటుంబ సభ్యుడికి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ రెడ్డి, సురేందర్ రెడ్డి మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పథకం ఆపదలో ఉన్నవారికి కొండంత అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాంగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభంజనంలా బీసీ మహిళా చైతన్యం



**జిల్లేడు చౌదరిగూడ, మే 18 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా చౌదరిగూడా మండల పరిధి పెద్ద ఎలికిచర్ల గ్రామంలో జాతీయ బీసీ సేన మండల అధ్యక్షురాలు ప్యాట జయ శ్రీకాంత్ బీసీ సేన మహిళ సమావేశం ఏర్పాటు చేశారు ఇందులో భాగంగా తను మాట్లాడుతూ రోజురోజుకు బీసీ మహిళల్లో చైతన్య పెరిగిందని అన్నారు. బీసీ సేన గ్రామాలకు వెళ్ళినాక బీసీలను చైతన్యం చేసిందని అన్నారు. మహిళల కమిటీల ఎంపికకు ముందుకు రావడం చాలా బాగుందని తెలిపారు.గ్రామ మహిళ కమిటీ ఎన్నికకు ముఖ్య అతిథిగా జిల్లా ముఖ్యనాయకులు సదర్ శ్రీనివాస్ యాదవ్.నియోజకవర్గ అసెంబ్లీ అధ్యక్షులు కత్తి శేఖర్ అప్ప. షాద్నగర్ టౌన్ అధ్యక్షురాలు కాటమ్ భాగ్యలక్ష్మి గౌడ్. నియోజకవర్గం కార్యవర్గ సభ్యులు చెన్న బాలరాజ్. ప్యాట శ్రీకాంత్ పాల్గొన్నారు.

కమిటీ ఉపాధ్యక్షురాలు వడ్లవిజయలక్ష్మి. ప్రధాన కార్యదర్శి నేరముని మంజుల. కోశాధికారి గుడిసె లక్ష్మి. కార్యదర్శిబొద్ద నాగమణినియమించారు. ముఖ్య అతిథి మాట్లాడుతూ మహిళా చైతన్యం పెరగాలని మహిళలందరూ ప్రతి ఒక్కరు ధైర్యంతో ముందడుగు వేయాలని బీసీలందరూ ఐకమత్యంతో కలిసిమెలిసి మెలగాలని రాజకీయపరంగా ఆర్థికంగా మహిళలు అన్ని రంగాలలో రాణించాలని సేన ముఖ్య ఉద్దేశమని అభిప్రాయం వెలిబుచ్చారు.

**కాసులబాద్ గ్రామ కమిటీ ఎన్నిక**

గ్రామ అధ్యక్షురాలిగా పందెన్ పల్లి అరుణ, ఉపాధ్యక్షురాలు చిటికెల అనిత, ప్రధాన కార్యదర్శి సాలేటి సుజాత, కార్యదర్శి గండేటి స్రవంతి, కేతముని మంజులను కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధ్యక్షులు పసుపుల ప్రశాంత్ మాట్లాడుతూ నేటి సమాజంలో మన పిల్లలకు భవిష్యత్తులో న్యాయం జరగాలంటే మహిళలందరూ ఏకతాటి పైకి వచ్చే స్వభావాన్ని పెంచుకోవాలన్నారు ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎవరినో నమ్మి కూర్చోకుండా మన వంతుగా ప్రయత్నించాలని ఆదేశించారు.ఇవన్నీ జరగాలంటే మహిళా శక్తి ఎంతైనా అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు చెన్న బాలరాజు మరియు ప్యాటశ్రీకాంత్ గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గోవుల వాహనం పట్టివేత



**చౌటుప్పల్, మే 18 (జనంసాక్షి) :** అక్రమంగా గోవులను తరలిస్తున్న డీసీఎం వాహనం పోలీసులు పట్టుకున్నారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.......ఆదివారం ఉదయం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మండలంలోని పంతంగి టోల్‌గేట్ వద్ద అశోక్ లేలాండ్ డీసీఎం వాహనంలో 28 ఆవులు అక్రమ రవాణా చేస్తుండగా వాహనాన్ని పట్టుకున్నారు.పిఠాపురం సంత నుండి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పట్టుకొని డ్రైవర్ రామావత్ శరత్ కుమార్, క్లీనర్ : దాసరి భగవాన్‌లపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అటవీ భూమిని చెరబట్టిన అక్రమార్కులు



**శివ్వంపేట, మే 18 (జనంసాక్షి) :** అటవీ భూమిని కొందరు అక్రమార్కులు రాత్రికి రాత్రి భూమిని దున్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శివ్వంపేట మండల పరిధిలోని తాళ్లపల్లి తండా గ్రామ పంచాయతీ శివార్ లో ఫారెస్ట్ భూమిని కొందరు అక్రమార్కులు అటవీ భూమి లో భారీ చెట్లను క్రమంగా తొలగించి శనివారం అర్ధరాత్రి ఒక ఎకరా భూమిని చదును చేశారు. ఈ విషయంపై శివ్వంపేట సెక్షన్ ఆఫీసర్ శ్రీధర్ కుమార్ సంప్రదించగా గుర్తు లేని వ్యక్తులు భూమిని ఆక్రమించడానికి ప్రయత్నించారని ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ చేపట్టి అక్రమార్కులను గుర్తించి కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## వాసవి క్లబ్‌ల అధ్యక్షులకు ఘన సన్మానం

- వాసవి క్లబ్‌ల ద్వారా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు
- ఈ సేవలలో ఆయా క్లబ్ అధ్యక్షుల పాత్ర కీలకం



**కల్వకుర్తి, మే 18 (జనం సాక్షి) :** వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో 25 వసంతాలు పూర్తి చేసుకున్న క్లబ్ అధ్యక్షులు అందరికీ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 108లో కల్వకుర్తి రాయచూర్, జడ్చర్ల అధ్యక్షులు అర్హత సాధించారు. ఆదివారం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ, కార్యదర్శి గార్లపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాసవి క్లబ్ పూర్వాధ్యక్షుల కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సన్మానంలో కల్వకుర్తి క్లబ్ నుండి జూలూరు రమేష్ బాబు, కల్మచర్ల రమేష్, కల్మచర్ల గోపాల్, కల్వ హరికృష్ణ, గుగ్గిల శంకర్, దాచేపల్లి మనోహర్, చిదిరి శ్రీనివాస్, బాదం రాఘవేందర్ లను ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి మెమొంటోను బహుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము అందించిన సేవలకు సత్కారం లభించిందని ఆనందం వ్యక్తం చేశారు.

## కేంద్ర ప్రభుత్వం "కులగణన" పూర్తి చేయాలి

- బోడుప్పల్‌లో 326వ వారం అంబేద్కర్‌కు జ్ఞానమాల
- పారదర్శకత్వంగా,నిష్పక్షపాతంగా కులగన జరగాలి
- జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలి
- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు,నత్తి మైసయ్య



**బోడుప్పల్, మే 18 (జనంసాక్షి) :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 326వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి విశ్వం గుప్తా పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం నత్తి మైసయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వము దేశవ్యాప్తంగా కుల గణన నిర్వహిస్తామని నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని,యుద్ధ ప్రాతిపదికన కుల గణన ప్రారంభించి నిష్పక్షపాతంగా,పారదర్శకంగా, కులగణన జరిగే విధంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించినప్పుడే అధిక జనాభా గల బడుగు,బలహీన వర్గాలు విద్య, ఉద్యోగ,రాజకీయ రంగాలలో అభివృద్ధి చెందుతారని నత్తి మైసయ్య అన్నారు.అదేవిధంగా కులగనన పూర్తయిన తర్వాత మాత్రమే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వానికి నత్తి మైసయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూ రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య,గరుగుల యాకయ్య,యేసు రాజు,చిల్ల అంజయ్య,సగ్గు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## సాయి ఫైనాన్స్ బాధితులకు అండగా ఉంటా..

- పేదల సొమ్మును కాజేసిన వారిపై కఠిన చర్యలు తప్పవు
- ఎమ్మెల్యే మేఘారెడ్డి



**వనపర్తి బ్యూరో, మే 18 (జనంసాక్షి) :** రేవల్లి మండల కేంద్రానికి చెందిన సాయి ఫైనాన్స్ బాధితులకు తాను అండగా ఉంటానని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి బాధితులకు భరోసా కల్పించారు. ఆదివారం రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాడల పర్వతాలు ఆధ్వర్యంలో 32 బాధితులు ఎమ్మెల్యే ని కలిసి సమస్యను వివరించారు.32మందికి సంబంధించి 1కోటి 32 లక్షల రూపాయలను మోసం చేశారని ఉపవాసం ఉంటూ కడుపు మార్చుకొని కూడబెట్టుకున్న సొమ్మును ఫైనాన్సు పేరా నమ్మించి మోసం చేశారని తమను ఆదుకోవాలని బాధితులు వాపోయారు.

**అందుకు స్పందించిన ఎమ్మెల్యే**

ఫైనాన్సర్ నుండి మీకు తిరిగి మీ డబ్బులను మీకు అప్పజెప్పేంత వరకు తాను అండగా ఉండి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.నిరుపేదలను మోసం చేసిన వ్యక్తులు ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తి లేదన్నారు.ఎమ్మెల్యేను కలిసిన వారిలో బాధితులు కుర్వ పర్వతాలు, కాళ్ల లక్ష్మయ్య, నూకం బొందయ్య, కుర్వ మల్లేష్, పబ్బతి మల్లేష్ ఎమ్. బాలచంద్రయ్య, కాళ్ల సాయమ్మ, కాళ్ళ శివుడు, గోపాల బుడ్డయ్య, బైని కుర్మయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# జవాబుదారీ పరిపాలనే భాజపా అంతిమ లక్ష్యం

- ఓబిసి మోర్చా నేత బోయిని అనూష




**శేరిలింగంపల్లి, మే 18 (జనంసాక్షి) :** భారతదేశ సౌభ్రాతృత్వం, జవాబుదారీ పరిపాలనను అందించడమే భారతీయ జనతా పార్టీ అంతిమ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యురాలు బోయిని అనూష పేర్కొన్నారు. ఈ మేరకు ప్రొఫెషనల్స్ ఫర్ వన్ నేషన్ - వన్ ఎలక్షన్ పై ఖైరతాబాద్ పరిధి రాజభవన్ రోడ్డు క్షత్రియ హోటల్ లో రిటైర్డ్ ఆర్మీ అధికారులు, సంఘాల నాయకులు, వ్యాపారవేత్తలు, మేధావులు, న్యాయవాదులు, వైద్యులు తదితరులతో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి పలువురు భాజపా నాయకులతో కలిసి బోయిని అనూష మహేష్ యాదవ్ తరలి వెళ్లారు. ఈ మేరకు శేరిలింగంపల్లి లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, కేంద్రమంత్రికి కిషన్ రెడ్డి, వన్ నేషన్ - వన్ ఎలక్షన్ జాతీయ కన్వీనర్ అనిల్ జి, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ రామచందర్ హాజరు కావడం జరిగిందని తెలిపారు. 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్' విధానం ద్వారా ఇటు రాష్ట్రాలకు, ఆటో భారతదేశానికి జరగనున్న మేలు గురించి చాలా గొప్పగా వివరించడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సామాన్యుడి కేంద్రంగా నిజాయితీతో కూడిన పరిపాలనను అందించడంతోపాటు రాష్ట్రంలోని నిరుపేద వర్గాల సమాచారం సేకరించి వారి సంక్షేమానికి నిర్ణయాత్మకమైన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేయడానికి భారత ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుత కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు ఆచరణ సాధ్యంకాని హామీలను ప్రజల పైకి వెదజల్లుతూ ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేస్తున్నారని, ఇలాంటి నాయకులను రాజకీయంగా ఎదగకుండా నిరుపేదల జీవితాలతో చెలగాటం ఆడకుండా ప్రజలు సరైన నిర్ణయాన్ని తీసుకొని భారతీయ జనతా పార్టీని ఆశీర్వదించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
19 మే 2025

# శాంతి భద్రతల పరిరక్షణ కొరకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

● హుస్నాబాద్ ఏసిపి సదానందం

**హుస్నాబాద్, మే 18 (జనంసాక్షి) :** శాంతి భద్రతల పరిరక్షణ కొరకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం ఏర్పాటు చేయడం జరిగిందని హుస్నాబాద్ ఏసిపి సదానందం అన్నారు. ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలు తెలుసుకోవడం కోసం హుస్నాబాద్ పట్టణంలో సుభాష్ నగర్ కాలనీ, టీచర్స్ కాలనీలలో హుస్నాబాద్ ఏసిపి సదానందం ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంట్రాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. ప్రజల రక్షణ మరియు ప్రజలకు సెన్సాఫ్ సెక్యూరిటీ భద్రతాభావం కలిగించడం గురించి కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు రక్షణ పరంగా తీసుకోవలసిన చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తర్వాత ప్రజలను ఉద్దేశించి ఏసిపి సదానందం మాట్లాడుతూ ప్రజల రక్షణ గురించి ప్రజలకు భద్రతాభావం సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ కల్పించడం గురించి కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల యొక్క సమస్యలు నేరుగా తెలుసుకొనే అవకాశం ఉంటుందని, గ్రామాలలో పట్టణాలలో కాలనీలో ఎవరైనా కొత్త



వ్యక్తులు గాని నేరస్తులు కానీ వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందని, కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందన్నారు. గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళల రక్షణకు చట్టాలు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. యువత సన్మార్గంలో నడవాలని సూచించారు. గంజాయి ఇతర మత్తుపదార్థాలు తీసుకొని జీవితాలు నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఎవరైనా కొత్త వ్యక్తులు గ్రామాలలో కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మోటార్ సైకిల్ వాహనదారులు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ ధరించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. గ్రామంలోఎవరైనా అనుమానస్పదంగా తిరుగుతున్న మరియు గ్రామంలో చుట్టుపక్కల గ్రామంలో ప్రభుత్వం నిషేధించిన గంజాయి, ఇతర మత్తు పదార్థాలు అమ్ముతున్నా కలిగి ఉన్న వారి సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో తెలపాలని లేదా డయల్ 100 కాల్‌కు ఫోన్ చేసినాచో వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, కోహెడ ఎస్ఐ అభిలాష్, అక్కన్నపేట ఎస్ఐ విజయభాస్కర్, ప్రొబిషనరీ ఎస్ఐ నవీన్, సర్కిల్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ క్యాంపు కార్యాలయ భవన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయండి

● కలెక్టర్ క్రాంతి వల్లూరి



**సంగారెడ్డి, మే 28 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా పాత కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్మించబోయే జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయ భవన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆర్ అండ్ బి శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్, రోడ్లు, భవనాల శాఖ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. సుమారు రూ. 2.5 కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా నిర్మించాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈ పరిశీలనలో డి ఈ, ఆర్ అండ్ బి రామకృష్ణ, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

● మండల అధ్యక్షుడు కే.ఎం నారాయణ



**మహమ్మదాబాద్, మే 18 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఎం సహాయనిది చెక్కులు పంపిణీ పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేఎం,నారాయణ అన్నారు. ఆదివారం గాదిర్యాల్ గ్రామంలో మాచారం గోపాల్ రెడ్డి,టక్కరి అంజలయ్య,చాకలి హన్మంత్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు అనంతరం వివిధ గ్రామాలలో పెళ్లి వేడుకల్లో నూతన పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీకాంత్ రెడ్డి,జి చంద్రయ్య,ఎస్ కేశవులు,ఎం గోపాల్ రెడ్డి,బి రాములు,టి,బసయ్య,నిరటి అంజిలయ్య,ధ్యానమోని అనంతయ్య,గ్రామ పెద్దలు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణలో జాప్యం జరగకుండా చర్యలు


● జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**కొల్చారం, మే 18 (జనం సాక్షి) :** ధాన్యం సేకరణలో జాప్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ కొల్చారం మండలం రాంపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో పక్కా ప్రణాళికతో కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని గత సంవత్సరం కంటే మెరుగ్గా ఇప్పటి వరకు జిల్లాలో 2, లక్షల 20, వేల 160.480 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. గత సంవత్సరం రబీ సీజన్లో 1 లక్ష 94 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం కొనుగోలు పగడ్బందీగా నిర్వహిస్తున్నందుకు నిర్వాహకులను అభినందించారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని త్వరగా తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు సంబంధిత అధికారులు కేంద్రాల వద్ద క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని అన్నారు. ధాన్యం సేకరణను నిశితంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. రైతుల నుంచి ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం నిల్వలు, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు



ఉన్నాయా! ధాన్యం అమ్మకాల వివరాలతో కూడిన రసీదులు అందిస్తున్నారా? అని ఆరా తీశారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు పంపించాలని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలువ లను వెంటనే ఖాళీ చేసే ప్రయత్నం చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు పడకూడదని, ధాన్యం తెచ్చిన వెంటనే నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి తూకం చేయించాలని నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే నిర్దేశిత మిల్లులకు తరలించాలని, లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మిల్లుల వద్ద సకాలంలో అన్‌లోడింగ్ చేసుకునేలా పర్యవేక్షించాలన్నారు. తగినంత టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా చేపట్టవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను సూచించారు.

## రైతు రుణ మాఫీ చేయాలని రైతు సంఘం డిమాండ్



**మక్తల్, మే 18 (జనంసాక్షి) :** రైతుల రుణాలన్నీ మాఫీ చేయాలని, రుణ విమోచన చట్టం తీసుకురావాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) డిమాండ్ చేసింది. మక్తల్ మండలంలో ఆదివారం జరిగిన ప్రచార కార్యక్రమంలో ఏఐయుకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. రాము మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధర కల్పించాలని, పంట బీమా పథకాన్ని మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు రైతు రుణాలను మాఫీ చేయాలని, రైతు భరోసా ఇవ్వాలని, పంటలకు బోనస్ ప్రకటించాలని ఆయన కోరారు. కౌలు రైతులకు హక్కులు కల్పించాలని, భూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐయుకేఎస్ జిల్లా అధ్యక్షుడు భగవంతుడు, పిడిఎస్యు బి. భాస్కర్, ఏఐయుకేఎస్ డివిజన్ అధ్యక్షులు ఆనందు, పివైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి సలీం, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి అజయ్, రైతు సంఘం నాయకులు గోపాల్, నర్సింలు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన చర్చిని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే



**రాయికోడు, మే 18 (జనం సాక్షి) :** మండల పరిధిలోని ఇటికపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన చర్చిని ఆదివారం ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు యేసు క్రీస్తు ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.ఇటిక పల్లి గ్రామంలో ఇంత అందంగా నూతన చర్చిని నిర్మించడం పట్ల ఆయన కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ పట్లోళ్ల విట్టమ్మ కిష్టారెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు చేవెళ్ల విటల్,ప్రధాన కార్యదర్శి కే శంకర్, వీరభద్రేశ్వర స్వామి దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ సంగమేశ్వర్, వరము మాజీ ఉపాధ్యక్షులు బి తుకారాం, బిఆర్ఎస్ నాయకులు అంజు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా జిల్లా యంత్రాంగం

**గద్వాల నడిగడ్డ, మే 18 (జనం సాక్షి) :** జిల్లా యంత్రాంగం రైతులకు అండగా ఉంటుందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా ఆదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. యాసంగి 2024-25 కాలానికి సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకు 59 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని, గత రబీ సీజన్ తో పోలిస్తే ఈసారి ధాన్యం సేకరణ 2,500 టైమ్స్ దిగుబడి పెరిగిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ నిత్యం అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ, ధాన్యం సేకరణ, తరలింపును సమర్థవంతంగా నిర్వహించడానికి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అకాల వర్షం వల్ల ధాన్యం తడిసినప్పటికిని రైతులు అధైర్య పడవద్దని, చివరి గింజ కొనేంత వరకు కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని



తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో డిప్యూటీ తహశీల్దార్లు, ఏపీఎంలు అప్రమత్తంగా ఉన్నారని, కర్ణాటక సరిహద్దులలో గల కేటి దొడ్డి, మైలార్ గడ్డ,నందిన్నె గ్రామాల వద్ద గల కొనుగోలు కేంద్రాలలో ఉన్న ప్రతి ధాన్యం కుప్పను క్షుణ్ణంగా పరిశీలించిన పిదపనే కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కర్ణాటక సరిహద్దుల గుండా జిల్లాలో అక్రమంగా ధాన్యం ప్రవేశించకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

## భారత ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలి

● పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్



**గద్వాల నడిగడ్డ, మే 18 (జనం సాక్షి) :** భారత ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ అన్నారు. ఆదివారము ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా 16వ మహాసభలు గద్వాల జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవన్‌లో సభకు పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని, కాల్పుల విరమణ ప్రకటించాలని, ఆదివాసి మహిళలపై అత్యాచారాలను నిలిపివేయాలని, ఆదివాసీల జీవించే హక్కును కాపాడడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ సందర్భంగా వారు అన్నారు. అనంతరము నూతన జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన బాధ్యులుగా అధ్యక్షులుగా ఎండి సుభాన్, ఉపాధ్యక్షుడిగా ఎం.మహాదేవ్, కాలేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా జక్కా బాలయ్య, సహాయ కార్యదర్శిలుగా కలకొండ రాములు, లక్ష్మి నారాయణ, బసవరాజ్, కోశాధికారిగా వెంకటేష్ లుగా ఎన్నికయ్యారని నిర్వాహకులు తెలిపారు.

## మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

● జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**కొల్చారం, మే 18 (జనం సాక్షి) :** జిల్లాలోని ప్రజలందరికీ ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మెదక్ జిల్లాలోని మండల కేంద్రమైన కొల్చారంలో ఆదివారం కొల్చారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా దవాఖానలోని పలు వార్డులు, ప్రసూతి విభాగం, వార్డుల్లో రోగులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. పలువురు బాలింతలతో మాట్లాడారు. ఓపి రిజిస్టర్, సిబ్బంది హాజర పట్టిక పరిశీలించారు. ప్రతి రోజూ ఎంత మంది రోగులు వస్తున్నారని? గత నెలలో మొత్తం ఎంత మంది వచ్చారు? అని ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ ఆసుపత్రిలో అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట వైద్య సిబ్బంది మదన్మోహన్, ప్రవీణ, లోరి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ

**గద్వాల నడిగడ్డ, మే 18 (జనం సాక్షి) :** ఈనెల 20న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబాపూలే,విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవం విజయవంతం చేద్దామని పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు బీరెల్లి దానయ్య, ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి. జమ్మిచెడు కార్తీక్ అన్నారు. ఈ సందర్భంగా బీరెల్లి దానయ్య,



మాట్లాడుతూ ఈ నెల 20 న జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామం లో జరగబోయే భారతరత్న, నవభారత నిర్మాత డాక్టర్, బి.ఆర్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిబాపూలే ఇద్దరి మహనీయుల విగ్రహావిష్కరణ మన నడిగడ్డ ప్రాంతంలో ఆవిష్కరించుకోవడం ఎంతో గర్వంగా ఉందని అన్నారు. పెద్ద ధన్వాడ గ్రామ పెద్దలు,యువకులు, విద్యార్థులు,ఉద్యోగులు, నడిగడ్డ ప్రాంతంలోనే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, భారతదేశంలోనే అణగారినప్రజలకు విద్యాబుద్ధులు నేర్పిన, గొప్ప సంఘసంస్కర్త, మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహాలు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. పెద్ద ఎత్తున మేధావులు, ప్రజాసంఘాలు,కుల సంఘాలు,అంబేద్కర్ వాదులు, ప్రజాస్వామిక వాదులు రాజోలి మండలం, పెద్ద దన్వాడ చేరుకొని విజయవంతం చేద్దామని వారు అన్నారు.

## ఉచిత వైద్యాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి



**తూప్రాన్, మే 18 (జనం సాక్షి) :** కార్పొరేట్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సర్పంచ ఫోరం మాజీ ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్ ముదిరాజ్ తెలిపారు. మనోహరాబాద్ మండలం కాళ్ళ కల్ మెడిసిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్య శిబిరంలో ఉచిత జనరల్ పరీక్షలతోపాటు స్త్రీల సాధారణ గర్భాశయ సమస్యలు చెవి ముక్కు గొంతు కన్ను బొక్కల చర్మ వ్యాధి నిపుణులు ప్రత్యేక డాక్టర్లు పాల్గొన్నారు. ఈ క్యాంపులో డాక్టర్లు సంతోష్, కరీం ,రాహుల్, ప్రవీణ్, సిన్యా, శ్రీధర్, అనీషా, రోషన్, రమతేజ, అపూర్వ, కీర్తి, రవి డాక్టర్లతో పాటు వైద్యం బృందం పాల్గొన్నారు.

# వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

● ఎఎస్సై ఆంజనేయులు

**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 18 (జనం సాక్షి) :** వాహనదారులు రోడ్డు నియమాలు పాటించాలి అని నారాయణపేట ఎ ఎస్సై ఆంజనేయులు అన్నారు. ఆదివారం జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు అవగాహన కల్పించారు.వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, లేనియెడల చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆంజనేయులు వాహనదారులకు తెలిపారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని సావర్కర్ చౌరస్తాలో వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్సై ఆంజనేయులు మాట్లాడుతు వాహనదారులు రోడ్డు భద్రతా



నియమాలు పాటించాలని వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలని చాలావరకు నివారించవచ్చని సూచించారు. వాహనదారులు తప్పకుండా వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. వాహనదారులు రాష్ డ్రైవింగ్ చేయరాదని మద్యం సేవించి వాహనాలు నడపరాదని డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ఉపయోగించాలని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని, త్రిబుల్ రైడింగ్ చేయరాదు అని అన్నారు. వాహనాలు నడిపే సమయంలో కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని వాహనాలు నడిపితే చాలావరకు రోడ్డు ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుందని ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించి సురక్షితంగా తమ గమనస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబంది, వాహనదారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జాప్యానికి తావులేకుండా చర్యలు

జిల్లా కలెక్టర్ సత్య శారద



**చెన్నారావుపేట, మే18(జనం సాక్షి):** కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణలో జాప్యానికి తావులేకుండా ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ఆదివారం చెన్నారావుపేట, ముగ్దుంపురం, పాపయ్యపేట గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జల్లి గ్రామంలోని రైస్ మిల్ ను సందర్శించి పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు పలు సూచనలు చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాల వద్ద క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. ధాన్యం సేకరణను నిశితంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. రైతుల నుంచి ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం నిల్వలు, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా! ధాన్యం అమ్మకాల వివరాలతో కూడిన రసీదులు అందిస్తున్నారా? అని ఆరా తీశారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు పంపించాలని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలువలను వెంటనే ఖాళీ చేసే ప్రయత్నం చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు పడకూడదని ధాన్యం తెచ్చిన వెంటనే నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి తూకం చేయించాలని నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే నిర్దేశిత మిల్లులకు తరలించాలని లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మిల్లుల వద్ద సకాలంలో అన్‌లోడింగ్ చేసుకునేలా పర్యవేక్షించాలన్నారు. తగినంత టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా చేపట్టవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జల్లి గ్రామ రైస్ మిల్ ను తనిఖీ చేసిన కలెక్టర్ మిల్లులోని రికార్డులు, ధాన్యం మైచర్ యంత్రాలు, బియ్యాన్ని పరిశీలించారు. రోజుకు వచ్చే ధాన్యం వివరాలు, మిల్లు కెపాసిటీ అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా సహకార శాఖ అధికారి నీరజ, జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా మేనేజర్ సంధ్యారాణి, తహసిల్దార్ ఫణి కుమార్, గిర్దావర్ మహమ్మద్ రషీద్, సీఈవో చిట్టె రవి, మహమ్మద్ సలీం, తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద ఘటన కలచివేసింది



**హైదరాబాద్ (జనంసాక్షి) :** చార్మినార్ సమీపంలోని గుల్జార్ హౌస్ లో ఆదివారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో సనత్ నగర్ సౌభాగ్య నగర్ కు చెందిన రజని అగర్వాల్ మృతి చెందడంలో ఆమె నివాస ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఏఐసీసీ సభ్యులు, సనత్ నగర్ కాంగ్రెస్ ఇన్చార్జ్ డా.కోట నీలిమ చేరుకుని నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను ఓదర్చారు. రజని శవ యాత్ర వెంట ఈఎస్ఐ శ్మశానవాటిక వరకు వెళ్లారు. ఈ సందర్భంగా డా.కోట నీలిమ మాట్లాడుతూ అగ్నిప్రమాద సంఘటన తనను ఎంతో కలచివేసిందన్నారు. సరదాగా తల్లిదండ్రుల వద్ద గడిపేందుకు వెళ్లి మృత్యువాత పడటం జీర్ణించుకోలేకపోతున్నాన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి ప్రభుత్వం తరపున అండగా ఉంటామన్నారు.

# లారీ గుత్తేదారుల మాయాజాలం

### కాంటాలైన మిల్లులకు చేరని ధాన్యం

### రెండు లారీలు ఉన్న వ్యక్తికి కాంట్రాక్ట్

### ప్రభుత్వ ఖజానాకు కన్నం వేస్తున్న లారీ యజమానులు



**కాటారం మే 18 (జనంసాక్షి):** ఆరు కాలాలపాటు కష్టించి పండించిన వరి ధాన్యాన్ని రైతులు మధ్య దళారులకు అమ్మి మోసపోవద్దని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఇందిరా కాంతి పథకం ద్వారా వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను రైతుల ధాన్యానికి చెల్లిస్తుంది. కాటారం మండలంలో 24 గ్రామ పంచాయతీలకు గాను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రబి సీజన్ కు 16 వరి ధాన్యం కొరకు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని మిల్లులకు చేరవేసేందుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఓ ట్రాన్స్ పోర్టర్ టెండర్లు పొంది గతంలో ట్రాన్స్ పూర్తి చేసిన వారికే అప్పగించిందు. అయినప్పటికీ ట్రాన్స్పోర్టర్ మాయాజాలం చేస్తుండడంతో కాటారం మండలంలో ని రైతులకు శాపంగా మారింది. కష్టించి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి నాన్న ఇబ్బందులు పడి కాంటాలు వేయించినప్పటికీ ట్రాన్స్పోర్ట్ కనికరించక పోవడంతో రైతుల నష్టపోతున్నారు. టెండర్లు పొందిన గుత్తేదార్ మొఖం చాటేసి వరంగల్ నుండి కాటారంకు డైలీ సామాన్లు చేరవేస్తున్న ఓ ట్రాన్స్పోర్ట్ యజమానికి పనులు అప్పగించడం సదరు కాంట్రాక్టర్ లారీలను సమకూర్చక పోవడంతో కొనుగోలు కేంద్రాలనే వరి ధాన్యం నిలిచిపోయింది. దీంతో ఇటీవల అకాల వర్షాలు కురుస్తుండడంతో లక్షల రూపాయల విలువైన వారి ధాన్యం కల్లాలోని తడిసి ముద్దవుతుంది. వరి ధాన్యం కల్లాలోనే రోజుల తరబడి ఉండడంతో కొనుగోలు కేంద్రాలలో మొలకలు వస్తున్నాయని రైతుల ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యాన్ని కొనుగోలు కోసం చేరవేస్తే నెలలు గడుస్తున్న మిల్లులకు చేరకపోవడానికి కారకులు ప్రభుత్వ యంత్రాంగంమా, కొనుగోలు కేంద్రానిర్వాకులా, లారీ యజమానులా అర్థం కాని పరిస్థితిలో రైతుల కొట్టుమిట్టాడుతున్నారు.



**ఎవరికి వచ్చినా చేరవేసేది పాతోళ్లే..**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం మండలం లో ఖరీఫ్, రబీ సీజన్లో లక్షల ఎకరాల్లో వారిని సాగు చేస్తున్నారు. ప్రాజెక్టులు, పెద్ద పెద్ద చెరువులు లేనప్పటికీ రైతాంగం కుంటలు, బోరు బావుల పై ఆధారపడి వరి, పత్తి పంటను సాగు చేస్తున్నారు. ప్రతి సీజన్లో పంటలు పండించే ఒక ఎత్తు అయితే అమ్మకం పెద్ద సవాల్ గా మారింది. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరతోపాటు, బోనస్ ను పొందినందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు దాన్ని నమ్ముతున్నారు. దీన్ని ఆసరా చేసుకున్న కొందరు లారీ యజమానులు తమకు సరిపోను లారీలు లేనప్పటికీ పై అధికారులకు లంచాలుగా డబ్బులను వెదజల్లి కాంటాక్ట్ పొంది రైతులను ఇబ్బంది గురి చేస్తున్నారని వాపోతున్నారు. జిల్లాలో ధాన్యాన్ని చేరవేసేందుకు ఎవరు కాంట్రాక్ట్ పొందిన పాతవారే ధాన్యాన్ని లారీల ద్వారా చేరవేయడం కొసమెరుగు.

తక్కువ దూరం ఉన్న మిల్లుకు చేరవేస్తూ అధిక దూరం డబ్బులు పొందుతున్నారు. లారీ యజమానులు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని దగ్గరలో ఉన్న మిల్లు చేరవేస్తూ ఎక్కువ కిలోమీటర్ రాయించుకొని ప్రభుత్వ ఖజానాకు కన్నం వేస్తున్నారు. ఉదాహరణకు చెప్పాలంటే రేకులగూడెం కొనుగోలు కేంద్రంలో లోడ్ అయిన లారీలు బయ్యారం గ్రామపంచాయతీ పరిధిలో అంకుసాపూర్ రోడ్డు వద్దనున్న రైస్ మిల్ కు వెళ్లాలంటే కాటారం వయ కాకుండా కొయ్యూరు, రుద్రారం, బస్వాపూర్ వయా కొత్తపల్లి ద్వారా మిల్లుకు వెళుతున్నట్లు తెలిసింది. ఇలా చెప్పాలంటే ఇంకా ఎన్నో మాయలు చేసి రైతులను ఇబ్బంది పరుస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. వేసంగి సీజన్ వరి కొనుగోళ్లు ప్రారంభమై నెలలు గడుస్తున్న అదే రీతిలో లారీలు లేకపోవడం మూలంగా కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడిసి ముద్ద అవుతున్నాయి.

## ఏరియల్ సర్వే నిర్వహించిన అధికారులు

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** కాళేశ్వరంలో హెలికాప్టర్ జాయ్ రైడ్ ద్వారా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, కరీంనగర్ సిపి గౌస్ అలం, కరీంనగర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ లు ఏరియల్ సర్వే నిర్వహించారు. త్రివేణి సంగమ క్షేత్రమైన కాళేశ్వరంలో భక్తుల రద్దీ కొనసాగుతున్న నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. గగనతలంలో సంచరిస్తూ నది తీరం, వాహనాల రాకపోకలతో పాటు, వివిధ ఏర్పాట్లను, సిబ్బంది సేవలను పరిశీలించారు. పుష్కర ఘాట్‌లు, రహదారి సదుపాయాలు, టెంట్ సిటి, భద్రతా ఏర్పాట్లును వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తులకు జాయ్ రైడ్ హెలికాప్టర్ ద్వారా త్రివేణి సంగమం, కాళేశ్వర దేవస్థానం, కాళేశ్వరం చుట్టు ప్రక్కల అడవులు తదితర అందాలను వీక్షించడానికి జాయ్ రైడ్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.



## సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులను

# గడువులోగా పూర్తి చేయండి

### సంబంధిత శాఖల అధికారులతో పనుల ప్రగతిని సమీక్షించిన కలెక్టర్



**వరంగల్ ప్రతినిధి, మే18 (జనంసాక్షి):** సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ డాక్టర్ సత్య శారద వరంగల్ నగరంలో కొనసాగుతున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులైన హాస్పిటల్ బ్లాక్లు, యుటిలిటి బ్లాక్, ధర్మశాల, కిచెన్, డైనింగ్, సెక్యూరిటి, లాండ్రి, ఎక్విప్మెంట్, తదితర పనుల పురోగతిని అధికారులతో సమీక్షించారు. స్ట్రక్చర్ నిర్మాణ పనులు,స్ట్రామ్ డ్రైన్ పనులు పూర్తయ్యాయని, మాసోనరీ పనులు 86 శాతం , మెకానికల్ ఎలక్ట్రికల్ ప్లంబింగ్ పనులు 78 శాతం పూర్తయ్యాయని, అధికారులు కలెక్టర్ కు వివరించగా, సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకొని పనుల్లో మరింత వేగం పెంచి ఎట్టిపరిస్థితుల్లోనూ వచ్చే డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ మెడికల్ విభాగాలను ఏర్పాటు చేయుటకు అవసరగు స్థలం మరియు మెడికల్ పరికరాలు ఎక్కడ అమర్చాలో సంబంధిత మెడికల్ విభాగాల అధిపతులు క్షేత్ర స్థాయిలో భవనంలో పరిశీలించి ఖరారు చేయాలని ఎంజిఎం పర్యవేక్షకులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షలో ఆర్ అండ్ బి ఎస్ఈ నాగేంద్ర, ఎంజీఎం, కేఎంసీ సూపరింటెండెంట్లు కిషోర్, రాంకుమార్ రెడ్డి, టిజిఎంఎస్ ఐడిసి ఈఈ ప్రసాద్, డిఎం హెచ్ ఓ సాంబశివరావు, ఎల్ అండ్ టి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వెంకట్‌కు జాతీయ కీర్తిరత్న, శ్రీ గౌతమేశ్వర పురస్కారాలు

**నిర్మల్ రూరల్, మే 18 (జనంసాక్షి)** నిర్మల్ కు చెందిన సంస్కృతభాషా ప్రచార సమితి ఆదిలాబాదు నిజామాబాదు ఉమ్మడి జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షులు,ప్రముఖ కవి బి. వెంకట్ జాతీయ కీర్తిరత్న,శ్రీ గౌతమేశ్వర విశిష్ట సాహితీ పురస్కారాలను ఆదివారం మంథనిలో అందుకున్నారు. వెంకట్ చేస్తున ఆధ్యాత్మిక, సాహిత్య సాంస్కృతిక సామాజిక విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం ములను అందజేశారు. 1994 నుండి 5 వేలకు పైగా సభా కార్యక్రమాలును నిర్వహించినందుకుగాను, తెలుగు, సంస్కృతము భాషలపై 18 లక్షలమంది బాలబాలికలకు ఉచిత శిక్షణ ఇచ్చినందుకు గుర్తింపుగా ఈ పురస్కారములను అందజేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుండి 50 మందికి పైగా కవులు, కవయిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యార్థి అఖిలేష్‌కు ఎంపీ వద్దిరాజు ఆశీస్సులు



**ఖమ్మం, జనంసాక్షి :** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఏస్ఏస్సీ (పదవ తరగతి) బోర్డ్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన అఖిలేష్ కు తన ఆశీస్సులు అందజేశారు. ఖమ్మం ఖానాపురం హవేలీ శ్రీఅభయ్ వెంకటేశ్వర నగర్ వాస్తవ్యులు ముత్యాల గోవర్ధన్-స్వప్నప్రియ దంపతుల కుమారుడు అఖిలేష్ ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షల ఫలితాలలో మొత్తం 600 గాను 592 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర ఆదివారం ఉదయం ఖమ్మంలోని తన క్యాంప్ కార్యాలయంలో అఖిలేష్ ను శాలువాతో సత్కరించి,ఇదేవిధంగా కష్టపడి చదువుతూ జీవితంలో ఉన్నతంగా ఎదగాలని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల గౌరవాన్ని మరింత పెంచాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు, ఆశీర్వదించారు. ఎంపీ వద్దిరాజుతో పాటు సన్నిహితులు ఆకుల గాంధీ,శీలంశెట్టి వీరభద్రం,కనిశెట్టి నర్సయ్య,కేదాసి నర్సయ్య,వేములపల్లి వెంకటేశ్వర రావు, శాఖమూరి రమేష్ తదితర ప్రముఖులు అఖిలేష్,ఆయన తల్లిదండ్రులు గోవర్ధన్ -స్వప్నప్రియలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## పదిహేను రోజుల్లో దివ్యనగర్ పార్కు అభివృద్ధి పనులు

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, మే18, (జనంసాక్షి) :** నిర్మల్ పట్టణంలో విశాలమైన పార్కు స్థలం కలిగి ఉన్న ఏకైక ప్రాంతం దివ్యనగర్ అని దీనిని పూర్తి వినియోగంలోకి తెచ్చే విధంగా 15 రోజుల్లో పార్కు అభివృద్ధి పనులు ప్రారంభిం చాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మున్సిపల్ అధికారులను ఆదేశిం చారు. ఆదివారం జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తో కలిసి జిల్లా కలెక్టర్ దివ్య నగర్ పట్టణంలోని పార్కును సందర్శించారు. పార్కులో వాకింగ్ ట్రాక్, వాటర్ ఫౌంటెన్, ఓపెన్ జిమ్, పిల్లల ఆట సామాగ్రి మొత్తాన్ని మరమ్మతులు చేసి పూర్తి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అదేవిధంగా జూన్ మొదటి వారంలో పార్కులో అవసరమైన అన్ని రకాల మొక్కలను నాటి పచ్చదనంతో కళకళలాడే విధంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పార్కు చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి ఇతరులు ఎవరు పార్కులోనికి రాత్రి వేళల్లో రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్కులో సాయంత్రం వేళల్లో పర్యాటకులు సందర్శించే విధంగా సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని అన్నారు.

**కాలనీ సమస్యలపై నివేదిక ఇవ్వండి..**

కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తనకు నివేదిక ఇవ్వాలని మున్సిపల్ అధికారులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మదులు ఆదేశించారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ఇంజనీర్లు, సానిటరీ ఇన్స్పెక్టర్, వార్డ్ ఆఫీసర్ లతో పాటు కాలనీ అధ్యక్షులు పురస్తు శంకర్, నాయకులు నరేందర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, రాజన్న,జుట్టు లక్మన్, సాయినాథ్, రాందాస్,శ్రీనివాస్ చారి,సతీష్ రెడ్డి, కిష్టయ్య, రామ కృష్ణ తదితరులు ఉన్నారు.

# అధునాతన వరంగల్ రైల్వే స్టేషన్ భవనం సిద్ధం

### ఈ నెల 22న భారత ప్రధాని నరేంద్ర మోదీ చేతులు మీదుగా వర్చువల్‌గా ప్రారంభం



**వరంగల్ ఎంజీఎం, మే 18(జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద 25.41 కోట్ల నిధులచే పునఃప్రారంభానికి సిద్ధమైన అధునాతన వరంగల్ రైల్వే స్టేషన్ భవనాన్ని ఈ నెల 22న భారత ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ గా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా వరంగల్ రైల్వే స్టేషన్ ని బిజెపి నాయకులతో కలిసి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, మాజీ పార్లమెంటు సభ్యులు అజ్మీర సీతారాం నాయక్, మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు, ఆరూరి రమేష్, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు సందర్శించడం జరిగింది. అనంతరం మీడియాను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఎయిర్పోర్ట్ తరహాలో అత్యాధునిక వసతులతో వరంగల్ రైల్వే స్టేషన్ లో విశాలమైన ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎక్సలేటర్లు, లిఫ్టులు, ర్యాంపులు, ల్యాండ్ స్కేపింగ్, ఆధునిక ఆహారశాలలు, వాణిజ్య సముదాయాలు నిర్మించామన్నారు. అదేవిధంగా మౌలిక వసతులకు ప్రాధాన్యమిస్తూ అత్యాధునిక సౌకర్యాలతో మరుగుదొడ్లు సామాగ్రి భద్రపరచుకునే గదులు తాగునీరు ఏటీఎం సౌకర్యాలు కల్పించమన్నారు. అత్యాధునిక వసతి గదులు, ప్లాట్ ఫారాల మీద డిజిటల్ డిస్ప్లే బోర్డులు అందుబాటులో ఉన్నాయని, రైల్వే స్టేషన్ మొత్తం సీసీటీవీ పరిధిలో మెగా ఉంచడంతోపాటు పచ్చదనం, పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. కార్పోరేట్ తరహాలో ఏసీ వెయిటింగ్ హాల్స్ లాంటి వసతులతో ప్రయాణికులకు సేవలు అందించడం కోసం అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద 25.41 కోట్ల నిధులతో పునఃప్రారంభానికి సిద్ధమైనదని అన్నారు. 2014 -15లో రూ. 258 కోట్లుగా ఉన్న తెలంగాణ రైల్వే బడ్జెట్ కేటాయింపులను కేవలం 10 సంవత్సరాల వ్యవధిలోనే 20 రెట్లు పెంచి 2024- 25 నాటికి రూ. 5,070 కోట్లకు చేర్చడం తెలంగాణలో రైల్వే అభివృద్ధి మీద మోదీ ప్రభుత్వానికి నిబద్ధతను తెలియజేస్తుందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పేర్కొన్నారు. ఇంతవరకు ఎలాంటి రైలు సౌకర్యం లేని మెదక్, సిద్దిపేట లాంటి ప్రాంతాలకు కూడా కేంద్రం కొత్తగా రైలు సౌకర్యం అందుబాటులోకి తెచ్చిందని ఆదాయపరంగా అనుకూలంగా కాకపోయినా మల్లన్న భక్తుల కోసం కొమరవెల్లిలో నూతన రైల్వే స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్టేషన్ నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన కార్యక్రమానికి కూడా ఘనంగా నిర్వహించుకున్నామని రవికుమార్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైల్వేలలో అపూర్వమైన రీతిలో అభివృద్ధి సాధించడానికి మరింతగా కృషి చేస్తామని రాష్ట్రంలో రైల్వే రూపు రేఖలను సమూలంగా మార్చివేస్తామని గంట రవికుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్, వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాబేటి వెంకట్ గౌడ్, రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు బన్న ప్రభాకర్, జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు ఎరుకుల రఘునా రెడ్డి, కనుకుంట్ల రంజిత్ కుమార్, మాచర్ల దీన్ దయాల్, గడల కుమార్, జిల్లా కార్యదర్శి గోకే వెంకటేష్, కోశాధికారి కూచన క్రాంతి కుమార్, అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్, శ్రీరంగం సాగర్, ప్రచార కార్యదర్శి బైరి శ్యామ్, మరియు రాష్ట్ర ఓబిసి కార్యవర్గ సభ్యులు బైరి మురళకృష్ణ, గోగికర్ అనిల్ కుమార్ బిజెపి జిల్లా నాయకులు వివిధ మోర్చా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, బిజెపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులను గాలికొదిలి అందాల పోటీలు పెట్టడం సిగ్గుచేటు

- మాజీ ఎమ్మెల్సీ, చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు చెరుపల్లి సీతారాములు



**హైదరాబాద్, మే 18 (జనంసాక్షి) :** జీవనోపాధి కరువై నేతన్నలు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే ప్రభుత్వం అదేమీ పట్టించుకోకుండా అందాల పోటీలలో మునిగితేలుతుందని మాజీ ఎమ్మెల్సీ, చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు చెరుపల్లి సీతారాములు విమర్శించారు. మనసురాబాద్ డివిజన్ పరిధి సహారాస్టేట్స్ కాలనీలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర కార్మిక సంఘం సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో చేనేత కార్మికులు పొద్దంతా పనిచేసిన పూట గడవక ఆత్మహత్యలకు పాల్పడుతుంటే ఆదుకోక పోగా కోట్లు ఖర్చుచేసి రాష్ట్రంలో అందాల పోటీలు నిర్వహించటం ఏమిటని ప్రశ్నించారు. చేనేత రుణాలు మాఫీచేస్తామని, నూలుపై సబ్సిడీ ఇస్తామని ప్రకటించి ఏడాది గడుస్తున్నా ఇప్పటికి అమలు కావడంలేదని అన్నారు. నూలుపై సబ్సిడీ వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేసి రుణ మాఫీ అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. 2024 ఆగస్టులో త్రిఫ్ట్ పథకం గడువు ముగిసినా ఇప్పటి వరకు త్రిఫ్ట్ పథకాన్ని పునరుద్ధరించలేదని తెలిపారు. జియో టాగ్ ఉన్న నేత కార్మికునితోపాటు ఇద్దరికి అనుబంధ కార్మికులకు కూడ త్రిఫ్ట్ పథకం వర్తింప చెయ్యాలని డిమాండ్ చేసారు. చేనేత వస్త్రాలు టెస్కో ద్వారా కొనుగోలు చేయడంతో పాటు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున అందోళన కార్యక్రమం చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, బడుగు శంకరయ్య, గుండు వెంకటనర్సు, గుర్రం నర్సింహా, సామలేటి రాజేందర్, చెన్న రాజేష్, చిదిరాల నారాయణ, పెంటయ్య, శేఖరయ్య, గజం శ్రీశైలం, గంజి రామచంద్రం పాల్గొన్నారు.

# తుంగతుర్తి కాంగ్రెస్‌లో ముదిరిన వర్గపోరు

- పరిశీలకుల ముందే.. ఇరు వర్గాల బాహాబాహీ..
- పాత తరం నాయకులను పట్టించుకోవడంలేదని ఎమ్మెల్యేపై ఆరోపణలు
- పార్టీ పెద్దలు పట్టించుకోకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో తీవ్ర నష్టం
- వర్గాలకు దూరంగా ఉన్న అద్దంకి దయాకర్



**తుంగతుర్తి మే 18 (జనం సాక్షి) :** తుంగతుర్తి నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీలో వర్గ పోరు రోజు రోజుకు తారాస్థాయికి చేరుకుంది. ఏకంగా పార్టీ పరిశీలకుల ముందే కార్యకర్తలు రెండు వర్గాలుగా విడిపోయి విమర్శలు ప్రతి విమర్శలతో బాహ బాహీకి దిగుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని మోత్కూర్ తిరుమలగిరి అర్వపల్లి మండలాల్లో వర్గ పోరు బహిర్గతమైంది. మరికొన్ని మండలాల్లో ఈ వర్గ పోరు మీ ఊరు గప్పిన నిప్పులా ఉంది. దీన్ని అరికట్టాల్సిన పార్టీ పెద్దలు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడంతో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రోజుకు ప్రజల్లో నమ్మకం కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. విడవబట్టే పాముకు కోపం కరవమంటే కప్పకు కోపం గా మారింది జిల్లా కాంగ్రెస్ నాయకుల పరిస్థితి ఉంది. నియోజకవర్గంలో నాలుగు దశాబ్దాలుగా ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ మంత్రి ఆర్ దామోదర్ రెడ్డి కి అనుచరుగను బలంగా ఉంది నియోజకవర్గం ఎస్సీగా మారడంతో మాజీ మంత్రి దామోదర్ రెడ్డి సూర్యాపేటకు వెళ్లారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం 2014. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అద్దంకి దయాకర్ ఇక్కడ పోటీ చేసి స్వల్ప మెజార్టీతో ఓడిపోయారు అప్పటినుండి బలమైన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకులు లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో అప్పుడు టిఆర్ఎస్ పార్టీ నుండి వచ్చిన మందుల సామేలుకు పార్టీ టికెట్ కేటాయించారు. గత 10 సంవత్సరాలు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ 2023 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఏకతాటి పైకి వచ్చి 53 వేల మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మందుల సామేలు ను గెలిపించారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం అనేక మంది టిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో పెద్ద ఎత్తున చేరారు. దీంతో ఎమ్మెల్యే టిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నాడని తాము గత కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేస్తున్న తమను గుర్తించడం లేదని పాత తరం కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల మార్కెట్ కమిటీ, దేవాలయ కమిటీ నామినేటెడ్ పదవులతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల కేటాయింపులు కూడా టిఆర్ఎస్ పార్టీ నుండి వచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నాడని పాతతరం కాంగ్రెస్ నాయకులను పట్టించుకోవడంలేదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో నియోజకవర్గంలోని పలు మండలాల్లో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశాలకు రాంరెడ్డి దామోదర్ రెడ్డి వర్గీయులు సభలకు అడ్డు తగులుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే రెండు వర్గాలుగా విడిపోయి రెండు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణలు చెలరేగుతున్నాయి. ముఖ్యంగా గత 40 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్న తమకు అన్యాయం జరుగుతుందని సీనియర్ కాంగ్రెస్ నేతలు స్థానిక శాసనసభ్యుని పై బహిరంగంగానే ధ్వజమెత్తుతున్నారు. తాజాగా తిరుమలగిరి. అరవపల్లి మండలాల్లో జరిగిన కాంగ్రెస్ సంస్థాగత సమావేశంలో పార్టీ పరిశీలకుల ముందు ఎమ్మెల్యే వైఖరిని నిరసిస్తూ తమ నిరసనను తెలియజేశారు. దీంతో ఎమ్మెల్యే సామేలు వర్గం కూడా ప్రతి విమర్శలకు దిగడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ సందర్భంగా ఇరువర్గాలు బాహాబాహీ కి దిగాయి. సీనియర్ల వర్గానికి నాయకత్వం ధరూరు యోగానంద చార్యులు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వహించగా ఎమ్మెల్యే వర్గం వారు సమావేశానికి వచ్చి రాగానే ఇరు వర్గాలు నినాదాలు చేసుకోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. సమావేశంలో ఫ్లెక్సీలో ఫోటోలు చిన్నవిగా వేశారని ఒక వర్గం వారు మరో వర్గం వారితో ఘర్షణ కు దిగినట్లు సమాచారం. సమావేశానికి ముఖ్య అతిథులుగా వచ్చిన మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్ మరో నాయకుడు శత్రు నాయక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్ ముందు ఎమ్మెల్యే తమను పట్టించుకోవడంలేదని టిఆర్ఎస్ నుండి వచ్చిన నాయకులకే ప్రాధాన్యత ఇస్తున్నాడని తమ గోడును విన్నవించారు. ఇంత జరుగుతున్న అధిష్టానం మాత్రం తుంగతుర్తి కాంగ్రెస్ లో జరుగుతున్న లొల్లిపై దృష్టి సారించినట్లు కనబడడం లేదు గతంలో 2014. 2018 సాధారణ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయిన అద్దంకి దయాకర్ ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు ఆయన కూడా నియోజకవర్గంలో ప్రత్యేకంగా అభిమానులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన అనంతరం నియోజకవర్గంలో పర్యటించాల్సి ఉన్న ఇక్కడ ఉన్న వర్గ భేదాలు ఆయనను కలవర పెడుతుండడంతో నియోజకవర్గం రాకపోవడమే మంచిదని అభిప్రాయంలో ఉన్నారు అయినప్పటికీ ఆయన అభిమానులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నియోజకవర్గానికి రావలసిందిగా విజ్ఞప్తులు చేస్తున్నారు..ఏది ఏమైనా నియోజకవర్గంలో ఎమ్మెల్యే వర్సెస్ సీనియర్లుగా రెండు వర్గాలుగా విడిపోయిన కాంగ్రెస్ పార్టీ ముందు ముందు ఏ విధమైన తీరులో పయనిస్తుందో అని కార్యకర్తలు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. జిల్లాలో పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్న జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్రెడ్డి. ఉత్తంకుమార్ రెడ్డి ఇరువర్గాలను సమన్వయం పరిచి పార్టీ అభివృద్ధి కోసం కృషిచేసేలా ఇద్దరినీ ఒప్పించాలని నియోజకవర్గం చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కోరుతున్నారు.

## ప్రజల ఆదరణను ఓర్వలేక తప్పుడు ఆరోపణలు



**చౌటుప్పల్, మే 18 (జనంసాక్షి) :** నియోజకవర్గ ప్రజలు నుంచి మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి వస్తున్న ఆదరణను చూసి కాంగ్రెస్ నాయకులు అసహనానికి లోనవుతున్నారని మండల పార్టీ బీఆర్ఎస్ అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్, సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మాజీ జెడ్పీటిసి పెద్దిటి బుచ్చిరెడ్డిలు అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి నియోజకవర్గంలో పర్యటించగా ప్రజల నుండి వచ్చిన విశేష స్పందనతో రాజకీయంగా తట్టుకోలేక కాంగ్రెస్ నాయకులు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు.షాడో ఎమ్మెల్యేలుగా మారి చౌటుప్పల్ మండలాన్ని అతలాకుతలం చేస్తూ అభివృద్ధిని అడ్డుకుంటూ వ్యవస్థను నిర్వీర్యం చేశారని కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శించారు. కంపెనీలలో అధికారంతో అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని పేర్కొన్నారు.కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని రోడ్డుమీద తిరగనీయబోమని కాంగ్రెస్ నేతలు అనడం వారి నిరంకుశ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి నిజమైన ప్రజానాయకుడని, మళ్ళీ మునుగోడు గడ్డమీద కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలవబోతున్నారని, దమ్ముంటే మళ్ళీ మీకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాజగోపాల్ రెడ్డి నేను నిలబెట్టాలి అని వాళ్ళు సవాల్ విసిరారు. కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సబ్ కోర్టును చౌటుప్పల్‌కు మంజూరు చేయిస్తే మళ్లీ వచ్చిన స్పెషల్ కోర్టు కూడా ఈరోజు మీ కాంగ్రెస్ పార్టీ పాలనలో రామన్నపేటలకు బదిలీ అయిందని వారు పేర్కొన్నారు. అక్రమ కేసులు బనాయిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ ప్రజాస్వామ్యత విధానాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి , ఉడుగు మల్లేష్, తోర్పునూరి నరసింహ , అల్మాసిపేట కృష్ణ ,చిన్నం బాలరాజు,గుండెబోయిన వెంకటేష్ యాదవ్,తాడూరి శిరీష పరమేష్ , కొత్త పర్వతాలు గారు,పెద్దిటి చంద్రారెడ్డి,ఢిల్లీ మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబానికి మరోసారి అండగా నిలిచిన కేసీఆర్



**హైదరాబాద్, మే 18 (జనంసాక్షి) :** రాష్ట్ర సాధన కోసం ప్రాణార్పణ చేసిన అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి అండగా నిలిచారు. కిష్టయ్య కూతురు వైద్య విద్య కోసం ఆర్థిక సాయం అందజేశారు కేసీఆర్. ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ఉద్యమ అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబానికి తన సహాయాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు కేసీఆర్. ఆదివారం నాడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవెల్లి నివాసంలో అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో తన ప్రాణాలను బలిదానం చేసిన కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబాన్ని అన్నీ తానై కేసీఆర్ ఆదుకుంటున్న విషయం తెలిసిందే. కిష్టయ్య కుమార్తె ప్రియాంక చదువుకు కేసీఆర్ ఆర్థిక సాయం అందిస్తున్నారు. వైద్య విద్యలో ఆసక్తి కనబరిచిన ప్రియాంకను ఇప్పటికే కేసీఆర్ ఎంబీబీఎస్ చదివించారు. ఎంబీబీఎస్ పూర్తిచేసుకుని పీజీ చేస్తున్న డా. ప్రియాంక చదువుకు కావలసిన ఆర్థిక సాయాన్ని నేడు కేసీఆర్.. కిష్టయ్య భార్య, పిల్లలకు అందించారు. కాగా, అమరుడు కిష్టయ్య కుమారుడు రాహుల్ వివాహం నిశ్చయమైన విషయాన్ని ఈ సందర్భంగా తెలుసుకున్న కేసీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. కిష్టయ్య కుటుంబానికి తన సంపూర్ణ సహకారం ఎప్పటికీ కొనసాగుతుందని భరోసా ఇచ్చారు.

## పెండ్లి ఇంట విషాదం..

- వరుడిని తీసుకొచ్చేందుకు వెళ్లిన వ్యాన్ బోల్తా
- నలుగురి పరిస్థితి విషమం



**ఆదిలాబాద్, మే 18 (జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లాలో పెండ్లింట విషాదం నెలకొంది. పెండ్లి కొడుకుని వధువు ఇంటికి తీసుకొస్తుండగా జరిగిన ప్రమాదంలో 30 మంది గాయపడ్డారు. వారిలో నలుగురి పిరస్థితి విషమంగా ఉన్నది. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం నేరడిగొండ (జీ)లో ఈ ఘటన చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరడిగొండ(జీ)కి చెందిన యువతికి జైనూర్ మండలం బూసిమెట్ట గ్రామ యువకుడితో పెండ్లి నిశ్చయమైంది. ఈ నెల 22న (గురువారం) వివాహం జరగాల్సి ఉంది. ఈ క్రమంలో శనివారం ఉదయం వరుడిని వధువు ఇంటికి తీసుకొచ్చేందుకు నేరడిగొండ(జి)కి చెందిన 30 మంది మినీ వ్యాన్‌లో బయలుదేరారు. పెండ్లి కొడుకుని తిసుకుని రాత్రి తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో రాత్రి 11.15 గంటల సమయంలో వ్యానును డ్రైవర్ అతివేగంగా నడపడంతో గ్రామానికి కిలోమీటరు దూరంలో మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో అందులో ఉన్న 30 మంది గాయపడ్డారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. తీవ్రంగా గాయపడిన వారిలో నేరడిగొండ(జీ)కి చెందిన కుమ్ర ఈశ్వర్, గంగా ప్రసాద్ ఉన్నారు. క్షతగాత్రులను ఐదు 108 వాహనాల్లో ఆదిలాబాద్ రిమ్స్ దవాఖానకు తరలించారు. స్వల్ప గాయాలతో వరుడు ప్రమాదం నుంచి బయటపడ్డాడు.

## ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో అర్హులకు అన్యాయం

- పూరి గుడిసెలో ఉన్నోళ్ళకి ఇండ్లు రాలే
- భూముకున్నోళ్ళకే ఇండ్ల కేటాయింపు
- మేము మొదటినుండి కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నాం
- ఓ స్థానిక నాయకుడు అర్హుల పేర్లు తొలగించడంటూ గ్రామస్తుల ఆరోపణలు



**గుర్రంపోడు, మే 18 (జనంసాక్షి) :** గుర్రంపోడు మండలం తెరాటి గూడెంలో అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించి అర్హులకు అన్యాయం చేశారని గ్రామస్తులు ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు ఎమ్మెల్యే పేరు చెప్పుకుంటూ తన ఇష్టారీతిన వ్యవహరించి అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లను కేటాయించారని వారు ఆరోపించారు.గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తా అని ఇయ్యలేదని, ఈ ప్రభుతవలోనైన తమకు న్యాయం జరుగుతుందనుకుంటే,ఓ స్వార్థ పూరిత నాయకుడి వల్ల ఇండ్ల లిస్టులో తమ పేర్లు లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కూడా నామ మాత్రంగా విచారణ చేసి వెళ్లిపోయారని,ఎవరు అర్హులో కాదో మరోసారి గ్రామంలో విచారణ చేపట్టాలని వారన్నారు. ప్రస్తుతం లిస్టులో పేరున్న వారిలో 50 శాతం కూడా ఇండ్లు కట్టుకునే వారు లేరని, రాజకీయ దురుద్దేశంతోనే అర్హుల పేర్లు జాబితాలో లేకుండా చేశారని ఆందోళన వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి స్పందించి అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా చూడాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పేద ప్రజలకు అందని ఇందిరమ్మ ఇండ్లు

- ప్రజా ప్రభుత్వ పథకాలు పక్కదారి
- ప్రభుత్వ లక్ష్యాలకు దూరంగా ఇందిరమ్మ ఇండ్ల జాబితా..?
- పూర్తిగా రాజకీయ కోణంలోనే ఇందిరమ్మ ఇండ్ల జాబితా
- ఎమ్మెల్యే ఆదేశాలు పక్కకు
- సొంత ఏజెండాతో స్థానిక నాయకులు
- జాబితాను రహస్యంగా ఉంచిన అధికారి
- మండల వ్యాప్తంగా చర్చ



**మర్రిగూడ, మే 18 (జనం సాక్షి) :** ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు... అసలైన నిరుపేదలకు అందకుండా ప్రభుత్వ లక్ష్యాలకు దూరంగా పూర్తిగా రాజకీయ కోణంలోనే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది,మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మర్రిగూడ మండల నాయకులకు పలు సూచనలు చేశారు, మొదట విడత ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పూర్తిగా ఇల్లులేని నిరుపేదలు, వితంతువులు, వికలాంగులకు మొదటి విడత లోనే అవకాశం ఇవ్వాలని నాయకులకు సూచన చేశారు, కానీ మర్రిగూడ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో పూర్తిగా రాజకీయ కోణంలోనే లబ్ధిదారుల ఎంపిక జరిగింది, ప్రభుత్వం పథకాలకు అర్హులైన నిజమైన లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం జరిగింది, ప్రజా ప్రభుత్వంలో తమ సొంతింటి కల నెరవేరుతుంది అనుకున్న ప్రతి ఒక్క పేదవాడికి మర్రిగూడ మండల నాయకుల వల్ల బంగపాటు తప్పలేదు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులను కూడా తమకు అనుకూలమైన వారి పేర్లను మాత్రమే కమిటీలో రాయడం జరిగింది, ఇటీవల ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లిస్టు ప్రకటించడం జరిగింది, అధికారులు నామమాత్రంగా సర్వే నిర్వహించి ఆమోద ముద్ర వేశారు, ఇటీవల జాబితాలో పేర్లు వచ్చిన లబ్ధిదారులను కూడా మార్చినట్లు సమాచారం, మండల అధికారి కూడా ఇందిరమ్మ ఇండ్ల జాబితాను రహస్యంగా ఉంచడం వెనుక మండల వ్యాప్తంగా తీవ్రంగా చర్చ జరుగుతుంది, ఏదేమైనా గ్రామాల్లో ప్రజలకు అధికార పార్టీ నాయకుల తీరుపై తీవ్ర అసహనంతో ప్రజలు ఉన్నారు.

## కంటి క్యాన్సర్‌పై అవగాహనే లక్ష్యంగా 'వైట్ థాన్' రన్

- బాధితుల చికిత్సకు విరాళాల సేకరణ కూడా..
- ఎంతో ఉత్సాహంగా సాగిన ఈ రన్లో 1500 మందికి పైగా హాజరు




**హైదరాబాద్, మే 18 (జనంసాక్షి) :** పిల్లలకు వచ్చే కంటి క్యాన్సర్పై అవగాహన, చికిత్సకు విరాళాల నిమిత్తం ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో రాయదుర్గంలోని టీ-వర్క్స్ వద్ద తలపెట్టిన 'వైట్థాన్' 10కే రన్ ను రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల డైరెక్టర్ జనరల్ వై నాగిరెడ్డి ప్రారంభించారు. ఎల్వీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఇది ఏడవ రన్. ఈ కార్యక్రమం ప్రపంచ రెటినోబ్లాస్టోమా (కళ్ల క్యాన్సర్) అవగాహన వారం ఈ సంవత్సరం మే 11నుంచి 17 వరకు జరిగింది. ప్రజలు ఈ 10కే రన్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల డైరెక్టర్ జనరల్ వై నాగిరెడ్డి మాట్లాడుతూ ఈ వైట్థాన్ ద్వారా తెలుసుకున్న సమాచారాన్ని మన పరిధిలో ఉన్న వారితో పంచుకోవాలన్నారు. తద్వారా చిన్న పిల్లల్లో వచ్చే ఈ క్యాన్సర్ను ముందుగా గుర్తించేందుకు సహాయపడవచ్చన్నారు. ఎంతో మంది చూపును, ప్రాణాలను రక్షించవచ్చన్నారు. ఈ వ్యాధిని పిల్లల్లో గుర్తించేందుకు తల్లిదండ్రులు ఒక ప్రయత్నం చేయాలన్నారు. ఫొటోలు తీసేటప్పుడు ఫ్లాష్తో తీయాలన్నారు. అలా తీసినప్పుడు కళ్లలో ఏదైనా తెల్లగా కనిపిస్తే, అది రెటినోబ్లాస్టోమా సూచన కావచ్చన్నారు. అప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా కల్లం అంజిరెడ్డి క్యాంపస్ (హైదరాబాద్) ఓక్యులర్ ఆంకాలజిస్ట్ డాక్టర్ స్వాతి కలికి మాట్లాడుతూ కంటి క్యాన్సర్ లక్షణాలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న పిల్లల తల్లిదండ్రులు దీని గురించి తెలుసుకోవాలన్నారు. పిల్లల కళ్ళలో తెల్లటి ప్రతిబింబం కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. దీనిని ముందుగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. తక్షణ చికిత్స వల్ల పిల్లల ప్రాణాన్ని, కంటి చూపును కాపాడవచ్చన్నారు. ఈ వైట్థాన్ ద్వారా వచ్చే విరాళాలను కంటి క్యాన్సర్తో బాధపడుతున్న పేద పిల్లలకు ఉచితంగా చికిత్స చేయడానికీ, భవిష్యత్తులో జరగబోయే పరిశోధనలకు ఉపయోగించనున్నామని చెప్పారు.




# బీమాతో ధీమా ఎంత?

- 80 శాతం మందిలో ఆందోళన



**ముంబయి:** వైద్య ఖర్చులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో తాము తీసుకున్న ఆరోగ్య బీమా పాలసీ విలువ సరిపోతుందా? లేదా? అనే ఆందోళన దాదాపు 80 శాతం మంది పాలసీదారుల్లో ఉంటోంది. అనుకోని పరిస్థితుల్లో ఆసుపత్రిలో చేరితే.. అనూహ్య బిల్లుల కారణంగా తమ ఇన్సూరెన్స్ కవరేజీ సరిపోదని భావిస్తున్నట్లు ఫ్యూచర్ జనరలీ ఇండియా ఇన్సూరెన్స్ 'హెల్త్ అన్‌లిమిటెడ్' పేరిట నిర్వహించిన సర్వేలో తేలింది. దాదాపు 90 శాతం మంది పాలసీదారులు పాలసీ మొత్తం వాడుకున్న అనంతరం తిరిగి భర్తీ(రీఛార్జ్) ఎంతో ప్రయోజనకరమని భావిస్తున్నారు. సమగ్ర ఆరోగ్య పరిష్కారాల అవసరాన్ని ఇది సూచిస్తోందని ఫ్యూచర్ జనరలీ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ఎండీ, సీఈఓ అనూప్ రావ్ తెలిపారు. వైద్య చికిత్స ఖర్చులు పెరుగుతూ ఉండటంతో ఆరోగ్య బీమా ఉన్న వారికీ ఆందోళన అధికమవుతోందని అన్నారు. 25 ఏళ్ల వయసు పైబడ్డ 800 మందితో ఈ సర్వే నిర్వహించింది. 2021లో భారత్‌లో వైద్య ద్రవ్యోల్బణం చైనా, వియత్నాం, ఇండోనేషియాలతో పోలిస్తే దాదాపు 14 శాతం ఎక్కువగా ఉందని పేర్కొంది.

# క్రెడిట్ స్కోరు పెంచండిలా..

**ఆర్థిక వ్యవహారాల గురించి అవగాహన ఉన్న వారికి క్రెడిట్ స్కోరు ప్రాముఖ్యత గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.కొంతమంది మాత్రం దీన్ని పెద్దగా పట్టించుకోరు. దీని అవసరం ఏముంటుందిలే అని లైట్ తీసుకుంటూ ఉంటారు. వాస్తవానికి మన జీవితంలో ఏదో దశలో 'క్రెడిట్ స్కోరు' అవసరం ఏర్పడే తీరుతుంది. అప్పుడు నిట్టూర్చే బదులు ఇప్పటి నుంచే మంచి క్రెడిట్ స్కోరు నిర్మించుకోవ డంపై దృష్టి సారించడం మేలు. అలాంటి కొన్ని సందర్భాలు ఇప్పుడు చూద్దాం..**




- **క్రెడిట్ కార్డు**

ఉద్యోగంలో చేరిన తొలినాళ్లలో క్రెడిట్ కార్డుతో పెద్దగా పని ఉండదు. కానీ, రోజులు గడుస్తున్న కొద్దీ, వివాహం అయ్యాక దీని అవసరం ఏర్పడుతుంది. అప్పుడు మీరు దరఖాస్తు చేసినా బ్యాంకులు చూసేది క్రెడిట్ స్కోరునే. ఒకవేళ అప్పటి వరకు మీకు క్రెడిట్ హిస్టరీ లేకపోతే మీరు పనిచేస్తున్న కంపెనీ, వేతనం వంటివి పరిగణనలోకి తీసుకుంటాయి. లేదంటే మీరు చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై 75 నుంచి 100 శాతం విలువతో క్రెడిట్ కార్డును జారీ చేస్తాయి. ఆపై మంచి క్రెడిట్ హిస్టరీని నిర్మించడానికి ఈ క్రెడిట్ కార్డును ఉపయోగించొచ్చు.

- **వ్యక్తిగత రుణం**

పెద్ద మొత్తంలో సొమ్ము అవసరం అయినప్పుడు చాలా మంది చేసే పని పర్సనల్ లోన్ తీసుకోవడం. అలాంటి సందర్భాల్లోనూ బ్యాంకులు చూసేది క్రెడిట్ స్కోరునే. ఒకవేళ మీకు అసలు రుణ చరిత్ర లేకుంటే లోన్ మంజూరు ఆలస్యం కావొచ్చు. పైగా అధిక వడ్డీ పడుతుంది. ఒకవేళ మీ క్రెడిట్ హిస్టరీ బాగుంటే సులువుగా, తక్కువ వడ్డీకే రుణాలు పొందొచ్చు. మెరుగైన క్రెడిట్ స్కోరు కలిగిన వారికి ప్రీఅప్రూవ్డ్ రుణాలు కూడా జారీ చేస్తాయి. సెకన్లలో ఈ మొత్తాన్ని మీ ఖాతాలో పొందొచ్చు.

- **హోమ్‌లోన్**

మన జీవితంలో తీసుకునే పెద్ద నిర్ణయాల్లో ఒకటి సొంతింటి కొనుగోలు. యుక్త వయసులోనో, నడి వయసులోనో సొంతింటి కల నెరవేర్చుకునేందుకు మనలో చాలామంది ఆరాటపడుతుంటారు. గృహ కొనుగోలుకు గృహ కొనుగోలుకు పెద్ద మొత్తంలో రుణం పొందాలన్నా క్రెడిట్ స్కోరు చాలా ముఖ్యం. మంచి క్రెడిట్ స్కోరు ఉంటే తక్కువ వడ్డీకి రుణం పొందొచ్చు. దీర్ఘకాలంలో పెద్ద మొత్తంలో ఆదా చేయొచ్చు.





- **కారు**

ఈ రోజుల్లో కారు కొనుగోలు కూడా సాధారణంగా మారిపోయింది. ఒకవేళ మీరు పెద్ద మొత్తం వెచ్చించి కారు కొనాలన్నా ఆటో లోన్ అవసరం అవుతుంది. అప్పుడు కూడా క్రెడిట్ స్కోరు ప్రస్తావనకు వస్తుంది.

రేపు మీరు పెద్దయ్యాక మీ పిల్లల చదువుల కోసం విద్యా రుణం కోసం దరఖాస్తు చేసినప్పుడు కూడా మీ క్రెడిట్ స్కోరును తనిఖీ చేస్తారు. అంటే జీవితంలో ఏదో ఒక దశలో 'మీ క్రెడిట్ స్కోరు ఎంత?' అన్న ప్రశ్న ఎదురుకాక మానదు. కాబట్టి మన జీవితంలో విస్మరించలేని, విస్మరించకూడని పదం క్రెడిట్ స్కోరు! అందుకే ఇప్పటి నుంచే మంచి క్రెడిట్ స్కోర్‌పై దృష్టి పెట్టండి.

- **మంచి క్రెడిట్ స్కోరు కోసం..**

బిల్లులు, ఈఎంఐలు సకాలంలో చెల్లించండి.
క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో 30 శాతం మించకుండా చూసుకోండి.క్రెడిట్‌కార్డు, పర్సనల్‌లోన్, హోమ్‌లోన్ ఇలా క్రెడిట్ మిక్స్ ఉండేలా చూసుకోండి.తరచూ రుణాల కోసం దరఖాస్తు చేయొద్దు.ఎప్పటికప్పుడు క్రెడిట్ స్కోరును తనిఖీ చేసుకుని తప్పులుంటే సరిదిద్దుకోవాలి.




# దివీస్‌కు లాభం పైపైకి..

హైదరాబాద్: దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ కన్సాలిడేటెడ్ ఖాతాల ప్రకారం గత ఆర్థిక సంవత్సరం(2024-25) నాలుగో త్రైమాసికానికి రూ.2,671 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.662 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో మొత్తం ఆదాయం రూ.2,382 కోట్లు, నికరలాభం రూ.538 కోట్లుగా ఉన్నాయి. దీంతో పోలిస్తే ప్రస్తుత నాలుగో త్రైమాసికంలో మెరుగైన ఆదాయాలు నమోదు చేసినట్లు అవుతోంది. గత ఆర్థిక సంవత్సరం పూర్తికాలానికి దివీస్ లేబొరేటరీస్ రూ.9,712 కోట్ల ఆదాయాన్ని, రూ.2,191 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.8,184 కోట్లు, లాభం రూ.1,600 కోట్లుగా ఉన్నాయి.కాకినాడ యూనిట్లో కార్యకలాపాలు: ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వద్ద యూనిట్-3 నిర్మాణం పూర్తయినట్లు, ఈ యూనిట్లో వాణిజ్య ప్రాతిపదికన ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభమైనట్లు కంపెనీ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరంలో మూలధన సమీకరణ వల్ల రూ.1,118 కోట్ల విలువైన ఆస్తులను సృష్టించినట్లు, ఇందులో కాకినాడ యూనిట్-3 వాటా రూ.755 కోట్లు ఉన్నట్లు పేర్కొంది. వాటాదార్లకు రూ.2 ముఖ విలువ కల ఒక్కో షేరుకు రూ.30 చొప్పున డివిడెండ్ చెల్లించాలని కంపెనీ




యాజమాన్యం ప్రతిపాదించింది. దీనికి ఈ ఏడాది జులై 25వ తేదీని రికార్డు తేదీగా నిర్ణయించారు. ఆగస్టు 11న జరిగే ఏజీఎంలో వాటాదార్ల అనుమతి అనంతరం డివిడెండ్ చెల్లిస్తారు.

## షిప్‌రాకెట్ నుంచి దేశంలోనే తొలి ఏఐ ఆధారిత ఎంసీపీ సర్వర్

న్యూఢిల్లీ: ఇ-కామర్స్ సేవల ప్లాట్‌ఫామ్ షిప్‌రాకెట్ దేశంలోనే మొట్టమొదటి కృత్రిమ మేధ (ఏఐ) అనుసంధానిత మోడల్ కాంటెక్స్ట్ ప్రొటోకాల్ సర్వర్ (ఎంసీపీ)ని ఆవిష్కరించింది. ఒక్క చిన్న ఆదేశం ద్వారా షిప్పింగ్ ధరల దగ్గర నుంచి ఆర్డర్లను ట్రాక్ చేయడం వరకు పలు కీలక కార్యకలాపాలను ఏఐ ఏజెంట్లు నిర్వహించేందుకు ఈ సర్వర్ ఉపయోగపడుతుందని కంపెనీ తెలిపింది. డీ2సీ (డైరెక్ట్ టు కన్స్యూమర్) బ్రాండ్లు,




ఎంఎస్ఎమ్ఈలను దృష్టిలో ఉంచుకొని ఈ ఆవిష్కరణను చేపట్టినట్లు షిప్‌రాకెట్ ఎండీ, సీఈఓ సాహిల్ గోయల్ తెలిపారు.

## వాతావరణ సాంకేతిక అంకురాలకు సహకారం

### జీఈఏపీపీతో డీపీఐఐటీ జట్టు

న్యూఢిల్లీ:నిధుల లభ్యత, మార్గదర్శకత్వం విషయంలో వాతా వరణ సాంకేతిక అంకురాలకు సహకారం అందించే నిమిత్తం గ్లోబల్ ఎనర్జీ అలయన్స్ ఫర్ పీపుల్



అండ్ ప్లానెట్ (జీఈఏపీపీ)తో ఒ ప్పందం కుదుర్చుకున్నట్లు పరిశ్రమ ప్రోత్సాహం, అం తర్గత వాణిజ్య విభాగం (డీపీఐఐ టీ) తెలిపింది.ఈ ఒప్పందంలో భాగంగా ఎనర్జీ ట్రాన్సిషన్స్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ (ఎన్‌టీఐసీఈ) పేరుతో ఒక పోటీ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించనున్నట్లు పేర్కొంది. హై-ఇంప్యాక్ట్ సొల్యూషన్లకు దీని ద్వారా 5,00,000 డాలర్ల వరకు రివార్డు రూపంలో ఇవ్వనున్నట్లు వెల్లడించింది. అలాగే స్పెక్ట్రమ్ ఇంప్యాక్ట్, అవానా కేపిటల్ లాంటి భాగ స్వామ్య సంస్థల ద్వారా పెట్టుబడుల సహకారాన్ని కూడా అందివ్వనున్నట్లు డీపీఐఐటీ వివరించింది. స్వచ్ఛ ఇంధన అంకురాలకు ఈ ఒప్పందం అపార అవకాశాలను సృష్టి స్తుందని, దేశం శూన్య ఉద్గార లక్ష్యాన్ని సాధించేం దుకూ ఇది దోహదం చేస్తుందని డీపీఐఐటీ సంయుక్త కార్యదర్శి సంజీవ్ తెలిపారు.



# మస్క్‌పై వలపు వల?

## ఉక్రెయిన్‌పై యుద్ధ సమయంలో రహస్యాలను తెలుసుకునేందుకు పుతిన్ కుట్ర?

వాషింగ్టన్: సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధంపై పలు సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. యుద్ధం ప్రారంభంలో రహస్యాల్ని తెలుసుకునేందుకు అపర కుబేరుడు ఎలాన్ మస్క్‌పై రష్యా యువతితో వలపు వల విసిరినట్లు మాజీ ఎఫ్‌బీఐ కౌంటర్ ఇంటెలిజెన్స్ స్పెషల్ ఏజెంట్ జోనాథన్ బౌమా సంచలన వ్యాఖ్యలు చేశారు.జర్మన్ బ్రాడ్‌కాస్టర్ జెడ్‌డీఎఫ్ తీసిన డాక్యుమెంటరీలో జోనాథ్ బౌమా మాట్లాడారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ యుద్ధానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని సేకరించేందుకు ప్రయత్నించారు. ఇందులో భాగంగా రష్యా ఇంటెలిజెన్స్ సాయంతో ఎలాన్ మస్క్, పేపాల్ సహ వ్యవస్థాపకుడు పీటర్ థీల్‌పై ఓ యువతి ప్రయోగించారు. మస్క్‌కు ఉన్న జూదం,మత్తు పదార్థాల వినియోగంలాంటి వీక్నెస్‌ను అడ్డం పెట్టుకుని యుద్ధం సమాచారం సేకరించే ప్రయత్నం చేసినట్లు వెల్లడించారు.ఇక మస్క్, పీటర్ థీల్‌పై జరిగిన ఈ సీక్రెట్ ఆపరేషన్ పుతిన్ కనుసన్నల్లోనే జరిగింది. పుతిన్ అనుమతి లేకుండా స్పై చేయరు కదా? అని జోనాథన్ బౌమా అన్నారు. అయితే, రష్యా జరిపిన సీక్రెట్ ఆపరేషన్‌లో మస్క్, పీటర్ థీల్ చిక్కుకున్నారా? లేదా? అనే విషయాల్ని వెల్లడించేందుకు జోనాథన్ బౌమా విముఖత వ్యక్తం చేశారు.కాగా, ఎఫ్‌బీఐలో 16 ఏళ్లు పని చేసిన జోనాథ్ బౌమా ఓ మీడియా సంస్థకు రహస్య సమాచారాన్ని అందించారు. దీంతో అమెరికా ప్రభుత్వం జోనాథ్ బౌమాను అరెస్ట్ చేసింది. చివరకు లక్షడాలర్ల పూచికత్తుతో బెయిల్‌పై విడుదలయ్యారు.



# బ్రాండ్ ఔషధాల మాటున కల్తీ దందా




**హైదరాబాద్:** నగర మార్కెట్లో నకిలీ మందులు హల్‌చల్ చేస్తున్నాయి. వీటిని ఉత్తరాదిలోని కాశీపూర్(ఉత్తరాఖండ్), ఘజియాబాద్, ప్రయాగ్‌రాజ్(యూపీ) తదితర ప్రాంతాల్లోనే కాకుండా నగరం కేంద్రంగా తయారు చేస్తున్నట్లు అధికారుల సోదాల్లో తేలింది. గతంలో మూసాపేట, ఎల్‌బీనగర్, మలక్‌పేట్, దూలపల్లి, కర్మన్‌ఘాట్, సుల్తాన్‌బజార్, ముసారంబాగ్ తదితర ప్రాంతాల్లోని ఔషధ దుకాణాల్లో నకిలీ మందులను డీసీఏ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా డ్రగ్స్ రూల్స్ లేబిలింగ్ చట్టంలోని షెడ్యూల్ హెచ్2 కిందకు వచ్చే టాప్ 300 ఫార్ములా బ్రాండ్స్‌ను కల్తీ చేసి మార్కెట్లోకి తరలిస్తున్నారు.ఎక్కువ మంది కొనుగోలు చేసే ఖరీదైన మందులను కల్తీ చేస్తున్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది. చాక్‌పీస్ పొడి, మొక్కజొన్న, బంగాళదుంప పిండితో తయారు చేసి బ్రాండెడ్ తరహాలో ప్యాకింగ్‌చేసి దుకాణాలకు వేస్తారు. మరికొందరు ఒక గోలీలో నిర్ణీత మొత్తం కంటే తక్కువ ఔషధం పెట్టి విక్రయిస్తారు. దీంతో రోగుల శరీరానికి సరిపడా ఔషధం అందక రోగం తగ్గకపోగా...వ్యాధి ఇంకా ముదిరిపోతుంది. ఇంకొన్నిసార్లు ప్రమాదకరమైన రసాయనాలతో తయారు చేసి గోలీలు, ఇంజక్షన్లలో నింపుతున్నారు. వీటిని వాడటం ద్వారా రోగి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రముఖ బ్రాండ్ల మందుల అమ్మకాల్లో ఎక్కువగా క్యాన్సర్, అధిక కొలెస్ట్రాల్, హైపర్‌టెన్షన్, మధుమేహం, నొప్పి నివారణ, యాంటీ అల్సర్లు, యాంటీబయోటిక్స్, థైరాయిడ్ తదితర రోగాలకు సంబంధించినవే ఎక్కువ ఉంటాయని చెబుతున్నారు. నిబంధనల ప్రకారం ఎక్కువగా అమ్ముడయ్యే టాప్ బ్రాండ్ మందులపై విధిగా క్యూఆర్ కోడ్, బార్‌కోడ్ ఉంటాయి. వాటిని విక్రయించే సమయంలో స్కాన్ చేస్తే...అసలుదా.. నకిలీదా అన్నది తేలిపోతుంది. ఏమాత్రం అనుమానం వచ్చినా కొనుగోలు దారులు చెక్ చేసుకోవాలి. వాటిని స్కాన్ చేశాక యూనిక్ ప్రొడెక్ట్ వివరాలు ప్రత్యక్షమవుతాయి. అసలైనదా లేదా కూడా తెలుస్తుంది. సదరు ఔషధ ప్యాకింగ్‌పై బార్‌కోడ్, క్యూఆర్ కోడ్ లేకపో యినా.. వాటిని స్కాన్ చేసిన తర్వాత వివరాలు కనిపించకపోయినా.. నకిలీ కిందే గుర్తించాలని అధికారులు చెబుతున్నారు.

## కాల్పుల విరమణకు అరబ్ లీగ్ దేశాల ఒత్తిడి

**జెరూసలెం:** ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో సమావేశమైన అరబ్ లీగ్ దేశాలు హమాస్-ఇజ్రాయెల్ తక్షణం కాల్పుల విరమణ పాటించాలని డిమాండ్ చేశాయి. గాజా పునర్నిర్మాణ కార్యక్రమంలో తాము పాలుపంచుకుంటామని తెలిపాయి.ఈ సమావేశానికి ఖతార్ అధ్యక్షుడు తమిమ్ బిన్ హమద్ అల్ థానీ, ఈజిప్ట అధ్యక్షుడు అబ్దల్ ఫతా అల్-సీసీతో పాటు పలు అరబ్ దేశాల నేతల పాల్గొన్నారు. ప్రత్యేక అతిథులుగా స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్, ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ పాల్గొన్నారు.

## కాల్పుల విరమణకు ముగింపు తేది లేదు



కొనసాగుతాయని పేర్కొన్నాయి. 10వ తేదీ డీజీఎంవో చర్చల్లో నిర్ణయానికి కాలపరిమితి లేదని వివరించాయి. ఆదివారం ఎలాంటి డీజీఎంవో స్థాయి చర్చలు లేవని తెలిపాయి. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన ప్రతీకార దాడులతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరయ్యింది. ఎదురు దాడులు చేసేందుకు దాయాది దేశం యత్నించినప్పటికీ.. భారత బలగాల దెబ్బకు తోకముడిచింది. చివరకు ఉద్రిక్తతలు తగ్గించాలని పాక్ కోరడంతో అందుకు భారత్ అంగీకరించగా.. కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. వీటికి సంబంధించి మే 10న ఇరు దేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ స్థా యిలో చేసుకున్న తాత్కాలిక కాల్పుల విరమణ అవగాహనను కొనసాగించేందుకు మొగ్గు చూపినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

# పైలట్ లేకుండా గాల్లో విమానం..




గాల్లో విమానం.. 200 మందికి పైగా ప్రయాణికులు.. కానీ పైలట్ లేడు.. పరిస్థితి తలుచుకుంటేనే గుండె జలదరిస్తోంది కదా.. బలహీనమైనవారైతే పై ప్రాణాలు పైనే పోతాయి! స్పెయిన్ కు వెళ్తున్న ఓ విమానంలో ఇలాగే జరిగింది. ఆ ఫ్లైట్‌లో ప్రయాణిస్తున్న వారంతా కొన్ని నిమిషాలపాటు వణికిపోయారు. తర్వాత ఏం జరిగిందీ.. ప్రయాణికులు ఎలా బయటపడ్డారన్నదీ.. ఏడాది క్రితం జరిగిన ఈ సంఘటన గురించి జర్మనీ వార్తా సంస్థ డీపీఏ తాజాగా తెలిపింది.గత ఏడాది స్పెయిన్ కు వెళ్తున్న లుఫ్తాన్సా విమానం కో పైలట్ స్పృహ తప్పి పడిపోయినా 10 నిమిషాల పాటు అలాగే ప్రయాణించిందని డీపీఏ వెల్లడించింది. 2024 ఫిబ్రవరి 17న ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి స్పెయిన్‌లోని సెవిల్లెకు ఎయిర్‌బస్ ఏ321 విమానం బయలుదేరింది. ఫ్లైట్ కెప్టెన్ రెస్ట్ రూమ్‌కు వెళ్లిన సమయంలో కాక్‌పిట్‌లో ఒక్కడే ఉన్న కో పైలట్ స్పృహ తప్పి పడిపోయాడని స్పానిష్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ అథారిటీ సీఐఏఐఏసీ నివేదికను ఉటంకిస్తూ డీపీఏ వివరించింది.అలా 199 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందితో వెళ్తున్న ఈ విమానం పైలట్ లేకుండానే 10 నిమిషాల పాటు ఎగిరింది.దర్యాప్తు నివేదిక గురించి తమకు తెలుసని, తమ సొంత ఫ్లైట్ సేఫ్టీ విభాగం కూడా దర్యాప్తు జరిపిందని లుఫ్తాన్సా డీపీఏకు తెలిపింది. అయితే దర్యాప్తు ఫలితాలను మాత్రం కంపెనీ వెల్లడించలేదని డీపీఏ తెలిపింది.అపస్మారక స్థితిలో ఉన్న కో-పైలట్ అనుకోకుండా నియంత్రణలను ఆపరేట్ చేసినప్పటికీ చురుకైన ఆటోపైలట్ కారణంగా విమానం కుదుపులు లేకుండా గాల్లో స్థిరంగా ఎగరగలిగింది. ఈ సమయంలో వాయిస్ రికార్డర్ కాక్ పిట్ లో వింత శబ్దాలను రికార్డ్ చేసిందని, అవి తీవ్రమైన ఆరోగ్య అత్యవసర పరిస్థితికి అనుగుణంగా ఉన్నాయని డీపీఏ నివేదించింది.ఫ్లైట్ కెప్టెన్ రెస్ట్ రూం నుంచి వచ్చి కాక్‌పిట్‌లోకి ప్రవేశించేందుకు రెగ్యులర్ డోర్ ఓపెనింగ్ కోడ్ ను ఎంటర్ చేయడానికి ప్రయత్నించాడు. ఇది కాక్ పిట్ లో బజర్ ను ప్రేరేపిస్తుంది. దీంతో కో-పైలట్ డోర్ తెరుస్తారు. కానీ లోపల ఉన్న కో పైలట్ నుంచి స్పందన లేదు. ఇలా అయిదు సార్లు ప్రయత్నించినా ఫలితం లేదు. క్రూ సిబ్బంది ఒకరు ఆన్‌బోర్డ్ టెలిఫోన్ ద్వారా కో పైలట్‌ను సంప్రదించడానికి ప్రయత్నించారు.అయినా కో పైలట్ స్పందించలేదు. దీంతో చేసేదేమీ లేక కెప్టెన్ చివరి ఎమర్జెన్సీ కోడ్ టైప్ చేశాడు. అది కెప్టెన్ స్వయంగా తలుపు తెరవడానికి అనుమతిస్తుంది. అయితే డోర్ ఆటోమేటిక్ గా తెరుచుకునేలోపు స్పృహలోకి వచ్చిన కో పైలట్ లోపలి నుంచి డోర్ ఓపెన్ చేశారు. తర్వాత మాడ్రిడ్ లో విమానాన్ని ల్యాండింగ్ చేసి అక్కడ అతన్ని ఆసుపత్రికి తరలించారు.

## బాలుడితో టీచర్ వికృత చేష్టలు

### బయటపడిన బండారం.. 9 ఏళ్ల జైలు

మాస్కో: విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఓ వివాహిత టీచర్.. విద్యార్థితో అనుచితంగా ప్రవర్తించింది. 11 ఏళ్ల బాలుడితో హద్దులు దాటి ప్రవర్తించింది.సదరు బాలుడిని లైంగికంగా వేధింపులకు గురిచేసి.. తన శారీరక అవసరాలను తీర్చుకుంది. ఈ విషయం బాలుడి తల్లికి తెలియడంతో.. ఆమె వ్యవహారం బయటకు వచ్చింది. దీంతో, ఆమెకు తొమ్మిది సంవత్సరాల జైలు శిక్ష విధించారు. ఈ దారుణ రష్యాలో చోటుచేసుకుంది. ఈ మేరకు ది న్యూయార్క్ పోస్ట్ కథనం వెల్లడించింది.వివరాల ప్రకారం.. రష్యాలో ఉన్న సెయింట్ పీటర్స్‌బర్గ్ ఉత్తర శివారులోని పాఠశాలలో అన్నా ప్లాక్సుక్ (27) టీచర్‌లో పనిచేస్తున్నారు. అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థి(11)తో ఆమె అనుచితంగా ప్రవర్తించారు. ఆమె శారీరక అవసరాల కోసం



అతడిలో లైంగిక వాంఛలకు ప్రేరేపించారు. క్లాస్‌రూమ్‌లో ఒంటరిగా ఉన్న సమయంలో తన శారీరాన్ని తాకే విధంగా ప్రవర్తించింది. అతడి పెదవులను సైతం ముద్దాడింది. అంతే కాకుండా సదరు విద్యార్థికి వాట్సాప్‌లో ఆమె నగ్న చిత్రాలను పంపించింది. మెసేజ్‌లు చేయడం, వీడియోలు పంపించడం చేసింది. దీంతో, బాలుడు.. ఆమె చేసే పనులను అడిక్ట్ అయి పోయాడు.ఒకానొక సమయంలో బాలుడు.. ఇంట్లో ఉండగా వింతగా ప్రవర్తించాడు. అనుమానం వచ్చిన అతడి తల్లి.. ఫోన్ చెక్ చేయడంతో టీచర్ బండారం బయటకు వచ్చింది. దీంతో, ఆమెను పేరెంట్స్ నిలదీశారు. పాఠశాల ప్రిన్సిపాల్‌కు టీచర్‌పై తల్లి ఫిర్యాదు చేసింది. అనంతరం, వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన కోర్టు టీచర్ ప్లాక్సుక్‌కు తొమ్మిది సంవత్సరాల జైలు శిక్ష విధించారు. జైలు నుంచి విడుదలైన తర్వాత ఒక సంవత్సరం పాటు బోధించకుండా నిషేధం విధించింది.





# మౌలిక వసతుల కల్పనలో రాజీ పడేది లేదు

- డాక్టర్ యాసీన భానును యువత స్ఫూర్తిగా తీసుకోవాలి
- జయదర్శిని ఎన్క్లేవ్‌లో మంచినీటి సరఫరాను ప్రారంభించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద

**కుత్బుల్లాపూర్ మే 18 (జనం సాక్షి) :** నియోజవర్గ ప్రజలకు మౌలిక వసతులు కనిపించడంలో రాజీ పడేది లేదని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. ఆదివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ బాలాజీ వెస్ట్ కౌంటి లో ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన మౌలిక సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా భూగర్భ డ్రైనేజ్ సమస్యలు వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజు యాదవ్, మాజీ కార్పొరేటర్ రాఘవేంద్ర రావు, నాయకులు సాంబశివరావు, బొబ్బ శ్రీనివాస్, సతీష్ రెడ్డి పాల్గొన్నారు. నీట్ ఎస్ ఎస్ 2025 పరీక్షల్లో జాతీయ స్థాయిలో 11వ ర్యాంకు సాధించిన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కు చెందిన యాసినా బాను ను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకనంద గౌడ్ అన్నారు. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని మధుర నగర్ లో నిర్వహించిన డాక్టర్ యాసీనాబాను అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య వృత్తిలో రాసిన భాను ఉన్నత శిఖరాలకు చేరుకోవాల న్నారు. తన కూతురును డాక్టర్ గా తీర్చిదిద్దడానికి కృషి చేసిన ఆమె తల్లిదండ్రులు డాక్టర్ రషీద్, నర్జిన్లను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమం లో నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ రాఘవేంద్రరావు, నాయకులు సాంబశివరెడ్డి, శ్రీనివాస్, సతీష్ రెడ్డి, మహమ్మద్ సలీం, కాలనీవాసులు హేమంతరావు, మద్దయ్య, విష్ణువర్ధన్ రావు, రాంబాబు, వెంకయ్య, నాగేశ్వరరావు, కోటిరెడ్డి, మురళి, నవీన్, శ్రీనివాస్, భరత్, ఆప్పాల రాజు, భాష, గంగాధర్, శ్రీలక్ష్మి, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జయదర్శిని ఎన్ క్లేవ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీటి సరఫరా సదుపాయాన్ని ఆదివారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతనంగా వెలుస్తున్న కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి తాను ఎల్లవేళ లా ముందు ఉంటానన్నారు.

అనంతరం జయదర్శిని ఎంక్లేవ్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మాట్లాడు తూ తమ కాలనీలో మంచినీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞత లు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కాలనీ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమం లో కొంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ సన్నాఫ్ శ్రీశైలం యాదవ్, నాయకులు చింతల దేవేందర్, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొండలరావు, వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేందర్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ చిన్నారెడ్డి, కోశాధికారి కృష్ణ కిషోర్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# మైలార్‌దేవ్‌పల్లిలో అగ్నిప్రమాదం

## 50మందిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం సంభవించిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి, ఉద్దమ్మగడ్డలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. వెంటనే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది అగ్నిప్రమాదం జరిగిన భవనం నుంచి 50మందిని కాపాడారు. ఇందులో 16మంది చిన్నారులు ఉన్నారు. ఉద్దమ్మగడ్డలో ఉన్న మూడంతస్తుల భవనంలో షార్ట్‌సర్క్యూట్ రావడంతో ఒక్కసారిగి మంటలు ఎగసిపడ్డాయి. వాటిని గమినించిన భవనంలో ఉంటున్న వారు భయాందోళనకు గురై భవనంపైకి ఎక్కారు. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి వచ్చిన ఫైర్ సిబ్బంది మంటల్లో చిక్కుకున్న 50మందిని భవనం నుంచి కాపాడి కిందికి తీసుకుని వచ్చారు. ఫైర్ సిబ్బంది కాపాడిన వారిలో 16మంది చిన్నారులు ఉన్నారు. భవనంలో మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది గంటన్నరపాటు శ్రమించారు. షార్ట్ సర్క్యూట్ వల్లే మూడంతస్థుల భవనంలో మంటలు చెలరేగాయని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

# పాకిస్తాన్ దుశ్చర్యల చరిత్రను తెలుసుకోండి

### ప్రజామిత్ర రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్



**కరీంనగర్ బ్యూరో, మే 18 (జనంసాక్షి) :** పాకిస్తాన్ దుశ్చర్యలను భారతీయులు తెలుసుకోవాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ అన్నారు. ఆదివారం ప్రజా మిత్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పాకిస్తాన్ దేశం, భారతదేశంపై జరుగుతున్న తీవ్రవాద కార్యకలాపాలను అర్థం చేసుకోవాలంటే దాని వెనుక ఉన్న చరిత్రను అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. 1930 నుండి 1947 మధ్యకాలంలో భారతదేశం స్వాతంత్ర ఉద్యమ పోరాటం జరుపుతున్నప్పుడు మత ఆధారంగా పాకిస్తాన్ దేశాన్ని ఏర్పాటు చేయాలని అన్న శక్తుల పూర్వపరాలను అధ్యయనం చేయాలి అన్నారు. తర్వాత 1947 నుండి 1971 మధ్యకాలంలో పాకిస్తాన్ దేశం ఏర్పడ్డ తర్వాత జరిగిన పరిమాణాలను అధ్యయనం చేయాల్సి ఉందన్నారు ఉదాహరణకు 1947లో పాకిస్తాన్ కాశ్మీరుపై దురాక్రమనకు పాల్పడడం 1965 లో ఏకంగా భారతదేశం పైన యుద్ధం ప్రకటించి

తదుపరి 1971లో భారతదేశం పాకిస్తాన్ కు గల యుద్ధ కారణాలు బంగ్లాదేశ్ విముక్తి, బంగ్లాదేశ్ లో పాకిస్తాన్ ఆర్మీ చేసిన నరమేధం 30 లక్షల మంది ప్రజలను చంపడం ఇదంతా అధ్యయనం చేయాలన్నారు. తదుపరి కాలం 1971 నుంచి 20 25 మధ్యకాలంలో జరిగిన పరిమాణాలు 1971 యుద్ధ కాలంలో పాకిస్తాన్ ఘోర పరాజయం భరత్ చేతిలో చవిచూవడం ఆ అవమానం నుండి బయటపడటానికి కొత్త ఆలోచనలు, కొత్త కుట్రలను ప్రారంభించింది. ఆఫ్ఘనిస్తాన్ లో రష్యా అనుకూల ప్రభుత్వం ఏర్పడడం వలన ఆ ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి పాకిస్తాన్ కు 1971లో అండదండలు అందించిన అమెరికా తాలిబాన్లకు మద్దతుగా పాకిస్తాన్ ఆర్మీ ద్వారా సైనిక శిక్షణను ఇప్పించడం జరిగింది. ఈ అనుభవంతోని పాకిస్తాన్ ఆర్మీ అటువంటి తీవ్రవాద గుంపును భారతదేశం పైకి తయారు చేసే ఆలోచన 1990లో ప్రారంభించిందన్నారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ లో కొన్ని శిబిరాలను అదేవిధంగా పాకిస్థాన్ లో కొన్ని శిబిరాలను ఏర్పాటుచేసి సీమాంతర ఉగ్రవాదాన్ని భారత్ పై ఎక్కు పెట్టింది. దుబాయ్ లాంటి దేశాల్లో ఉద్యోగం చేస్తున్నటువంటి భారతీయులను కూడా మతం ఆధారంగా ఆకర్షించి వారిని పాకిస్తాన్ కు తీసుకువెళ్లి ఇట్టి ఉగ్రవాద శిబిరాల్లో కూడా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఇట్లాంటి విషయాలన్నీ కూడా 1990 - 2000 సంవత్సరం ల మధ్యకాలంలో అన్ని పత్రికల్లో వివరాలన్నీ ప్రచురితం అయినాయని తెలిపారు. ఈ రకంగా వందల మందిని భారత దేశంలోకి కాశ్మీర్ బార్డర్ నుండి చోరపాటు చేయించి స్లీపర్ సేల్స్ గా ఉంచుతుందన్నారు. ఇటువంటి తీవ్రవాద పద్ధతుల ద్వారా హైదరాబాద్ నగరంలో గోకుల్ చాట్, లుంబిని పార్క్, దిల్‌షుక్ నగర్ ప్రాంతాల్లో బాంబు బ్లాస్ట్ లు చేయించిందన్నారు. పాకిస్తాన్ నుంచి నేరుగా కసబ్ అండ్ టీంను బొంబాయి నగరానికి పంపించి మరణ హోమాన్ని

సృష్టించిన సంగతి మన అందరికీ తెలిసిందే అన్నారు. కాశ్మీర్లో ఉగ్రవాద దాడులు ఉరి, పుల్వామాలో సైనికుల పై దాడి ఇలా భారత దేశంలో ఎన్నో ఉగ్రవాద కార్యక్రమాలు పాకిస్తాన్ ఆర్మీ తీవ్రవాద సంస్థలైన లష్కరో తోయిబా, జెసి మొహమ్మద్ లాంటి, సంస్థల ద్వారా చేయించి ఈ ఉగ్రవాద చర్యలతో పాకిస్తాన్ కు ఏ రకమైన సంబంధం లేదని బుకాయించిందన్నారు. ఇప్పటి పహిల్గమ్ దాడి ఆ తర్వాత కూడా పాకిస్తాన్ తన కార్యకలాపాలను మానుకుంటుందనే నమ్మకం లేదన్నారు. ఎందుకంటే ఇట్లాంటి చర్యలు ద్వారా పాకిస్తాన్ తన ప్రజలను మభ్యపెడుతూ ప్రభుత్వ పెద్దలు, ఆర్మీ పెద్దలు వారి దోపిడిని కొనసాగిస్తున్నారు. పాకిస్తాన్ ప్రజలను అజ్ఞానులుగా మార్చి వేస్తున్నారు.

అంతర్జాతీయంగా కొన్ని దేశాల నుంచి నిరంతరమైనటువంటి ఫండింగ్ కోసం భారతదేశంపై తన విషన్ని చిమ్ముతుందన్నారు.

కొన్ని దేశాలు పాకిస్తాన్ ను ముందు పెట్టి కుట్రలు జరుపుతున్నారన్నారు. రష్యా అప్పుడు ఇప్పుడు భారత్ కు మిత్రదేశంగా మనకు సహకరిస్తుందన్నారు. అదేవిధంగా రానున్న కాలంలో మనకు తూర్పున ఉన్న జపాన్, థాయిలాండ్, వియత్నం, బర్మా లాంటి దేశాలు మనకు మిత్రత్వం అందించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ విషయాలన్నీ కూడా 140 కోట్ల భారతీయులకు సంబంధించిన విషయాలని తెలిపారు. ఈ విషయాలపై కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ రాజకీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు, సామాజిక సంస్థలు, మేధావులు ప్రజలను చైతన్య పరచాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ కోరారు. ఈ మీడియా సమావేశంలో కొంపల్లి రవీందర్, గాజం నరేందర్, బైరం రాజేందర్, శ్రీరాముల కిషన్, నాగరాజులు పాల్గొన్నారు.

# స్కోడా కోడియాక్ ఎస్‌యూవీ విడుదల



ఖైరతాబాద్, మే 18 (జనం సాక్షి) : 130 ఏళ్ల చరిత్ర గల స్కోడా ఇండియా కొత్త తరం కోసం 'స్కోడా కోడియాక్' ఎస్‌యూవీ వాహనాన్ని నగరంలోని పీపీఎస్ మోటార్స్ స్కోడా షోరూంలో ఆవిష్కరిం చినట్లు స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పీట ర్ జానెబా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీపీఎస్ మోటార్స్ ఎండీ రాజీవ్ సంఘ్వీతో కలసి ఆయన మాట్లాడుతూ ఇది లగ్జరీ, రిఫైన్‌మెంట్, ఆఫ్-రోడ్ సామర్థ్యం, రోడ్డు డైనమిక్స్, ఏడు-సీట్లతో అందుబాటులో ఉంటుందన్నారు.

# పార్కుల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే మాగంటి



**వెంగళరావునగర్, మే 18 :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పార్కుల అభివృద్ధికి కృషి చేస్తానని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఆదివారం వెంగళరావునగర్ డివిజన్ సిద్దార్థనగర్ లో రూ. 30 లక్షల వ్యయంతో చేపట్టిన పార్కు పునర్నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి మాట్లాడుతూ పార్కు అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని పేర్కొన్నారు. కాలనీ వాసులు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేలా పార్కును సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్, ఏ.ఈ అవినాష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల తరపున కాంగ్రెస్‌ను వెంటాడుతాం

### దాస్యం వినయ్ భాస్కర్

**వరంగల్, మే 18 (జనం సాక్షి) :** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల తరపున వెంటాడతామని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ హెచ్చరించారు. గ్రేటర్ వరంగల్ 29వ డివిజన్ రామన్నపేటలో బీఆర్ఎస్ డివిజన్ యూత్ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నుంచి 100 మంది యువకులు, మహిళలు బీఆర్ఎస్‌లో చేరగా, వారిని వినయ్ భాస్కర్ గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

కాంగ్రెస్ పార్టీ 420 హామీలు, ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని వినయ్ భాస్కర్ ఆరోపించారు. 16 నెలల పాలనలో అన్ని వర్గాలను మోసం చేసిందని, బీఆర్ఎస్‌ను ఆదరించే ప్రజలను బెదిరించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని సవాల్ విసిరారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, అప్పుడు కాంగ్రెస్ చర్యలకు వడ్డీతో సహా బదులిస్తామని హెచ్చరించారు.


29వ డివిజన్‌లో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 27 కోట్ల నిధులతో 344 అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వినయ్ భాస్కర్ గుర్తు చేశారు. 1200 మందికి పెన్షన్లు, 500 మంది ఆడపిల్లలకు కల్యాణ లక్ష్మి ద్వారా రూ. 1,00,016 చొప్పున, 50 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించినట్లు వివరించారు. ప్రజల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ నాయకులు నమ్మకాన్ని వమ్ము చేశారని, రానున్న ఎన్నికల్లో ప్రజలకు అండగా నిలిచే వారికే బీఆర్ఎస్ టికెట్ ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వద్దిరాజు గణేష్, నాయకులు షఫీ, రమేష్, చందు, రాజు, తహసిల్, నాగమణి, లక్ష్మి, రహీం, శ్రీను, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

## కిషన్ రెడ్డి వ్యాఖ్యలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాను: డిజి నాగి రెడ్డి

హైదరాబాద్: ప్రమాద స్థలం నుంచి కాల్ వచ్చిన వెంటనే ఫైర్ సిబ్బంది స్పందించారని ఫైర్ డిజి నాగిరెడ్డి తెలిపారు. సమయానికి ఫైర్ సిబ్బంది రాలేదనడం అవాస్తవం అని అన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలను ఫైర్ డిజి ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తమ దగ్గర అత్యాధునిక పరికరాలు లేదనడం సరికాదని నాగిరెడ్డి విమర్శించారు. ఉదయం 6:16కు కాల్ వచ్చిందని, వెంటనే ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారని డిజి తెలిపారు. గ్రౌండ్ ఫ్లోర్ లో మంటలు పై అంతస్తుకు వ్యాపించాయని, మంటల్లో చిక్కుకున్న 17 మందిని రక్షించాం అని తెలియజేశారు. అడ్వాన్స్ డ్ ఫైర్ రోబోట్ ఆపరేషన్ లో ఉపయోగించామని, మంటలను 2 గంటల్లో అదుపు చేశామని ఫైర్ డిపార్ట్ మెంట్ స్పష్టం చేసింది. కిషన్ రెడ్డి వ్యాఖ్యలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని నాగిరెడ్డి పేర్కొన్నారు.

# పోలీసా..... మజాకా!

## పోలీస్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు




**నిజామాబాద్ జిల్లా బ్యూరో మే 18 (జనం సాక్షి) :** పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం అంటే అనునిత్యం శాంతి భద్రత కోసం పనిచేసేది. కానీ కొంతమంది ఆ ఉద్యోగాన్ని తమ స్వార్థం కోసం వాడుకునే వారుంటారని నిజామాబాద్ లో ఒకాయన నిజం చేశారు. ప్రజలకు డబ్బులు ఇచ్చి అధిక వడ్డీ వసూలు చేస్తున్న ఓ కానిస్టేబుల్ పై నగరంలోని రూరల్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆరిఫ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లాలోని మెండోరా పోలీస్ స్టేషన్ లో నగరంలోని ప్రియదర్శిని కాలనీకి చెందిన కల్వరే గంగాధర్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా అయన అధిక వడ్డీకి డబ్బులు ఇచ్చి వారి వద్ద నుండి సేల్ డీడ్ కింద భూములను రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నాడు. నగరానికి చెందిన ఒక మహిళకు సేల్ డిడ్ పేరుతో మూడు స్థలాలను బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని 8 లక్షల రూపాయలు అప్పుగా ఇచ్చాడు. ఈ విషయమై బాధిత మహిళ గంగాధర్ పై నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ తెలిపారు.

# గత పాలకుల తప్పిదాల వల్ల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా



- పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక.
- ప్రారంభించినాక నెల రోజులకే డైనమిక్ లైటింగ్ సిస్టమ్ పని చేయకపోతే మాదా భాధ్యత
- స్మార్ట్ సిటీ నిధులు పదహారు కోట్లు వెచ్చించిన బయో మైనింగ్ మిషన్ ఫెయిల్ కావడానికి కారణం ఎవరు
- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఫైర్

**కరీంనగర్ బ్యూరో, మే18 (జనం సాక్షి) :** గత పాలకుల తప్పిదాల వల్ల నాణ్యతా ప్రమాణాలు పాటించ క పోవడం వల్ల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయ్యిందని దానికి పారదర్శ పాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిందించడమేంటని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. కరీంనగర్ కళలతో కళాకారులతో అభివృద్ధి సంక్షేమంతో కలకలలాడుతుందని పచ్చ కామెర్లోళ్లకు లోకమంతా పచ్చగానే కనిపిస్తోందని బిఆర్ఎస్ శాసనసభ్యులు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి లను మాజీ బిఆర్ఎస్ నాయకులను ఉద్దేశించి నరేందర్ రెడ్డి వ్యాఖ్యానించారు.

ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక పారదర్శకంగా అర్హులకు మాత్రమే ఇచ్చే విధంగా ఎవరి ప్రమేయం లేకుండా జరుగుతుందని అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని గత బిఆర్ఎస్ పాలనలో ఏపథకమైనా పింక్ చొక్కాలకు మాత్రమే వర్తించేదని నిజమైన అర్హులకు అన్యాయం జరిగిందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. కేబుల్ బ్రిడ్జిపై డైనమిక్ లైటింగ్ కోసం ఆరు కోట్లు ఖర్చు పెట్టారని టెండర్ ప్రక్రియలో దాని భాధ్యత భద్రత మరచిపోవడం వల్ల వెలిగించిన నెల రోజుల్లోనే విలువైన సామగ్రి దొంగల పాలయ్యాయని దానికి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిందించడమేంటని ప్రశ్నించారు. కోట్ల రూపాయల ప్రజా ధనం ఖర్చుపెట్టి ఐల్యాండ్లు సుందరీకరణ చేశారు కానీ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల రెండు మూడు సంవత్సరాలలోపే ఎక్కడికక్కడ ఊడి పోతున్నాయని నరేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్ సిటీ నిధులు పదహారు కోట్లు ఖర్చు పెట్టి డంపు యార్డులో బయో మైనింగ్ మిషన్ ఏర్పాటు చేస్తే అది ఎందుకు పనికి రాకుండా పోయిందని దానికి భాధ్యత ఆనాటి బిఆర్ఎస్ పాలక వర్గానిది కేంద్ర ప్రభుత్వ నాయకులది కాదా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ నాయకుల వైఖరి దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఇంచార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉమ్మడి జిల్లా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో దన్నసింగ్, జిడి రమేష్, కోడూరి రవీందర్ గౌడ్, బత్తిని చంద్రయ్య, మార్క రాజా గౌడ్, నదీమ్, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 18 (జనంసాక్షి) :** వేములవాడ అర్బన్ మండలం అగ్రహారంలోని శ్రీ హనుమాన్ దేవాలయం ఆవరణలో 31 లక్షలతో ప్రాకార గోడ,(సాలహారము) మరియు అర్చి నిర్మాణనికి ఆదివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రూ 31 లక్షలతో అంజన్న సన్నిధిలో ప్రాకార గోడ, అర్చీ నిర్మాణం కోసం శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర దేవస్థానానికి వచ్చే భక్తులు ఆంజనేయ స్వామిని దర్శించుకోవడం ఆనవాయితన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధి, పట్టణాభివృద్ధి, శ్రీ జోడఆంజనేయ స్వామి వారి అభివృద్ధి చేసుకుంటూ ముందుకు పోతున్నమన్నారు. అంజన్న ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నూతన గ్రానేట్ వేయాలని నిర్ణయించడం జరిగిందనీ, రానున్న రోజుల్లో దశలవారీగా ఆంజనేయ స్వామి వారి ఆలయం అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు.

ఇటీవల నాంపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ వెళ్ళినప్పుడు మూడు అంతస్తుల గోపురం కావాలని వారు కోరడం జరిగిందనీ, త్వరలోనే స్వామివారి సన్నిధిలో మూడంతస్తుల గోపురం నిర్మాణం చేసుకుందమన్నారు. మామిడిపల్లి శ్రీ సీతారామచంద్ర ఆలయ ఆవరణలో కళ్యాణ మండపం నిర్మించాలని నిర్ణయించడం జరిగిందనీ, రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల్లో మెరుగైన వసతులు కల్పించడం లక్ష్యంగా అన్ని ఆలయాలను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. రూ150 పై చిలుకు కోట్లతో వేములవాడ ఆలయ, పట్టణ అభివృద్ధి చేస్తున్నమని, ఇప్పటికే రూ 47 కోట్లు జిల్లా కలెక్టర్ ఖాతాలో జమ అయ్యాయన్నారు. స్వామి వారి సన్నిధిలో అన్నదాన సత్రం, రూ 76 కోట్లతో ఆలయాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. శృంగేరి పీఠం, పట్టణ ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల వారు, పరిరక్షణ సమితి వారు చెప్పే సూచనలు సలహాలు స్వీకరిస్తున్నమని, అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు, జిల్లా గ్రంధాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి, ఆలయ ఈవో శ్రీనివాస్ యాదవ్, ఆలయ అర్చకులు, కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ కేశవనగర్ కార్యక్రమంలో బోడుప్పల్ కమీషనర్ శైలజ పిలుపు





**బోడుప్పల్-జనంసాక్షి**

పరిసరాల పరిశుభ్రతకు కాలనీ సంక్షేమ సంఘాలు ప్రాధాన్యతనివ్వాలని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ ఏ.శైలజ పిలుపునిచ్చారు. ఆదివారం ఆమె బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని కేశవనగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ కె శవనగర్ కార్యక్ర మంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమీషనర్ శైలజ మాట్లాడుతూ... కార్పొరేషన్ చేపడుతున్న స్వచ్ఛతా కార్యక్రమాలకు కాలనీ సంఘాల భాగస్వామ్యం అవసరమన్నారు. బోడుప్పల్ కార్పొరేషన్ను పరిశుభ్రంగా ఉంచడంలో తమవంతు కృషి చేస్తున్నామని. దీనికి ప్రజల సహకారం కూడా అవసరమన్నారు. కాలనీ సంక్షేమ సంఘాలు నిర్వహించే స్వచ్ఛతా కార్యక్ర మాలకు కార్పొరేషన్ తరపున ఎల్లవేళలా మద్దతు ఉంటుందని స్పష్టం చేశా రు. కాలనీలలో ప్రజలకు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొత్తగా ఎన్నికైన కాలనీ సం క్షేమ సంఘం సభ్యులు కాలనీవాసుల సహకారంతో కేశవ్నగర్ సుస్థిర అభివృద్ధి భవిషత్ తరాల కోసం లో భాగంగా స్వచ్ఛ కేశవనగర్ పేరుతో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇదే రీతిలో కార్పొరేషన్ లోని అన్ని కాలనీ సంక్షేమ సంఘాలు స్వచ్ఛతా కార్యక్రమాలను నిర్వహిస్తే ప్రజలు ఆశించిన ఫలితాలను సాధించవచ్చున్నారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కాలనీలోని వీధులను శుభ్రం చేయడం ద్వారా కాలనీల పరిశుభ్రతపై అవగా హన పెంపొందించడానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కోహ్లీకి భారతరత్న



టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు టాప్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్టుల నుంచి తప్పుకున్నారు. ఇద్దరూ 5 రోజుల వ్యవధిలో సుదీర్ఘ ఫార్మాట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించారు. దీంతో భారత టెస్ట్ క్రికెట్ జట్టు భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తమవుతోంది. రోకో జోడీ లేని జట్టును ఊహించలేమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో ఇద్దరూ కలసి ఆడిన ఇన్నింగ్స్‌లు, సాధించిన ఘనతల గురించి చర్చలు నడుస్తున్నాయి. ఇద్దరికీ ప్రభుత్వం నుంచి మరిన్ని పురస్కారాలు రావాలనే డిమాండ్లు కూడా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా టెస్టులతో పాటు అన్ని ఫార్మాట్లలోనూ అదరగొట్టిన కోహ్లీకి భారతరత్న పురస్కారం ఇవ్వాలని సోషల్ మీడియాలో నెటిజన్స్ అంటున్నారు. ఇప్పుడు ఇదే రోకో ఫ్యాన్స్ మధ్య చిచ్చుకు కారణంగా మారింది.

రోహిత్–కోహ్లీ ఇద్దరూ భారత్‌కు ఒంటిచేత్తో ఎన్నో విజయాలు అందించారు. క్లిష్టమైన మ్యాచుల్లో టీమ్‌ను లెక్కలేనన్ని సార్లు బయటపడేశారు. ఇద్దరూ కెప్టెన్‌గానూ ఫుల్ సక్సెస్ అయ్యారు. ఈ నేపథ్యంలో కోహ్లీకే భారతరత్న ఇవ్వాలనే డిమాండ్ సరికాదని.. రోహిత్‌కూ ఆ పురస్కారాన్ని ఇవ్వాలని అతడి ఫ్యాన్స్ నుంచి రిక్వెస్ట్‌లు వస్తున్నాయి. సారథిగా టీ20 వరల్డ్ కప్–2024తో పాటు చాంపియన్స్ ట్రోఫీ–2025ను భారత్‌కు అందించాడని, అతడికి ఆ అవార్డు ఇవ్వాల్సిందేనని సోషల్ మీడియాలో నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

**అతడికేం తక్కువ?**

రోహిత్–కోహ్లీకి ఇస్తే మరో దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీని కూడా భారతరత్నతో గౌరవించాలనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. టీ20 వరల్డ్ కప్–2007తో పాటు వన్డే ప్రపంచ కప్–2011, చాంపియన్స్ ట్రోఫీ–2013ను టీమిండియాకు అందించాడని, అతడి సేవల్ని ఎలా తక్కువ చేస్తారనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. భారత క్రికెట్‌కు అందించిన మహత్తర సేవలకు గానూ కోహ్లీని భారతరత్నతో గౌరవించాలని మాజీ బ్యాటర్ సురేష్ రైనా చేసిన వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోసినట్లు అయ్యాయి. కాగా, మన దేశంలో క్రీడల్లో ఒకే ఒక వ్యక్తికి భారతరత్న పురస్కారం దక్కింది. అదే మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్. రిటైర్‌మెంట్ తర్వాత 2014లో అతడ్ని ఈ అవార్డుతో సత్కరించింది కేంద్ర ప్రభుత్వం. మరి.. ఫ్యాన్స్ మధ్య చిచ్చు పెడుతున్న అవార్డు గోల ఎప్పటికి ముగుస్తుందో చూడాలి.

## కోహ్లీ సంచలన నిర్ణయం..

టెస్టులకు రిటైర్‌మెంట్ ప్రకటించిన టీమిండియా టాప్ బ్యాటర్ విరాట్ కోహ్లీ.. ఇకపై వన్డేల్లో మాత్రమే కొనసాగనున్నాడు. ఇప్పటికే టీ20ల నుంచి వైదొలిగిన కింగ్.. ఐపీఎల్ రూపంలో సంవత్సరానికి ఒకసారి పొట్టి ఫార్మాట్‌లోనూ మెరుపులు మెరిపించనున్నాడు. అయితే సుదీర్ఘ ఫార్మాట్ నుంచి అతడు తప్పుకోవడం అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఫామ్, ఫిట్‌నెస్ ఉన్నా అర్ధాంతరంగా రిటైర్‌మెంట్ ఇచ్చేయడం ఏంటని విస్మయానికి లోనవుతున్నారు. ఈ తరుణంలో వాళ్లకు మరో షాకింగ్ న్యూస్. టెస్టులకు గుడ్‌బై చెప్పేసిన కోహ్లీ సంచలన నిర్ణయం తీసుకున్నాడని తెలుస్తోంది. ఇంగ్లీష్ కౌంటీ క్రికెట్‌లో ఆడాలని అతడు డిసైడ్ అయ్యాడని సమాచారం. ఆడతాడా? ఇంగ్లీష్ దేశవాళీ క్రికెట్‌లో మిడిలెసెక్స్ క్లబ్ తరఫున కోహ్లీని ఆడించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయట. ఇంగ్లీష్ డొమెస్టిక్ వన్డే టోర్నమెంట్ అయిన మెట్రో బ్యాంక్ కప్‌లో విరాట్‌ను బరిలోకి దింపాలని భావిస్తున్నారట. అందుకోసం కోహ్లీతో ఇంగ్లీష్ క్రికెట్‌కు సంబంధించిన అధికారులు చర్చలు జరుపుతున్నారని.. అతడు ఓకే కూడా చెప్పేశాడని సోషల్ మీడియాలో గాసిప్స్ వస్తున్నాయి. అన్నీ కుదిరితే ఈ ఏడాదే కౌంటీ చాంపియన్‌షిప్ లేదా మెట్రో బ్యాంక్ కప్‌లో కోహ్లీ ఆడటం ఖాయమని వినిపిస్తోంది. అయితే బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ ఉన్నందున ఇంగ్లీష్ నేలపై విరాట్ బరిలోకి దిగడం అనుమానం మారింది. ఒకవేళ కౌంటీల్లో ఆడినా ది హండ్రెడ్, టీ20 బ్లాస్ట్ లాంటి పొట్టి ఫార్మాట్ టోర్నీల్లో అతడు ఆడేందుకు వీలు లేదు.

# జవాన్ల వల్లే సేఫ్‌గా ఆడగలుగుతున్నాం



పహల్గాం ఉగ్రదాడి దరిమిలా టెర్రరిస్టుల స్థావరాలపై భారత సైన్యం దాడి చేయడం, ప్రతిదాడి చేసిన పాకిస్థాన్‌కు మన ఆర్మీ మూడు చెరువుల నీళ్లు తాగించడం చూస్తున్నాం. మన దేశం పేరు చెబితే చాలు.. పాక్ వణికిపోయేలా చేశారు భారత సైనికులు. అందుకే వాళ్లకు హ్యాట్సాఫ్ చెబుతున్నాడు పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్. జవాన్ల వల్లే సేఫ్‌గా క్రికెట్ ఆడగలుగుతున్నామని అన్నాడు. భారత్–పాకిస్థాన్ ఉద్రిక్తతల వల్ల అర్ధాంతరంగా ఆగిపోయిన ఐపీఎల్–2025 శనివారం నాడు రీస్టార్ట్ అయింది. అయితే ఆర్సీబీ–కేకేఆర్ మ్యాచ్ వాన కారణంగా రద్దయింది. ఈ నేపథ్యంలో రెండో మ్యాచ్ జరుగుతుందా అని టెన్షన్ పడ్డారు ఫ్యాన్స్. కానీ పంజాబ్ కింగ్స్–రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా మొదలైంది. ఈ నేపథ్యంలో టాస్ సమయంలో భారత ఆర్మీపై ప్రశంసల జల్లులు కురిపించాడు అయ్యర్. ఐపీఎల్‌ను మిస్ అయ్యానని, అయితే ఎట్టకేలకు అందరు ఆటగాళ్లు తిరిగొచ్చారని అన్నాడు అయ్యర్. సీజన్ తిరిగి మొదలవడం సంతోషంగా ఉందన్నాడు శ్రేయస్. కారణాలు చెప్పి టోర్నమెంట్‌కు డుమ్మా కొట్టకుండా అందరూ మళ్లీ రావడం ఆనందంగా ఉందన్నాడు పంజాబ్ సారథి. వచ్చిన అవకాశాల్ని రెండు చేతులా వినియోగించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యాఖ్యానించాడు. మానసికంగా చాలా దృఢంగా ఉన్నామని పేర్కొన్నాడు అయ్యర్. దేశానికి సేవలు అందించిన త్రివిధ దళాలకు అభినందనలు తెలియజేశాడు. భారత్‌ను సురక్షితంగా ఉంచినందుకు వారికి ధన్యవాదాలు తెలిపాడు. కాగా, సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ నెగ్గిన పంజాబ్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే అయ్యర్ నిర్ణయం జట్టును దెబ్బతీసింది. ఆ టీమ్ ఆరంభంలో వరుసగా వికెట్లు కోల్పోయింది. ప్రస్తుతం 3.1 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 34 పరుగులతో ఉంది.



# టీ20ల్లో కోహ్లీ రికార్డు బద్దలు

### రాహుల్ రికార్డు మైలురాయి

- టీ20లో వేగవంతమైన 8,000 పరుగుల జాబితా
- మెరుపు సెంచరీతో రాహుల్ గర్జన
- ఢిల్లీకి వెన్నెముకగా రాహుల్

స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ టీ20 క్రికెట్లో అత్యంత వేగంగా 8,000 పరుగులు పూర్తి చేసిన భారత ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. విరాట్ కోహ్లి 243 ఇన్నింగ్స్‌లో సాధించిన ఈ మైలురాయిని రాహుల్ కేవలం 224 ఇన్నింగ్స్‌లోనే అందుకుని కోహ్లి రికార్డును బద్దలు కొట్టాడు. ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఆడుతూ రాహుల్ ఈ ఘనత సాధించాడు.

టీ20 క్రికెట్లో వేగంగా 8,000 పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ (213 ఇన్నింగ్స్‌లు) అగ్రస్థానంలో ఉండగా, పాకిస్థాన్ బ్యాటర్ బాబర్ అజామ్ (218 ఇన్నింగ్స్‌లు) రెండో స్థానంలో ఉన్నాడు. కేఎల్ రాహుల్ మూడో స్థానంలో నిలవగా, విరాట్ కోహ్లి (243), మహ్మద్ రిజ్వాన్ (244) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తొలుత బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (112లిబీ 65 బంతుల్లో 14 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ సెంచరీతో అదరగొట్టాడు. ఈ సీజన్‌లో సెంచరీ చేసిన తొలి కుడిచేతి వాటం బ్యాటర్‌గా రాహుల్ నిలిచాడు. ఇది అతని ఐపీఎల్ కెరీర్‌లో ఐదో సెంచరీ. అభిషేక్ పోరెల్ (30), అక్షర్ పటేల్ (25), ట్రిస్టన్ స్టబ్స్ (21లి) మద్దతు ఇచ్చారు. గుజరాత్ బౌలర్లలో అర్షద్ ఖాన్, సాయి కిశోర్, ప్రసిద్ధ కృష్ణ తలో వికెట్ తీశారు.

ఐపీఎల్ సెంచరీల జాబితాలో రాహుల్

ఐపీఎల్‌లో అత్యధిక సెంచరీల జాబితాలో విరాట్ కోహ్లి 8 సెంచరీలతో అగ్రస్థానంలో ఉన్నాడు. జోస్ బట్లర్ (7) రెండో స్థానంలో, క్రిస్ గేల్ (6) మూడో స్థానంలో ఉన్నారు. కేఎల్ రాహుల్ 5 సెంచరీలతో నాలుగో స్థానంలో నిలిచాడు. టీ20 క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు కొట్టిన భారత ఆటగాళ్లలో కోహ్లి (9), రోహిత్ శర్మ (8), అభిషేక్ శర్మ (7), రాహుల్ (7) వరుసగా మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నారు. ఐపీఎల్ 18వ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటింగ్‌కు కేఎల్ రాహుల్ వెన్నెముకగా నిలుస్తున్నాడు. గుజరాత్ టైటాన్స్ బౌలర్లను ఊచకోత కోస్తూ 60 బంతుల్లో సెంచరీ సాధించిన రాహుల్, జట్టుకు బలమైన పునాది వేశాడు. ఈ మ్యాచ్‌లో అతని దూకుడు ఢిల్లీకి 200 పరుగుల లక్ష్యాన్ని అందించింది.



# రాజస్థాన్ ఓటమి

### ప్లే-ఆఫ్స్‌కు చేరువైన పంజాబ్

- రాజస్థాన్ ఛేదనలో వైఫల్యం
- జైస్వాల్-సూర్యవంశీ మెరుపు ఆరంభం
- ఐపీఎల్ 2025లో కీలక పోరులో పంజా

జైపూర్: ఐపీఎల్ 2025లో కీలక పోరులో పంజాబ్ కింగ్స్ రాజస్థాన్ రాయల్స్పై 10 పరుగుల తేడాతో విజయం సాధించింది. 12 మ్యాచ్‌ల్లో 8వ విజయంతో 17 పాయింట్లు సాధించిన పంజాబ్, ప్లే–ఆఫ్స్‌కు ఒక్క అడుగు దూరంలో నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 219 పరుగులు చేసింది. ఛేదనలో రాజస్థాన్ 209/7తో పరిమితమైంది.

యశస్వి జైస్వాల్ (50* 25 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్), వైభవ్ సూర్యవంశీ (40* 15 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) దూకుడుగా ఆడినప్పటికీ రాజస్థాన్ ఓటమి తప్పలేదు. సంజు శాంసన్ (20* 16 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), రియాన్ పరాగ్ (13* 11 బంతుల్లో 1 సిక్స్) నిరాశపరిచారు. ధ్రువ్ జురెల్ (53* 31 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) పోరాడినా, ఇతర బ్యాటర్ల నుంచి సహకారం లభించలేదు. పంజాబ్ స్పిన్నర్ హర్‌ప్రీత్ బ్రార్ (3/22) కీలక వికెట్లతో రాజస్థాన్‌ను కట్టడి చేశాడు. యాన్సెన్, ఒమర్జాయ్ రెండేసి వికెట్లు తీశారు.

**జైస్వాల్, సూర్యవంశీ దూకుడు వృథా**

జైస్వాల్, సూర్యవంశీలు ఆరంభం నుంచి పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. అర్ష్‌దీప్ వేసిన తొలి ఓవర్‌లో జైస్వాల్ 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 22 పరుగులు రాబట్టాడు. యాన్సెన్ ఓవర్‌లో సూర్యవంశీ 2 సిక్స్‌లు, 1 ఫోర్ కొట్టాడు. బార్ట్ ఓవర్‌లో జైస్వాల్ 3 బౌండరీలు బాదగా, 3 ఓవర్లలోనే రాజస్థాన్ 50 పరుగులు దాటింది. అర్ష్‌దీప్ వేసిన 4వ ఓవర్‌లో సూర్యవంశీ 1 ఫోర్, 2 సిక్స్‌లు కొట్టాడు. హర్‌ప్రీత్ బ్రార్ సూర్యవంశీని అడ్డుకున్నాడు. జైస్వాల్ 24 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసినా, బ్రార్ బౌలింగ్‌లోనే ఔటయ్యాడు. శాంసన్ కూడా త్వరగా వెనుదిరిగాడు. జురెల్, పరాగ్ 13 ఓవర్లలో 143/3తో బలంగా కనిపించినా, బ్రార్ పరాగ్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. హెట్‌మయర్ (11బీ 12 బంతుల్లో) నెమ్మదిగా ఆడగా, జురెల్ దూకుడు కొనసాగించాడు. చివరి 2 ఓవర్లలో 30 పరుగులు అవసరం కాగా, అర్ష్‌దీప్ 19వ ఓవర్‌లో 8 పరుగులు, యాన్సెన్ చివరి ఓవర్‌లో 11 పరుగులు ఇచ్చి 2 వికెట్లు తీసి పంజాబ్ విజయాన్ని ఖరారు చేశారు.

**పంజాబ్ భారీ స్కోరు**

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పంజాబ్‌లో నేహల్ వదేరా (70* 37 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), శశాంక్ సింగ్ (59* 30 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధశతకాలతో రాణించారు. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (21బీ 10 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), శ్రేయస్ అయ్యర్ (30బీ 25 బంతుల్లో 5 ఫోర్లు), అజ్మతుల్లా ఒమర్జాయ్ (21* 9 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) మెప్పించారు. ప్రియాంశ్ ఆర్య (9), మిచెల్ ఒవెన్ (0) నిరాశపరిచారు. రాజస్థాన్ బౌలర్లలో తుషార్ దేశ్‌పాండే 2 వికెట్లు, క్వెనా మఫాక, రియాన్ పరాగ్, ఆకాశ్ మధ్వాల్ ఒక్కో వికెట్ తీశారు.

## వైభవ్ సూర్యవంశీ(40)

ఈ జోడీని విడదీసేందుకు స్పిన్నర్ హర్‌ప్రీత్ బ్రార్‌ను రంగంలోకి దింపిన అయ్యర్ ఫలితం సాధించాడు. వైభవ్.. పెద్ద షాట్ ఆడబోయి యాన్సెన్ చేతికి చిక్కాడు. దాంతో, 76 వద్ద రాజస్థాన్ తొలి వికెట్ పడింది. అయినా సరే యశస్వీ జోరు తగ్గించకపోవడంతో రాజస్థాన్ పవర్ ప్లేలో వికెట్ నష్టానికి 89 పరుగులు చేసింది. కానీ, హర్‌ప్రీత్ అర్ధ శతకంతో జోరుమీదున్న యశస్వీని ఔట్ చేసి పంజాగ్‌కు మరో బ్రేకిచ్చాడు.

## జురెల్ ఒంటరి పోరాటం

ఆ కాసేపటికే అజ్మతుల్లా బౌలింగ్‌ను సంజూ శాంసన్(20) ను ఔట్ చేసి రాజస్థాన్ గెలుపు ఆశలపై నీళ్లు చల్లాడు. నాలుగో వికెట్‌కు 30 రన్స్ జోడించిన రియాన్ పరాగ్(13)ను ఔట్ చేసిన బ్రార్.. మూడో వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. అప్పటికీ సాధించాల్సిన రన్‌రేట్ 14కు చేరింది. ధ్రువ్ జురెల్(53), షిమ్రన్ హెట్‌మైర్ (11)లు..గెలిపించే బాధ్యత తీసుకున్నా పంజాబ్ బౌలర్లు అవకాశం ఇవ్వేలేదు. అర్ష్‌దీప్ వేసిన 17వ ఓవర్లో జురెల్ సిక్సర్ బాదగా పంజాబ్ స్కోర్ 170 దాటింది. దాంతో, సమీకరణం 18 బంతుల్లో 41కి చేరింది.



# తాగు నీటికి తండ్లాట

### గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్న కమ్మారిగూడెం గ్రామస్తులు

### 20 రోజులుగా మంచినీటి కొరత

- ఏడాదిగా నిరుపయోగంగా మారిన పంచాయతీ మోటార్
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రజా సమస్యలు
- పరిష్కారం కాకుండా గాలికి వదిలేసిన పాలకులు



**నూగూర్ వెంకటాపురం, మే 19 (జనం సాక్షి):** వెంకటాపురం మండలంలోని కమ్మారిగూడెం గ్రామంలో గత 20 రోజులుగా మంచినీటి సమస్య తీవ్ర ఇబ్బందులకు దారితీస్తోంది. గ్రామస్తులు నీటి కోసం అల్లాడుతుండగా, పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా కూడా గ్రామానికి అందకపోవడంతో, గ్రామంలోని బోర్ల నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితిని సరిచేయాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణం స్పందించి మంచినీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలోని మహిళలు కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 20 రోజులుగా మంచినీటి సరఫరా లేకపోవడంతో ఇంటి పనులు, కనీస అవసరాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. గ్రామం బయట బోర్ల నుంచి నీటిని తెచ్చుకోవడానికి గంటల తరబడి సమయం వెచ్చించాల్సి వస్తోందని, దీంతో వ్యవసాయ పనులకు వెళ్లే సమయం కూడా సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

**అధికారుల నిర్లక్ష్యమే సమస్యకు కారణం**

గ్రామస్తులు పూనెం కమల మాట్లాడుతూ, వేసవి కాలంలో నీటి ఎద్దడి మరింత తీవ్రమవుతుందని, అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఈ సమస్య తలెత్తిందని ఆరోపించారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, గ్రామానికి తాగునీటి సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని కోరారు.

**ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదు :**

గ్రామంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, అధికారులకు పదేపదే వినతి పత్రాలు ఇచ్చినా ఎలాంటి స్పందన లేదని వాపోయారు. సమస్య పరిష్కారం కాకపోతే ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



సబక శ్రావణి
మాజీ 4వ వార్డు సభ్యురాలు



## నిరుపయోగంగా మారిన పంచాయతీ మోటార్

గ్రామ పంచాయతీకి చెందిన నీటి సరఫరా మోటార్ ఏడాదిగా పనిచేయకుండా నిరుపయోగంగా ఉంది. దీనిని రిపేర్ చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, పంచాయతీ నిధులను సరిగా వినియోగించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మోటారును రిపేర్ చేసి, గ్రామానికి నీటి సరఫరాను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల రోజువారీ అవసరాల్లో మంచినీరు కీలకమైనదని, అధికారులు తక్షణం స్పందించి కమ్మారిగూడెం గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



# ఇందిరమ్మ గృహ పథకం లబ్ధిదారులకు భారీ ఊరట

**తక్కువ ధరలకు సిమెంట్, స్టీల్ అందించేందుకు ప్రభుత్వ యోచన**

**ఇంటి నిర్మాణ వ్యయాన్ని తగ్గించే దిశగా కీలక చర్య**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సొంతింటి కలను నిజం చేసేందుకు ఒక గొప్ప ముందడుగు వేస్తోంది. రాష్ట్రంలో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు తక్కువ ధరలకే సిమెంట్ , స్టీలు సరఫరా చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు, సంబంధిత ప్రభుత్వ అధికారులు సిమెంట్ , స్టీలు ఉత్పత్తి చేసే వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో, ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ధరల కంటే గణనీయంగా తక్కువ ధరకు లబ్ధిదారులకు సిమెంట్, స్టీలును అందించే విషయంపై చర్చించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ప్రస్తుతం మార్కెట్లో సుమారు 320 పలుకుతున్న ఒక సిమెంట్ బస్తాను 260కే అందించాలని అధికారులు ఆయా కంపెనీలను కోరారు. అదేవిధంగా, ప్రస్తుతం టన్నుకు దాదాపు 55,000 ఉన్న స్టీలును 47,000కే సరఫరా చేయాలని ప్రతిపాదించారు. ప్రభుత్వ అంచనాల ప్రకారం, ఒక్కో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సుమారు 180 సిమెంట్ బస్తాలు , 1500 కిలోల స్టీలు అవసరం అవుతాయి. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం తక్కువ ధరలకు సిమెంట్ , స్టీలును సరఫరా చేయగలిగితే, లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ వ్యయం గణనీయంగా తగ్గుతుంది. ఇది పేద ప్రజల గృహ నిర్మాణ భారాన్ని తగ్గించడమే కాకుండా, ఎక్కువ మంది సొంతింటి కలను నెరవేర్చుకోవడానికి సహాయపడుతుంది.



**జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ. హైదరాబాద్‌లో జరిగే తన ఆటోబయోగ్రఫీ తెలుగు వెర్షన్ "ప్రజల కథే నా ఆత్మ కథ" పుస్తకావిష్కరణకు ముఖ్యమంత్రిని ఆహ్వానించిన దత్తాత్రేయ. ఇటీవల ఢిల్లీలో విడుదల చేసిన హిందీ వెర్షన్ జనతా కీ కహానీ, మేరీ ఆత్మకథ**

హైదరాబాద్ (జనంసాక్షి) :

# అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

**రష్యా కాన్సుల్ జనరల్ వాలెరి ఖోడ్జాయేవ్‌తో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి**

**ప్రజాభవన్ లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసిన రష్యా కాన్సుల్ జనరల్ వాలెరి ఖోడ్జాయేవ్**

**హైదరాబాద్, మే 18 (జనంసాక్షి) :** అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి. కలిసి పని చేద్దామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు రష్యా కాన్సుల్ జనరల్ వాలెరి ఖోడ్జాయేవ్ ను కోరారు. ఆదివారం సాయంత్రం ప్రజాభవన్ లో రష్యా కాన్సుల్ జనరల్ వాలెరి ఖోడ్జాయేవ్ (%ఖుశ్రీవతీఱఱ ఖష్ట్రశీసఓ్ఖువజ%) ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రష్యా కాన్సుల్ జనరల్ వాలెరి ఖోడ్జాయేవ్ కు వివరించారు. దేశంలో తెలంగాణ కొత్త రాష్ట్రం అయినప్పటికీ అభివృద్ధిలో దూసుకు వెళ్తున్నదని చెప్పారు. హైదరాబాద్ నగరంలో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేస్తున్నామని, రాష్ట్రంలో ఫార్మా ఇండస్ట్రీ తో పాటు ఇతర పరిశ్రమల అభివృద్ధికి అదే విధంగా హార్డ్వేర్, సాఫ్ట్వేర్ విస్తరణకు కావలసిన సహకారాన్ని ప్రభుత్వం అందించి ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. టెక్స్ టైల్, కోల్ ఇండస్ట్రీ బయోటెక్నాలజీ, టీ హబ్, ఐటీ ఇండస్ట్రీ అభివృద్ధి గురించి వివరించారు. రాష్ట్రంలో అద్భుతమైన మానవ వనరులను తీర్చిదిద్దిన ప్రొఫెషనల్, ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అద్భుతమైన నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధి చేయడానికి ప్రజా ప్రభుత్వం స్కిల్



యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. పెట్టుబడులు పెట్టడానికి అన్ని రకాలుగా తెలంగాణ రాష్ట్రం అనువుగా ఉంటుందని వివరించారు. భారత్- రష్యా దేశాల మధ్య మంచి సత్సంబంధాలు కొనసాగుతున్నాయని, భవిష్యత్తులో కూడా ఇదే విధమైన సత్సంబంధాలు కొనసాగించడానికి కావలసిన అన్ని రకాల సహకారాలు, సదుపాయాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా వాలేరి ఖోడ్జాయేవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అడ్వాన్స్ హైటెక్నాలజీ, పురోగమిస్తున్న పరిశ్రమల అభివృద్ధిని గమనించామని చెప్పారు. అభివృద్ధిలో దూసుకెళ్తున్న తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి మేము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఫార్మా, బయోటెక్నాలజీ ,టీ హబ్, ఐటీ ఇండస్ట్రీ అభివృద్ధి చాలా బాగున్నందున రష్యా పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

# బీర్లను, బార్లను నమ్ముకొని పాలన కొనసాగిస్తారా..?:హరీష్ రావు

**హైదరాబాద్, మే 18 (జనంసాక్షి) :** పాలన గాలికి వదిలి, సంక్షేమ పథకాలను అటకెక్కించి కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువగా ఎక్సర్ సైజ్ చేస్తున్న డిపార్ట్‌మెంట్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ ఒక్కటే అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్‌రావు పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు మద్యంపై రాద్ధాంతం చేసిన వాళ్లే, మద్యం ధరలు పెంచి వేల కోట్ల రాబడిని సమకూర్చుకోవాలనుకోవడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. ఇప్పటికే బీర్ల ధరలను 15 శాతం పెంచిన ప్రభుత్వం, ఇప్పుడు లిక్కర్ ధరలు పెంచి, పేద మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్నదని అన్నారు. ఒకవైపు మద్యం ధరలు పెంచడం, మరోవైపు విక్రయాలను రెండింతలు చేయాలని అధికారులను ఆదేశించడంలోనే ప్రభుత్వం అంతర్యం స్పష్టమవుతున్నదని తెలిపారు. ఎన్నికల ముందు సుద్ద పూస మాటలు, అధికారంలోకి రాగానే అడ్డగోలుగా మద్యం ధరల పెంపు..దివాలా దివాలా అని దిక్కుమాలిన ప్రచారం చేసి రాష్ట్ర పరపతిని దిగజార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనాలోచిత నిర్ణయాలు, దుందుడుకు చర్యల వల్ల రాష్ట్ర ఆర్థిక ప్రగతి రోజు రోజుకి క్షీణిస్తుండగా, ఆ లోటును భర్తీ చేసుకునేందుకు మద్యం ధరలు పెంచడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందని అన్నారు. అభయహస్తం 29వ పేజీలో..ప్రస్తుత ఎక్సయిజ్ విధానాన్ని పునః పరిశీలించి పాలసీలో అవసరమైన సవరణలు చేస్తామని, బెల్ట్ షాపులను పూర్తిగా రద్దు చేస్తామని అన్నారని గుర్తు చేశారు. మద్యం నియంత్రణ విషయంలో మేనిఫెస్టోలో చెప్పిన ఒక్క హామీ అయినా ఇప్పటి వరకు అమలు చేసారా..? అని ప్రశ్నించారు. ఎక్సైజ్ విధానాన్ని పరిశీలించి, సవరణలు చేయడం అంటే ధరలు అడ్డగోలుగా పెంచడమేనా..? అని ముఖ్యమంత్రిని నిలదీశారు. ఇష్టారీతిన మద్యం ధరలు పెంచి, తాగుబోతుల ద్వారా ఖజానా నిలుపుకోవాలని చూస్తారా..? అని అడిగారు. రాష్ట్రాన్ని తాగుబోతుల తెలంగాణ చేసి, మద్యం ద్వారా వచ్చే ఆదాయంలో తెలంగాణను నెంబర్ 1 చేస్తారా..మీరు చెబుతున్న తెలంగాణ రైజింగ్ అంటే ఇదేనా..? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బెల్ట్ షాపులు మూస్తామని హామీ ఇచ్చి, గల్లి గల్లీలో బెల్ట్ షాపు తెరిచి తాగుబోతుల తెలంగాణగా మార్చే కుట్ర కాంగ్రెస్ చేస్తున్నదని మండిపడ్డారు. ఒకవైపు ఎక్సైజ్ ద్వారా ప్రజల నుంచి డబ్బును



ముక్కు పిండి వసూలు చేస్తూ, మరోవైపు ప్రజలకు అందించే సంక్షేమ పథకాలకు బడ్జెట్‌లో సరైన కేటాయింపులు చేయలేదని ఆరోపించారు. ఇచ్చేది ఎగబెడుతున్నరు ఉల్టా ప్రజల నుంచి డబ్బులు లాక్కుంటున్నారని పేర్కొన్నారు. ఇదేనా మీరు చెప్పిన మార్పు అంటే.. ఇంకెన్ని సార్లు మద్యం ధరలు పెంచుతారు.. ఇంకెన్ని కోట్లు ప్రజల నుండి దండుకుంటారు? అని ప్రశ్నించారు. ఇది చాలదన్నట్లు సర్కారు గల్లా పెట్టె ఫుల్లుగా నింపుకోవాటానికి గ్రామీణ జిల్లాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రతి 30 కిలో మీటర్లకు ఒకటి చొప్పున 100కు పైగా మైక్రో బ్రూవరీల ఏర్పాటు చేస్తున్నారని, ఇంతకంటే దిగజారుడు, దిక్కుమాలిన పాలన ఎక్కడైనా ఉంటుందా..? అని అడిగారు. రాష్ట్రాన్ని తాగుబోతుల తెలంగాణ చేసి, భార్యా పిల్లలను రోడ్ల మీద పడేస్తారా.. యువత బతుకులను ఆగం చేస్తారా..అని ప్రశ్నించారు. అసలు ఈ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఏం చేయాలనుకుంటున్నదని హరీష్‌రావు నిలదీశారు.

# చీఫ్ మినిస్టర్ ఓఎస్డీ అంటూ వ్యాపారులకు వల

**సైబర్ నేరగాళ్ల మీద కేసు నమోదు**

**సీఎం ఆఫీసు పేరుతో వ్యాపార సంస్థల యజమానులకు ఈ మెయిల్స్, వాట్సాప్ మెసేజ్‌లు**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో సైబర్ నేరగాళు కొత్త తరహా మోసానికి పాల్పడుతున్నారు. చీఫ్ మినిస్టర్ ఓఎస్డీ (ప్రత్యేక అధికారి) పేరుతో వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని ఈమెయిల్స్, వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా వల విసురుతున్నారు. ఈ నేరాలపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేయబడింది. సీఎం కార్యాలయం పేరుతో వ్యాపార సంస్థల యజమానులకు ఈమెయిల్స్ , వాట్సాప్ మెసేజ్‌లు వస్తున్నాయని, వాటి ద్వారా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు సీఎం ఓఎస్డీ పేరును వాడుకుని, వివిధ వ్యాపార సంస్థల యజమానులను సంప్రదిస్తున్నారు. ప్రభుత్వ పనులకు సంబంధించిన కాంట్రాక్టులు ఇప్పిస్తామని, లేదా ఇతరత్రా సహాయం చేస్తామని నమ్మబలుకుతూ, వారి నుండి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ మోసపూరిత వ్యవహారంపై అజిత్ రెడ్డి ఫిర్యాదు చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి, ఈమెయిల్స్ , వాట్సాప్ మెసేజ్‌లను పంపిన వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేరగాళ్ల వెనుక పెద్ద ముఠానే ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ



నేపథ్యంలో, వ్యాపార సంస్థల యజమానులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. సీఎం కార్యాలయం పేరుతో వచ్చే అనుమానాస్పద ఈమెయిల్స్, వాట్సాప్ మెసేజ్‌లకు స్పందించవద్దని సూచిస్తున్నారు. ఎవరైనా ఇలాంటి మోసపూరిత ప్రయత్నాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరుతున్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి, నేరగాళ్లను పట్టుకునేందుకు పోలీసులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. సీఎం కార్యాలయం పేరుతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు తెలిపారు.

# సంగారెడ్డి జిల్లాలో పాక్ గూఢచారి అరెస్ట్



**సంగారెడ్డి :** పాకిస్థాన్‌తో సంబంధాలు పెట్టుకొని ఇండియా సెక్యూరిటీ సమాచారాన్ని పాక్ వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేస్తున్న అసోంకు చెందిన 19 ఏళ్ల మోఫీజుల్ ఇస్లాంను ఆ రాష్ట్ర పోలీసులు సంగారెడ్డి జిల్లా, గొల్లపల్లిలో పట్టుకున్నారు. భారత్-పాకిస్తాన్‌కు యుద్ధం జరుగుతున్న సమయంలో ఇస్లాంను అరెస్ట్ చేసిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. అసోంకు చెందిన మోఫీజుల్ ఇస్లాం ఇండియా ఫోన్ నెంబర్లతో పాకిస్థానీలకు వాట్సాప్ అకౌంట్‌లు క్రియేట్ చేసేందుకు సహకరిస్తున్నాడనే సమాచారం ఆ రాష్ట్ర పోలీసులకు అందింది. అసోంలో ఆధార్ కార్డులు, ఓటరు కార్డులు లేకుండానే సిమ్ కార్డులు అమ్మాడనే అభియోగంపై ఈనెల 14న గుజరాత్ మిలటరీ ఇంటెలిజెన్స్ అసోం పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే అసోం పోలీసులు ఆపరేషన్ ఘూస్ట్ సిమ్‌ను ప్రారంభించారు. ఈ నెల 16వ తేదీన గొల్లపల్లికి చేరుకొని మోఫీజుల్ ఇస్లాంను అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. అసోంకు చెందిన ఇస్లాం నకిలీ సిమ్ కార్డులతో అకౌంట్‌లు సృష్టించి జాతి వ్యతిరేక కార్యక్రమాలు, సైబర్ నేరాలకు పాల్పడుతున్నాడనే ఆరోపణలతో ఆ రాష్ట్ర పోలీసులు విచారణ ప్రారంభించారు. ఇస్లాం అసోంలో మొబైల్ షాప్‌లో పనిచేసే సమయంలో గుర్తింపు కార్డులు లేకుండా పాకిస్థాన్ గూఢచారిగా ఆ దేశస్థులలకు నకిలీ సిమ్ కార్డులు అమ్మినట్లుగా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కొండాపూర్ సిఐ వెంకటేశంను వివరణ కోరగా.. ఇస్లాంను గొల్లపల్లిలో అసోం పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్లారని అన్నారు. అయితే, తమ వద్ద పూర్తి సమాచారం లేదని తెలిపారు.



# కారులో ఊపిరాడక నలుగురు చిన్నారులు మృతి

**విజయనగరంలో విషాదం**

**విజయనగరం (జనంసాక్షి) :** విజయనగరం కంటోన్మెంట్ పరిధిలోని ద్వారపూడి గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. కారు లాక్ పడటంలో అందులో చిక్కుకున్న నలుగురు చిన్నారులు ప్రాణాలు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం నలుగురు చిన్నారులు ఆడుకునేందుకు బయటకు వెళ్లారు. ఎంతసేపైనా తిరిగి రాలేదు. వారి తల్లిదండ్రులు వెతికినా కనిపించలేదు. చివరికి స్థానిక మహిళా మండలి కార్యాలయం వద్ద ఆగి ఉన్న కారులో నలుగురు చిన్నారుల మృతదేహాలను అక్కడున్నవారు గుర్తించారు. సరదాగా ఆడుకునేందుకు కారులోపలికి వెళ్లిన తర్వాత.. లాక్ పడటంతో ఊపిరి ఆడక మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతులను ఉదయ్ (8), చారుమతి (8), చరిష్మా (6), మనస్విగా గుర్తించారు. వీరిలో చారుమతి, చరిష్మా అక్కాచెల్లెళ్లు. ఒకేసారి నలుగురు పిల్లలు కన్నుమూయడంతో ద్వారపూడిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చిన్నారుల మృతదేహాలను పట్టుకుని తల్లిదండ్రులు, బంధువులు రోధించడం ప్రతి ఒక్కరి హృదయాన్ని ద్రవింపజేస్తోంది.




# బావిలోకి దూసుకెళ్లిన కారు

**ముగ్గురి మృతి**

**పీలేరు (జనంసాక్షి) :** అన్నమయ్య జిల్లా పీలేరు మండలం బాలమువారిపల్లి వద్ద కారు బావిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరు సురక్షితంగా . కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన శివన్న. లోకేశ్, గంగులయ్య, సునీల్, తిప్పారెడ్డి అనే వ్యక్తులు పీలేరులో జరుగుతున్న క్యాటరింగ్ పనులకు బయలుదేరారు. ఆదివారం వేకువ జామున పీలేరు మండలం బాలమువారిపల్లె వ్యవసాయ పొలాల సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి పక్కనే ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సునీల్, తిప్పారెడ్డి ప్రాణాలతో బయటపడగా.. శివన్న, లోకేశ్, గంగులయ్య మృతిచెందారు. ఈమేరకు పీలేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జూన్ 1 నుంచి థియేటర్స్ బంద్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి థియేటర్స్ బంద్ కానున్నాయి. ఈ మేరకు మూవీ ఎగ్జిబిటర్స్ కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన మూవీ ఎగ్జిబిటర్లు(థియేటర్ యజమానులు) తాజాగా సమావేశం అయ్యారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, సురేశ్ బాబు సహా 60 మంది ఎగ్జిబిటర్స్ హాజరయ్యారు. వారు ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. సినీ పరిశ్రమలో ఇకపై అద్దె ప్రాతిపదికన సినిమాలను ప్రదర్శించలేమని వారు తేల్చి చెప్పారు. అద్దె ప్రాతిపదికన సినిమాల ప్రదర్శన ద్వారా తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని థియేటర్ల ఓనర్లు తెలిపారు. తమ నిర్ణయాన్ని ప్రొడ్యూసర్ కౌన్సిల్, ప్రొడ్యూసర్ గిల్డ్ తెలియ జేస్తామని తెలుగు ఫిలింఛాంబర్ పేర్కొంది. ప్రొడ్యూసర్లు తమ నిర్ణయాన్ని గౌరవించి, తమకు సహకరించకపోతే జూన్ 1 నుంచి రెండు తెలుగు రాష్ట్రా ల్లో సినిమా థియేటర్లు బంద్ చేయాలని వారు



నిర్ణయం తీసుకున్నారు. కాగా, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్స్ మధ్య చాలాకాలంగా పర్సంటేజీలపై చర్చ సాగుతోంది. రెంటల్ విధానంలో మూవీస్ ప్రదర్శించడం సాధ్యం కాదని ఎగ్జిబిటర్స్ వాదిస్తుంటే, వారికి పర్సంటేజీలు ఇవ్వలేమని డిస్ట్రిబ్యూటర్స్ తేల్చిచెప్పారు. దీంతో ఇరు వురి మధ్య ఆ సమస్య అలాగే ఉండిపోయింది. ఈ వ్యవహారం నిర్మాతలకు సైతం ఇబ్బందిగా మారుతోంది.

# టెక్స్‌టైల్ మిల్లులో ఘోర అగ్నిప్రమాదం

**యజమాని సహా ఎనిమిది మంది మృతి**



**ముంబై (జనంసాక్షి) :** మహారాష్ట్రలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. సోలాపూర్‌లోని టెక్స్‌టైల్ మిల్లులో భారీగా మంటలు చెలరేగడంతో యజమాని సహా 8 మంది మృతిచెందారు. షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం జరిగినట్లు అధికారులు భావిస్తున్నారు.

**ఇద్దరు చిన్నారులతో యజమాని..**

ఈ మేరకు ఆదివారం 3.45గంటల సమయంలో సోలాపూర్ ఎంఐడీసీలోని అక్కల్‌కోట్ రోడ్డులో ఉన్న సెంట్రల్ టెక్స్‌టైల్ మిల్స్‌లో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ అగ్ని ప్రమాదంలో ముగ్గురు మహిళలు, ఓ చిన్నారి సహా కూడా ఉన్నట్లు తెలిపారు. మిల్లు యజమాని హాజీ ఉస్మాన్ హసన్‌భాయ్ మన్సూరీ, ఆయన ఒకటిన్నరేళ్ల మనవడు, ఆ కుటుంబానికి చెందిన ముగ్గురు సభ్యులు, నలుగురు కార్మికులు చనిపోయినట్లు చెప్పారు. భారీగా మంటలను అదుపు చేసేందుకు 6 గంటలు కష్టపడ్డట్లు ఫైర్ సిబ్బంది తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370